www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో..
మావోయిస్టు అగ్రనేత



జగన్ మృతి

చర్చి పాస్టర్ నుంచి మావోయిజం వైపు
ఏరియా కమిటీ నుంచి కేంద్ర కమిటీకి..
35 ఏళ్లు కొనసాగిన జగన్ ప్రస్థానం
ఆయనపై రూ.25 లక్షల రివార్డు 3

వరదలను అడ్డుకోలేదని..

30 మందికి మరణశిక్ష

2
ఉత్తర కొరియాలో కిమ్ పాశవిక చర్య!

గురువారం | 5-9-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 142 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: విదియ మ. 12.22 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తర ఉ. 6.14 తదుపరి హస్త; వర్జ్యం: మ. 3.44-5.33; దుర్ముహూర్తం: ఉ.10.10-10.59, మ. 3.05-3.54; అమృతఘడియలు: రా.2.37-4.25; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.21 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వీడిన ముంపు
తొలగిన ముప్పు



ట్రాక్టర్లతో చకచకా.. వరద ప్రాంతాల్లో ఆహారం, నీళ్ల సరఫరా చేసేందుకు, నీళ్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి బాధితులను బయటికి తీసుకొచ్చేందుకు భారీ సంఖ్యలో రంగంలోకి దిగిన ట్రాక్టర్లు

వరద నుంచి తేరుకుంటున్న బెజవాడ
80 శాతం ప్రాంతంలో నీరు తగ్గుముఖం
ఊపందుకుంటున్న సహాయ చర్యలు

బాధితులను ఆదుకోవడంపై దృష్టి.. బ్యాంకర్లు, బీమా ప్రతినిధులతో సీఎం భేటీ

- వరద తగ్గిన చోట విద్యుత్ సరఫరా పునరుద్ధరణ
- సుమారు పది వేల మందితో పారిశుధ్య దళం
- ఇళ్లు, వీధుల్లో బురద మేటపై 'ఫైరింజన్'
- ఇతర జిల్లాల నుంచి నీటి ట్యాంకులు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో యంత్రాంగంలో చురుకు
- సహాయం పంపిణీలో పెరిగిన సమన్వయం
- బుడమేరు వరదలో 60 వేల ఇళ్లు పూర్తిగా మునక
- ప్రతి ఇంటికీ కనీసం రూ.లక్ష దాకా నష్టం
- వ్యాపార, వాణిజ్య సంస్థలకు భారీ దెబ్బ

వరద తగ్గుముఖం పడుతోంది. చుట్టుముట్టిన ముంపు వీడుతోంది. అదే సమయంలో... సహాయ ప్రక్రియ ఊపందుకుంది. 'పారిశుధ్య' దళం కదిలింది. మొత్తంగా చూస్తే... బుడమేరు వరదకు వణికిన విజయవాడ నగరం క్రమంగా తేరుకుంటోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను బుధవారం 'ఆంధ్రజ్యోతి' కళ్లకు కట్టినట్లు వివరించడంతో యంత్రాంగంలో చురుకు కనిపించింది. మరోవైపు... బుడమేరుకు పడిన మూడు గండ్లను పూడ్చే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. బుడమేరుకు మళ్లీ వరద వస్తోందనే వదంతులను నమ్మవద్దని జిల్లా యంత్రాంగం ప్రజలకు సూచించింది. ఇక... రెండు రోజుల కిందట విశ్వరూపం ప్రదర్శించిన కృష్ణమ్మ క్రమంగా శాంతిస్తోంది.

విజయవాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బుడమేరు వరద ముంపు మెల్లగా తొలగిపోతోంది. విజయవాడ నగరం కోలుకుంటోంది. బుడమేరు ముంచెత్తడంతో 5 నుంచి 8 అడుగుల వరద నీటిలో మునిగిన అజిత్ సింగ్‌నగర్, పాయకాపురం తదితర ప్రాంతాల్లో దాదాపు 80 శాతం ముంపు నుంచి బయటపడ్డాయి. వరద నీరు తగ్గిన ప్రాంతాల్లో అధికారులు ఎక్కడికక్కడ విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేస్తున్నారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 3454 మంది కార్మికులతోపాటు 450 మంది ప్రజారోగ్య సిబ్బందిని ఈ పనులకు వినియోగిస్తున్నారు. వీరితోపాటు ఇతర మున్సిపాలిటీల నుంచి వచ్చిన 5889 మంది కార్మికులను రంగంలోకి దించారు. కాగా, ఇళ్లలో బురద మేట వేయడంతో దాన్ని శుభ్రం చేసుకునేందుకు తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన అధికారులు ఏకంగా ఫైర్ ఇంజన్లను రంగంలోకి దించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 48 ఫైర్ ఇంజన్లను

మిగతా 11వ పేజీలో...

సమగ్ర కథనాలు 10, 11లో



వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్లలోని బురదను శుభ్రం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వైరల్ జ్వరాల వరద!

- వరద తగ్గక ముందే విజృంభిస్తున్న వ్యాధులు
- బాధితుల్లో ఎక్కువ మందికి వైరల్ ఫీవర్
- 3 రోజులుగా ఆహారం, నీరు లేక నీరసం
- నడిచి రావడంతో స్పృహ కోల్పోతున్న వైనం

వాహనాలకు 12 రోజుల్లో బీమా పరిహారం

- వ్యాపారులు కోలుకోవడానికి ప్యాకేజీ.. ఇళ్లలో నష్టంపై ఆలోచిస్తున్నాం
- నేటి నుంచి బియ్యం, పప్పు దినుసులు పంపిణీ: సీఎం చంద్రబాబు

జగన్ చేష్టలతోనే ఇంతటి విపత్తు

సొంత పేపర్లో బుద్ధిలేని రాతలు

- నాడే బుడమేరు గండ్లు పూడిస్తే సమస్య వచ్చేది కాదు
- ఐదేళ్లూ నిద్రపోయి ఇప్పుడు మాపై విమర్శలా?
- బురదలో మేం పనిచేస్తుంటే.. ఒడ్డున ఉండి రాళ్లేస్తారా?
- బాధితుల కోసం పనిచేయాలా.. దుష్ప్రచారాలు తిప్పికొట్టాలా?
- కట్టలు తవ్వి మట్టి అమ్ముకున్నవాళ్లను వదలం: ముఖ్యమంత్రి

32కు చేరిన వరద మృతులు

గోదావరి ఉగ్రరూపం

ముప్పు ముంగిట కొల్లేరు.. అప్రమత్తమైన యంత్రాంగం
నేడు మళ్లీ అల్పపీడనం.. నాలుగైదు రోజులు వర్షాలు



జేసీబీపై నిలబడి బాధితులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

టీడీపీ ఆఫీసుపై దాడి..
వైసీపీ నేతలకు షాక్

ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ

- సుప్రీంకు వెళ్లేందుకు వీలుగా అరెస్టు నుంచి రక్షణ కల్పించాలన్న అభ్యర్థనకూ నో
- బయట ఉన్నవారి పాత్ర లేదని చెప్పలేం
- పోలీసు సిబ్బందీ సహకరించినట్లు కనిపిస్తోంది: న్యాయమూర్తి
- చంద్రబాబు నివాసంపై దాడి కేసులో జోగి రమేశ్‌కూ చుక్కెదురు



అమరావతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలకు హైకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూకదాడి వ్యవహారంలో ఆ పార్టీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, వైసీపీ నేతలు దేవినేని అవినాశ్, మాజీ ఎంపీ నందిగం సురేశ్, కార్యకర్తలు జి.రమేశ్,

మిగతా 3వ పేజీలో...

అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి

నిందితుల్లో అప్పిరెడ్డి, తలశిల, నందిగం సురేశ్, దేవినేని అవినాశ్

సాయిరెడ్డి కుమార్తె అక్రమ నిర్మాణం

తొలగింపు

- హైకోర్టు ఆదేశాలతో అధికారుల చర్యలు
- 2 వారాల్లో కోర్టుకు నివేదిస్తామని వెల్లడి
- కూల్చివేతపై సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోండి
- నేహారెడ్డికి హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ 3



భీమిలి వద్ద సముద్రతీరంలో విజయసాయిరెడ్డి కుమార్తెకు చెందిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

కొంప కొల్లేరైంది.. బెజవాడ బుడమేరైంది

- జాతీయ విపత్తుగా ప్రకటించండి.. ప్రధాని మోదీకి షర్మిల విజ్ఞప్తి 10
- చంద్రబాబు సహాయ చర్యలు బాగున్నా క్షేత్ర స్థాయికి చేరడం లేదు
- ఆక్రమణల వల్ల బుడమేరు మూసుకుపోయింది
- హైడ్రా మాదిరి ఇక్కడా ఉక్కుపాదం మోపాలి
- సింగ్‌నగర్ ముంపు ప్రాంతంలో షర్మిల పర్యటన



పడవలు కావాలనే వదిలారు: షర్మిల

కాంగ్రెస్‌లోకి వినేశ్ ఫొగాట్!

2

బజరంగ్ పునియా కూడా.. రాహుల్‌గాంధీని కలిసిన రెజ్లర్లు
హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ?

పించను ఇక ఎక్కడి నుంచైనా

- ఈపీఎస్ పించనుదారులకు శుభవార్త
- దేశంలో ఏ బ్యాంకు నుంచైనా పొందొచ్చు
- కేంద్రీకృత చెల్లింపు వ్యవస్థకు ఈపీఎఫ్‌వో ఓకే.. జనవరి 1 నుంచి అమల్లోకి..



2

బాబు అనుభవం పనికొచ్చింది

- ఈ వయసులో కూడా బుల్డోజర్లు ఎక్కి మరీ సహాయ చర్యల్లో పాల్గొంటున్నారు
- బుడమేరు ఆక్రమణలే విజయవాడకు శాపం
- గత ప్రభుత్వ నిర్లక్ష్యమే ముంపునకు కారణం
- వైసీపీ నేతల ఉన్మాద వ్యాఖ్యలు సరికాదు
- రాష్ట్రానికి ప్రధాని మోదీ అభయహస్తం
- వచ్చే 20 ఏళ్లలో ఆక్రమణలు లేకుండా చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి
- తెలంగాణలో హైడ్రాకు సమర్థన 11



పవన్ విరాళం రూ. 6 కోట్లు

- దెబ్బతిన్న పంచాయతీలకు లక్ష చొప్పున రూ.4 కోట్లు సాయం 11
- ఏపీ, తెలంగాణకు రూ.కోటి చొప్పున

ఉద్యోగుల విరాళం 120 కోట్లు

ఒకరోజు జీతం ఇవ్వనున్న ఏపీ జేఏసీ, ఏపీ ఎన్జీవో.. పీఆర్ ఉద్యోగులు మరో 14 కోట్లు 10

మేమున్నామని..

తెలుగు రాష్ట్రాలకు సినీ ప్రముఖుల విరాళాలు

- చిరంజీవి, రామ్‌చరణ్ చెరో రూ.కోటి
- రూ.2 కోట్లు ప్రకటించిన ప్రభాస్
- అల్లు అర్జున్ కోటి, 'అక్కినేని' కోటి
- మరికొందరు సినీ ప్రముఖుల సాయం

సినిమా పేజీలో

మోదీ సర్కారు పతనం త్వరలో

మానసికంగా ప్రధాని పనైపోయింది.. జమ్మూకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో రాహుల్



అనంత్‌నాగ్‌లో ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ, ఎన్‌సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా తదితర నేతలు

జమ్మూ, సెప్టెంబరు 4: మానసికంగా ప్రధాని నరేంద్ర మోదీ పనైపోయిందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. లోక్‌సభలో మోదీ ఎదురుగా కూర్చునే తాను.. ఆ విషయాన్ని స్పష్టంగా గ్రహించగలిగినట్లు చెప్పారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని ఆత్మ విశ్వాసాన్ని కోల్పోయారని పేర్కొన్నారు. త్వరలో ఆయన నేతృత్వంలోని ప్రభుత్వం తొలగిపోతుందని జోస్యం చెప్పారు. ఇద్దరు ధనికుల కోసం ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేసి, జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాను లాగేసుకున్నారని విమర్శించారు. స్వతంత్ర భారత దేశంలో ఒక రాష్ట్ర హోదాను లాగేసుకోవడం ఇదే తొలిసారి అని.. గతంలో కేంద్ర పాలిత ప్రాంతాలు రాష్ట్ర హోదాను సాధించాయని గుర్తుచేశారు. బుధవారం ఆయన జమ్మూకశ్మీర్‌లోని బనిహాల్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన ర్యాలీలో మాట్లాడారు. "ప్రస్తుతం మోదీ, అమిత్‌షా, వారి కార్పొరేట్ మిత్రులు కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. మోదీ హయాంలో నిరుద్యోగిత పెరిగింది. జీఎస్టీ, నోట్ల రద్దు కారణంగా చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మోదీ మిత్రులుగా చెప్పే అదానీ, అంబానీల పేర్లను నేరుగా చెప్పకూడదని నాకు ఆదేశాలున్నాయి. అందుకే నేను వారిని ఏ1, ఏ2 అని పిలుస్తాను. ఈ ప్రభుత్వం తీరు మేమిద్దరం-మాకిద్దరు(మోదీ, షా - అదానీ, అంబానీ) అన్నట్లుగా ఉంది. ఈ నలుగురు కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్నారు" అని రాహుల్ విమర్శించారు. భారత్‌లోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే.. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. కులగణనపై మోదీ అసలు ఆ అవసరం లేదంటారని, కానీ, ఆరెస్సెస్ మాత్రం అది సరైందేనంటుందని ఎద్దేవా చేశారు. "ఇంతకు ముందు ఎన్నికల్లో మీరు చూసే ఉంటారు. మోదీ విశాలమైన ఛాతీతో వచ్చేవారు. ఇప్పుడు మాత్రం రాజ్యాంగాన్ని వెంటబెట్టుకుని వస్తున్నారు. మోదీ తనకు తాను నేరుగా దేవుడితో సంబంధం ఉందని చెప్పుకొంటారు. మోదీ దేవుడితో నేరుగా మాట్లాడొచ్చేమో.. కానీ, జమ్మూకశ్మీర్ ఎన్నికల విషయంలో మాత్రం దేవుడు మాత్రం ప్రజల మాటే వింటాడు" అని రాహుల్ అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు కృషి చేస్తామన్నారు. కాగా.. ఈ నెల 18, 25, అక్టోబరు 1న మొత్తం మూడు దశల్లో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే..!

కాంగ్రెస్‌లోకి వినేశ్ ఫొగాట్?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం ఖాయమైనట్లు కనిపిస్తోంది. బుధవారం ఆమె రాహుల్ గాంధీతో సమావేశమవడం చర్చనీయాంశమైంది. వినేశ్‌తో పాటు బజరంగ్ పునియా కూడా రాహుల్‌ను కలిశారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ పరిణామాలు ఆసక్తి రేపుతున్నాయి. ఎన్నికల్లో వినేశ్, పునియా పోటీ ఖాయమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జులానా స్థానం నుంచి వినేశ్‌ను బరిలో దింపాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తున్నట్లు సమాచారం. ఇక పునియాను బద్లి స్థానం నుంచి పోటీ చేయించాలని చూస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ ఎమ్మెల్యే సీటు ఇవ్వలేకపోతే ఏఐసీసీలో కీలక పదవిని ఇస్తారన్న ప్రచారంకూడా జరుగుతోంది. వీరిద్దరి చేరికతో హరియాణాలో జాట్‌ల ఓట్లు కాంగ్రెస్‌కు అనుకూలంగా మరింత సంఘటితమవుతాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఫొగాట్ కాంగ్రెస్ తరఫున పోటీ చేసినా, ప్రచారం చేసినా పెద్ద సంఖ్యలో ఓట్లు వస్తాయని, మహిళలు నీరాజనాలు పడతారని పేర్కొంటున్నారు. కాంగ్రెస్, ఆప్ మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్న వేళ వీరిద్దరూ కాంగ్రెస్‌లో చేరితే పార్టీకి మరింత బలం చేకూరినట్లవుతుంది. హరియాణా అసెంబ్లీలో 90 సీట్లుండగా.. ఆప్ తమకు 10 స్థానాలు కావాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అయితే కాంగ్రెస్ మాత్రం ఏడు సీట్ల కంటే ఎక్కువ ఇవ్వబోమని చెప్పినట్లు సమాచారం. మరోవైపు వినేశ్ సోదరి బబిత 2019లో బీజేపీ తరఫున దాద్రి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అదే స్థానంలో బబితకు పోటీగా వినేశ్‌ను దించాలని కాంగ్రెస్ ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. కాగా, హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు 67మంది అభ్యర్థులతో తొలి జాబితాను బీజేపీ బుధవారం విడుదల చేసింది. దాని ప్రకారం.. లద్వా నుంచి సీఎం నాయబ్ సైనీ పోటీ చేయనున్నారు.



మండవల్లి మండలం చిన్నయడ్లగాడి వద్ద రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న కొల్లేరు

ముప్పు ముంగిట కొల్లేరు!

▸ ఎగువ నుంచి వస్తున్న భారీ వరద

కైకలూరు, సెప్టెంబరు 4: ఏలూరు జిల్లాలోని కొల్లేరు సరస్సుకు ముప్పు పొంచి ఉంది.బుడమేరు, రామిలేరు, తమ్మిలేరు, చంద్రయ్య కాలువ, మాదేపల్లి చానెల్, పోతునూరి చానెల్, దోసపాడు చానెల్ తదితర 14 చానెళ్ల, 15 కాలువల ద్వారా వేల క్యూసెక్కుల భారీ వరద కొల్లేరులోకి చేరుతోంది. ఈ నేపథ్యంలో తమ గ్రామాలకు ముప్పు ఉంటుందని కొల్లేరు సరస్సు పరిధిలోని 44 లోతట్టు లంక గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం మండవల్లి మండలం పెనుమాకలంక-పెదయడ్లగాడి రోడ్డు, కైకలూరు-ఏలూరు రోడ్డు, కైకలూరు మండలంలో ఆటపాక పక్షుల కేంద్రం సమీపంలో కొల్లేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏటా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే సుమారు 10 వేల క్యూసెక్కుల వరద నీరు కొల్లేరు సరస్సు నుంచి సర్కారు కాలువ ద్వారా ఉప్పుటేరు మార్గం గుండా సముద్రంలో కలుస్తుంది. అయితే, ఉప్పుటేరుపై గతంలో రైల్వే డబ్లింగ్ పనుల నిర్మాణంలో భాగంగా ఉప్పుటేరు మధ్యలో భారీ పిల్లర్లు వేశారు. అదేవిధంగా ఆ ప్రాంతంలో గుర్రపుడెక్క, తూడు అలుముకున్నాయి. దీంతో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. అలాగే ఇటీవల 165వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కైకలూరు మండలం ఆలపాడు శివారు సోమేశ్వరం గ్రామం వద్ద ఉప్పుటేరుపై మరో వంతెన నిర్మాణానికి అధికారులు పనులు చేపట్టారు. నిర్మాణం ప్రారంభం దశలోనే ఉప్పుటేరు సగభాగానికి దట్టంగా ఇసుకను తోలి పూడ్చివేశారు. సాంకేతిక కారణాలతో బ్రిడ్జి నిర్మాణ పనులను నిలిపివేసినా.. తోలిన మట్టి దిబ్బలు ఏరుకు అడ్డుగా ఉన్నాయి. దీంతో నీటి ప్రవాహం సాగడం లేదు. దీంతో ఎగువన ఉన్న కొల్లేరు సరస్సుకు ముప్పు తప్పదనే అంచనాలు వేస్తున్నారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లు బుధవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, భయం అవసరం లేదని స్థానికులకు భరోసా ఇచ్చారు.

తెలుగు రాష్ట్రాల్లో ప్రధాని పర్యటించాలి

▸ చంద్రబాబు ఆధ్వర్యంలో సహాయ చర్యలు భేష్: రామకృష్ణ


అమరావతి(ఆంధ్రజ్యోతి), పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 4: 'తుఫాన్ వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లో నష్టపోయిన ప్రాంతాల్లో ప్రధాని నరేంద్ర మోదీ తప్పనిసరిగా పర్యటించాలి. రెండు రాష్ట్రాలనూ ఆదుకోవాలి' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. బుధవారం నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో తుఫాను ప్రభావం వల్ల పంటలు, రహదారులు దెబ్బతిన్న గ్రామాలను ఆయన తమ పార్టీ నేతలు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న సహాయ చర్యలను అభినందించారు.

ఖరీఫ్‌లో రైతులకు ఉచిత పంటల బీమా అమలు

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఈ-క్రాప్ ఆధారంగా ఉచిత పంటల బీమా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సీజన్‌లో రైతులు ప్రీమియం చెల్లించనవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రవాటా, రైతువాటా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపింది. ఈ మేరకు 2024-26 పంట కాలాలకు ప్రాంతాలు, పంటల వారీగా నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేసింది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునర్‌వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల కింద ఈ ఏడాది ఖరీఫ్ పంటల బీమాకు నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో ఆమోదించిన రైతులకు ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించనున్నది. అయితే ఈ-కేవైసీ తప్పనిసరి. నోటిఫైడ్ ఏరియాల్లో నోటిఫైడ్ పంటలు సాగు చేసే రైతులకు వాతావరణ సమాచారం ఆధారంగా బీమా క్లెయిములు పరిష్కరించనున్నది.

వ్యవసాయ అధికారులపై క్రమశిక్షణ చర్యలు

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలంలోని ఆర్బీకేల్లో ఎరువుల పంపిణీలో అ అక్రమాలకు బాధ్యులైన వ్యవసాయ అధికారులపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు ఆదేశించింది. అప్పటి గుంటూరు జిల్లా జాయింట్ డైరెక్టర్ విజయభారతి, ఏడీ ఉషారాణి, ఏవో చంద్రశేఖర్‌లపై విచారణ జరిపిన మీదట శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.



వరదలను అడ్డుకోలేదని.. 30 మందికి మరణశిక్ష!



ప్యాంగ్యాంగ్, సెప్టెంబరు 4: ఇటీవలి వరదలతో అతలాకుతలమైన ఉత్తర కొరియాలో.. ఆ దేశ అధినేత కిమ్ జాంగ్ ఉన్ 30 మంది అధికారులకు మరణ శిక్ష విధించారు. కారణమేంటంటే..? వారు వరదలను అడ్డుకోలేకపోవడమేనట..! విపత్తు నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియోగాలపై ఆ 30 మందికి మరణశిక్ష అమలు చేయాలని కిమ్ ఆదేశాలు జారీ చేసినట్లు పలు అంతర్జాతీయ వార్తాసంస్థలు కథనాలను ప్రసారం చేశాయి. అవినీతి, విధుల్లో నిర్లక్ష్యం పేరుతో గత నెల 20-30 మంది అధికారులకు కిమ్ మరణశిక్ష విధించారని తొలుత దక్షిణ కొరియాకు చెందిన 'చోసన్ టీవీ'లో ఓ కథనం ప్రసారమైంది. ఆ తర్వాత కొద్దిరోజులకే వీరికి మరణశిక్షను అమలు చేసినట్లు మరో కథనం పేర్కొంది. జూలై, ఆగస్టు నెలల్లో ఉత్తర కొరియాలో భారీ వర్షాలతో 4 వేల మంది ప్రాణాలు కోల్పోయారు.

పింఛను.. ఇకపై ఎక్కడి నుంచైనా!

దేశంలో ఎక్కడ, ఏ బ్యాంకు నుంచైనా తీసుకోవచ్చు

▸ కేంద్రీకృత పింఛను చెల్లింపు వ్యవస్థకు ఈపీఎఫ్‌వో ఆమోదం

▸ వచ్చే జనవరి 1 నుంచి అమల్లోకి: కేంద్ర మంత్రి మాండవీయ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: కేంద్ర ప్రభుత్వం ఈపీఎస్ పింఛన్‌దారులకు శుభవార్త చెప్పింది. పింఛనుదారులు ఇకపై దేశంలో ఎక్కడి నుంచైనా పింఛను తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఏ ప్రాంతంలో ఉన్నా, ఏ బ్యాంక్ నుంచైనా పింఛను తీసుకునే వీలు కల్పించింది. ఈ మేరకు కేంద్రీకృత పింఛను చెల్లింపు వ్యవస్థ (సీపీపీఎస్)ను తీసుకొచ్చేందుకు ఈపీఎఫ్‌వో ఆమోదం తెలిపినట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి, ఈపీఎఫ్‌వో ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ మన్సుఖ్ మాండవీయ వెల్లడించారు. 2025 జనవరి 1 నుంచి ఈ సదుపాయం అందుబాటులోకి రానుందని తెలిపారు. దీనివల్ల 78 లక్షల మంది పింఛన్‌దారులకు ప్రయోజనం కలగనుందని చెప్పారు. పింఛనుదారులు ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి వెళ్లినప్పుడు పింఛను పేమెంట్ ఆర్డర్ (పీపీవో)ను బదిలీ చేసుకోవాల్సిన అవసరం ఉండదన్నారు.

సీపీపీఎస్‌తో సమూల మార్పులు..

సీపీపీఎస్ ప్రస్తుత పింఛను పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ప్రస్తుతం ఈపీఎఫ్‌వో జోనల్/ప్రాంతీయ కార్యాలయాలు కేవలం 3-4 బ్యాంకులతో మాత్రమే ఒప్పందాలు కలిగి ఉన్నాయి. పింఛను ప్రారంభ సమయంలో పింఛనుదారులు ధ్రువీకరణ కోసం సంబంధిత బ్యాంకుకు వెళ్లాలి. కేంద్రీకృత విధానం వల్ల ఇకపై ఆ అవసరం తప్పుతుంది. పింఛను విడుదలైన వెంటనే, ఆ మొత్తం పింఛనుదారు ఖాతాలో జమవుతుంది. ఆధార్ చెల్లింపు వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు మాండవీయ చెప్పారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు పింఛను కట్

కొత్త బిల్లుకు హిమాచల్ అసెంబ్లీ ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: పార్టీ ఫిరాయింపులను అరికట్టేందుకు హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. పార్టీని ఫిరాయించిన ఎమ్మెల్యేలకు పింఛన్‌ను రద్దయ్యేలా రూపొందించిన కొత్త బిల్లుకు ఆ రాష్ట్ర శాసనసభ బుధవారం ఆమోదం తెలిపింది. ఫిరాయింపు నిరోధక చట్టం(10వ షెడ్యూల్) కింద అనర్హత వేటు ఎదుర్కొన్న సభ్యులకు ఈ నిబంధన వర్తిస్తుంది. హిమాచల్‌ప్రదేశ్ శాసనసభ(సభ్యుల అలవెన్సులు, పింఛన్లు) సవరణ బిల్లును ఆ రాష్ట్ర సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు ప్రవేశపెట్టిన బిల్లుకు మెజార్టీ సభ్యులు మూజువాణి ఓటు ద్వారా మద్దతు తెలిపారు. అయితే, పార్టీ ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్‌పార్టీ సర్కస్‌ఫీట్లు చేస్తోందని, ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. "తెలంగాణలో ప్రతిపక్ష పార్టీల నాయకులను ప్రలోభ పెట్టి పార్టీ మారేలా చేయాలి.. అదే హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే... పింఛన్ ఇవ్వబోమని చట్టం చేయాలి. ఇదేం వైఖరి" అంటూ ఆయన 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.

నరేంద్ర మోదీ గారూ.. స్వాగతం

▸ ఘనంగా ఆహ్వానించిన సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్



ప్రధాని మోదీతో లారెన్స్ వాంగ్

సింగపూర్, సెప్టెంబరు 4: విదేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ బుధవారం సింగపూర్‌కు చేరుకొన్నారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ మోదీని ఘనంగా ఆహ్వానించారు. ప్రతిష్ఠాత్మక శ్రీ తెమాసెక్ భవనంలో ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా "నరేంద్ర మోదీ గారు.. సింగపూర్‌కు స్వాగతం" అంటూ మోదీతో కలిసి ఉన్న ఫొటోను ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. గురువారం వీరిరువురూ అధికారికంగా భేటీ కానున్నారు. ఈ సందర్భంగా పలు అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. లారెన్స్ వాంగ్ ఆహ్వానం మేరకే మోదీ సింగపూర్ పర్యటనకు వెళ్లారు. ఆ దేశం నుంచి పెట్టుబడులను ఆకర్షించడం, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా మోదీ సింగపూర్‌లో పర్యటిస్తున్నట్లు విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాని హోదాలో మోదీ సింగపూర్‌లో పర్యటించడం ఇది ఐదోసారి. మరోవైపు, గురువారమే సింగపూర్ పార్లమెంటుహౌస్‌లో ఆ దేశ అధ్యక్షుడు షణ్ముగరత్నంను మోదీ కలుసుకోనున్నారు. సింగపూర్‌లో వ్యాపారవేత్తలతో కూడా భేటీ కానున్నారు. అంతకుముందు మోదీ బ్రూనై పర్యటనలో ఆ దేశ సుల్తాన్ హసనల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని కీలక ప్రకటన చేశారు. త్వరలో రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

రూ.కోటి మాటలు చెప్పి ఇలాగేనా సాయం జగన్?

▸ పాలు, వాటర్ బాటిళ్లతో మల్లాది, వెల్లంపల్లి

▸ మధ్యాహ్నం తర్వాత రెండు వ్యాన్లతో హడావుడి

▸ వాటి వంక కూడా చూడని వరద బాధితులు

▸ అధినేత ఆదేశించినా విజయవాడ ముఖ్యనేతలంతా దూరం

అమరావతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని వరద ప్రాంత బాధితులకు కోటి రూపాయల విరాళం ప్రకటించిన వైసీపీ అధినేత జగన్.. దానిని ఎలా వినియోగించేదీ చెప్పలేదు. బుధవారం మాత్రం రెండు వ్యాన్లలో పాలప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లతో వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాసరావు వరద ప్రాంతాల్లో హడావుడి చేశారు. మధ్యాహ్నం రెండు గంటలు దాటాక తీసుకువచ్చిన పాలూ .. వాటర్ బాటిళ్ల వంక బాధితులు కన్నెత్తి కూడా చూడలేదు. సాయం చేయాలన్నా ఒక సమయం ఉంటుందని, మిట్టమధ్యాహ్నం దాటక పాలు తీసుకువస్తే ఎవరు తీసుకుంటారని పలువురు అసహనం వ్యక్తం చేయడం కనిపించింది. బయట గంటసేపు ఉంటే పాలు విరిగిపోతాయని, అవి ఎందుకూ పనికిరాకుండా పాడై పోతాయని వారికి తెలిపారు. ప్రధాన రహదారిలో కాకుండా సందుల్లోకి వెళ్లి ఇస్తామంటూ ఒక జేసీబీలోకి పాలప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను ఎత్తారు. అయినా, వాటిని పంచుతారా అని కూడా ఎవరూ అడగలేదు. దీంతో అక్కడక్కడ కొన్ని పాల ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లు పంపిణీ చేసి వారు వెనుదిరిగారు. మరోవైపు మల్లాది, వెల్లంపల్లి వెంట విజయవాడకు చెందిన వైసీపీ ముఖ్య నేతలెవరూ లేరు. పట్టుమని పదిమంది కూడా కార్యకర్తలు కనిపించలేదు. మంగళవారం వైసీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యనేతలతో జగన్ సమావేశమయ్యారు. అక్కడే తన వరద విరాళం ఆయన ప్రకటించారు. ఆ విరాళాన్ని ఎలా వినియోగించాలనేది పార్టీ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని మెలిక పెట్టారు. వరద బాధితులకు సాయమందించాలని అదే సమావేశంలో జగన్ ఆదేశించారు. కానీ, వరద నష్టం ఎక్కువగా చోటుచేసుకున్న విజయవాడలోనూ అక్కడి స్థానిక ముఖ్యనేతలెవరూ... మల్లాది, వెల్లంపల్లి వెంట కనిపించకపోవడం గమనార్హం. హాజరయినవారిలో విజయవాడ నుంచి వారిద్దరు మాత్రమే ఉన్నారు. విజయవాడ ఎంపీగా వైసీపీ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన కేశినేని నాని ఎన్నికల ఫలితాల తర్వాత కనిపించడమే మానేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసిన దేవినేని అవినాశ్ సహా నేతలెవరూ రాలేదు.

ఐదు రోజుల తర్వాత ఇప్పుడు వస్తారా?

▸ బొత్సను నిలదీసిన బాధితులు

విజయవాడ రాజరాజేశ్వరిపేటలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు చేదు అనుభవం ఎదురైంది. తాము ఐదు రోజులుగా బాధపడుతుంటే ఇప్పుడొస్తారా అంటూ బాధితులు ఆవేశంతో బొత్సను ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం రాజరాజేశ్వరిపేటలో ఆయనను చూడగానే బాధిత మహిళలు చుట్టుముట్టారు. ఆగ్రహ,ఆక్రోశాలను వెళ్లగక్కారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయం కూడా దక్కకుండా చేసేందుకు వచ్చారా అంటూ అసహనం వ్యక్తంచేశారు. మీరేం సాయం చేస్తున్నారంటూ నిలేశారు. మహిళల అనూహ్య నిరసనలతో బొత్స, ఆయన వెంటఉన్నవారు ఖిన్నులయ్యారు. తాము అధికారంలో లేమని సణుక్కుంటూ బొత్స వెనుదిరిగారు.

వరదలో వికృత రాజకీయం

▸ తప్పుడు ప్రచారంతో వైసీపీ మూక రాక్షసానందం

▸ ఏకంగా బంగ్లాదేశ్ వరద ఫొటోను బుడమేరుకు పులిమేశారు

▸ జగన్ బాటలోనే వైసీపీ బ్యాచ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



(కుడివైపు) బంగ్లాదేశ్ వరద ఫొటో, (ఎడమవైపు) అదే ఫొటోను బుడమేరు వరదకు వాడిన దృశ్యం

విజయవాడ, పరిసర గ్రామాల్లో గతంలో ఎప్పుడూ లేనంతగా వచ్చిన వరదలకు లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పగలూ, రాత్రీ నిర్విరామంగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మంత్రులు, అధికారులు బాధితులను ఆదుకునే పనిలో నిమగ్నమయ్యారు. అయితే ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ వైసీపీ మూక వికృత రాజకీయం చేస్తోంది. ప్రభుత్వంపై బురద జల్లేందుకు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తోంది. ఆవు చేలో మేస్తే దూడ గట్టును మేస్తుందా అన్నట్లు వైసీపీ అధ్యక్షుడు జగన్.. చంద్రబాబుపై తప్పుడు ఆరోపణలు చేసినట్లుగానే వైసీపీ బ్యాచ్ రెచ్చిపోతోంది. ఎక్కడో బంగ్లాదేశ్‌లో ఇటీవల వరదలు సంభవించినప్పటి ఫొటోను బుడమేరుకు పులిమేశారు. బంగ్లాదేశ్ పౌరుడు ఒకరు అక్కడ వరదల తీవ్రతను వివరిస్తూ సోషల్ మీడియాలో ఓ ఫొటో పోస్టు చేశారు. వైసీపీ సానుభూతిపరుడు అదే ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసి బుడమేరు వరదల వల్ల సంభవించినట్టు కామెంట్ చేశాడు. 'వరద ముప్పు తగ్గాక బుడమేరు గురించి చాలా చర్చ జరగాలి. కరకట్ట సేఫ్టీ కోసం బుడమేరు గేట్లు తెరిచారని చర్చ. అదే నిజమైతే ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే అతిపెద్ద చరిత్రహీనుడు అవుతాడు' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశిస్తూ పోస్టు చేశాడు. విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా జగన్.. చంద్రబాబు ఇంటికీ, బుడమేరు వరదలకు లింక్ పెట్టి పొంతలేని ఆరోపణలు చేశారు. బంగ్లాదేశ్ వరద ఫొటో పెట్టి విమర్శలు చేసిన వైసీపీ సానుభూతిపరుడు కూడా జగన్‌ను ఫాలో అయినట్టు ఉన్నాడు. జగన్ పర్యటన సందర్భంగా ఓ మహిళ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ ఆయన మొహం మీదే మాట్లాడిన సంగతి తెలిసిందే. అయితే విజయవాడ ముంపు ప్రాంతాల్లో మంచినీళ్లు దొరకడం లేదని, బిస్కెట్లు మాత్రమే ఇస్తున్నారని వైసీపీ పెయిడ్ ఆర్టిస్టులు అదేపనిగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి ప్రచారం చేస్తున్నవారంతా చాలా 'ఫ్రెష్'గా కనిపిస్తున్నారు.

లాజిక్ మరిచిన జగన్

▸ కృష్ణా, బుడమేరు ప్రవాహ మార్గాలు వేరు

▸ ఆ గేట్లు ఎత్తకున్నా బాబు ఇంటికి మునక ప్రమాదం లేదు

▸ అయినా పొంతన లేని విమర్శలు

వాస్తవానికి విజయవాడకు ఓ వైపున కృష్ణా నది ప్రవహిస్తే, మరోవైపు బుడమేరు ఉంటుంది. ఈ రెండింటి ప్రవాహ మార్గాలు వేర్వేరు. కృష్ణా నది ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి సముద్రంలో కలుస్తుంది. బుడమేరు ఉమ్మడి కృష్ణా నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోకి వెళ్తుంది. కృష్ణా నదిలోని నీటిని బుడమేరుకు వదిలే అవకాశమే లేదు. కృష్ణా నది ఒడ్డున చంద్రబాబు ఇల్లు ఉంటుంది. స్థానిక వాగుల నుంచి కృష్ణా నదిలోకి వచ్చిన భారీ వరదను ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తి సముద్రంలోకి విడుదల చేశారు. బుడమేరు ఉధృతిని తగ్గించడానికే వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ గేట్లు ఎత్తి కొంత మేర నదిలోకి వదిలారు. అసలు గేట్లు ఎత్తకున్నా చంద్రబాబు ఇంటికి వచ్చే ముంపు ప్రమాదం ఏమీ లేదు. వాస్తవానికి ఆక్రమణలతో బుడమేరు కుంచించుకుపోవడంతో పాటు భారీ వరద ప్రవాహం రావడంతో బుడమేరు పొంగి విజయవాడను ముంచెత్తింది. అయితే జగన్ లాజిక్ మరిచి ఆరోపణలు చేశారు. కరకట్టపై ఉన్న చంద్రబాబు ఇల్లు మునిగిపోకుండా ఉండటం కోసం బుడమేరును ముంచేశారని, విజయవాడలోని ప్రాంతాన్ని నీటిమయం చేశారని జగన్ విమర్శించారు. దీనిపై నెటిజెన్లు ఆడుకున్నారు. ప్రకాశం బ్యారేజీ, బుడమేరు మధ్య దూరం, వ్యత్యాసం ఏమిటో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని, లేకుంటే వైసీపీ అబద్ధపు ప్రచారాన్ని జనం నమ్మే ప్రమాదముందని టీడీపీ శ్రేణులు, అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

అమరావతిపై వైసీపీ దుష్ప్రచారం

▸ ఒక్క గ్రామంలోనూ వరద ముంపు లేదు

▸ హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ సీడ్ యాక్సెస్ రోడ్డులో ఎక్కడా నీరు లేదు

▸ బహుజన జేఏసీ అధ్యక్షుడు బాలకోటయ్య



తుళ్లూరు, సెప్టెంబరు 4: వరదకు, వర్షపు నీరు నిల్వ ఉండటానికి తేడా ఉంది. రాజధాని అమరావతిలో చాలా వరకు ఖాళీ భూములు ఉన్నాయి. భారీ వర్షాలు కురిసినపుడు పొలాల్లో నీరు నిల్వడం సహజం. పొలాల్లో నిలిచిన నీటిని వరదగా పేర్కొంటూ, రాజధానిలో పలు గ్రామాలను వరద ముంచిందంటూ వైసీపీ ప్రచారం చేయడాన్ని స్థానిక రైతులు తప్పుపడుతున్నారు. రాజధానికి భూములిచ్చిన ఏ ఒక్క గ్రామం కూడా వరదకు కానీ, ముంపునకు కానీ గురికాలేదని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య అన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ... అమరావతిలో హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ సీడ్ యాక్సెస్ రోడ్డులో ఎక్కడా నీరు లేకపోయినా వైసీపీ సోషల్ మీడియా పనికట్టుకుని దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో అమరావతిపై విషం కక్కి రైతులను ఇబ్బందులు పెట్టిన మాజీ సీఎం జగన్‌రెడ్డి అండ్‌కోకు ఇంకా బుద్ధి మారలేదని ఎద్దేవా చేశారు. ఐదు కోట్ల మంది కోరుకునే అమరావతి రాజధానిపై ఇంకా బురదజల్లే ప్రయత్నం వైసీపీ చేయటం దుర్మార్గమన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన జగన్ పార్టీకి ప్రజలు ఎన్నికల్లో కేవలం 11 సీట్లు ఇచ్చి బుద్ధి చెప్పినా ఇంకా ఆ పార్టీ నేతలు తెలుసుకోకపోవటం శోచనీయమని విమర్శించారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు, వరదలకు ఇబ్బందులు పడ్డ సంఘటనలు ఎన్నో ఉన్నాయని, అమరావతికి వరద నీరు వస్తే ఆశ్చర్యం ఏముందని ప్రశ్నించారు. పదే పదే అమరావతి మునిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇల్లు మునిగిందంటూ వైసీపీ దుష్ప్రచారానికి పరిమితమైంది తప్ప.. లక్షలాది నిర్వాసితులను ఆదుకోవటంలో విఫలమైందన్నారు. గత నాలుగు రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు మోకాళ్ల లోతు నీళ్లలో నడుస్తూ, జేసీబీపై ప్రయాణిస్తూ బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్నారని, అయితే వైసీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడా కనిపించటం లేదని విమర్శించారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి కూడా కెమెరా, యాక్షన్ అన్నట్టు కాసేపు నటించి వెళ్లిపోయారన్నారు. బుడమేరుకు, కృష్ణా నదికి ఎలాంటి సంబంధం లేదని, బుడమేరు ఎక్కడ ఉందో జగన్‌కు తెలియదని, బుడమేరు వాగును నదిగా పోల్చటంతోనే జగన్‌రెడ్డి అవగాహనా రాహిత్యం అర్థం అవుతుందన్నారు.

హైడ్రాపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేయలేదు: కేవీపీ

హైదరాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పరిసరాల్లో హైడ్రా కూల్చివేతలకు సంబంధించి అధిష్ఠానానికి తాను ఎలాంటి ఫిర్యాదు చేయలేదని కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు స్పష్టం చేశారు. హైడ్రాపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేసిన వారి జాబితాలో కేవీపీ పేరు కూడా ఉన్నట్లు వినిపిస్తోందని ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీనిపై కేవీపీ బుధవారం వివరణ ఇచ్చారు. తాను అధిష్ఠానం వద్దకు వెళ్లలేదని, పెద్దలెవర్నీ కలవలేదనీ, హైడ్రాపై ఎవరికీ ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పారు.



బెల్లంతో వినాయక విగ్రహం!

వినాయక చవితి సందర్భంగా విశాఖపట్నం పారిశ్రామిక ప్రాంతంలో బెల్లం వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటుచేస్తున్నారు. జీవీఎంసీ 58వ వార్డు పరిధిలో గల గాజువాక ఆర్టీసీ డిపో పక్కనున్న ఏపీఐఐసీకి చెందిన స్థలంలో 75 అడుగుల ఎత్తు, 24 అడుగుల వెడల్పు కలిగిన భారీ విగ్రహం నెలకొల్పేందుకు సిద్ధం చేస్తున్నారు. అనకాపల్లికి చెందిన కళాకారులు గత ఇరవై రోజులుగా విగ్రహం తయారీలో నిమగ్నమై ఉన్నారు. శుక్రవారం నాటికి విగ్రహం పూర్తవుతుందని తెలిపారు.

-మల్కాపురం (విశాఖపట్నం)

టీడీపీ ఆఫీసుపై దాడి.. వైసీపీ నేతలకు షాక్!

(మొదటి పేజీ తరువాయి)

షేక్ రబ్బానీ బాషా, చిన్నాబత్తిన వినోద్‌కుమార్, మరికొందరికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అధికారాన్ని వినియోగించి కేసు దర్యాప్తు ముందుకు సాగకుండా పిటిషనర్లు గత మూడేళ్లుగా దర్యాప్తు అధికారులను ప్రభావితం చేశారని, ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తులో పురోగతి సాధ్యపడదని ప్రాసిక్యూషన్ తరఫు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ చేసిన వాదనలతో ఏకీభవించింది. కాల్ రికార్డు, ఇతర సాంకేతిక ఆధారాలు సేకరించాల్సి ఉందని, పిటిషనర్ల మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, వారిని కస్టడీలో విచారించాల్సిన అవసరం ఉందన్న పోలీసుల వాదనను సమర్థించింది. పిటిషనర్లు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ బుధవారం తీర్పు ఇచ్చారు. తీర్పు వెల్లడించిన అనంతరం పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు పి.వీరారెడ్డి, ఎల్ రవిచందర్ స్పందిస్తూ.. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు ఆశ్రయించేందుకు వీలుగా రెండు వారాల పాటు పిటిషనర్లకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫున లూథ్రా స్పందిస్తూ.. ముందస్తు బెయిల్ పిటిషన్లు తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి వీల్లేదని తెలిపారు. పిటిషనర్లు, ప్రాసిక్యూషన్ సమర్పించిన తీర్పు ప్రతులను పరిశీలించిన న్యాయమూర్తి.. అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు తిరస్కరించారు. నిందితులకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ తీర్పు ఇచ్చాక.. అరెస్టు చేయకుండా రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధమని స్పష్టం చేశారు.

వారందరికీ సమాన పాత్ర!

'ఓ పార్టీకి చెందిన వ్యక్తి మరో పార్టీపై ఏమైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే, బాధ కలిగిన వ్యక్తులు చట్టపరమైన ప్రక్రియ ద్వారా దానికి పరిష్కారం కనుగొనాలి, ప్రస్తుత కేసులో అందుకు విరుద్ధంగా పార్టీ కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో రాజకీయ ప్రత్యర్థులను కేసులో ఇరికిస్తున్నారన్న పిటిషనర్ల వాదనలో ఏకీభవించలేం. టీడీపీ కార్యాలయంపై దాడిలో గుంపుగా వచ్చిన వ్యక్తులు, వారికి నేతృత్వం వచ్చిన నాయకులకు సమాన పాత్ర ఉంది. దాడి జరిగినప్పుడు కొందరు వ్యక్తులు కార్యాలయం బయటే ఉన్నారనే కారణంతో నేర ఘటనలో వారి ప్రమేయం లేదని చెప్పలేం. దాడిలో బాధితులైనవారితో నిందితులకు వ్యక్తిగతంగా వివాదాలు లేవు. అయినప్పటికీ ప్రత్యర్థి రాజకీయ పార్టీ కార్యాలయానికి వెళ్లి దాడి చేశారు. ఫిర్యాదుదారుడి గొంతు నులిమి స్పృహ కోల్పోయేలా చేశారు. అందుచేత ఐపీసీ సెక్షన్ 307 కింద కేసు నమోదు చేయడం తప్పు కాదు. ఘటన జరిగిన ప్రదేశంలో ఉన్న పోలీసు సిబ్బంది సైతం నిందితులకు సహకరిస్తున్నట్లు కనబడుతోంది. దర్యాప్తులో చోటు చేసుకున్న తీవ్ర జాప్యాన్ని పరిశీలిస్తే దర్యాప్తు సంస్థను బయట వ్యక్తులు ప్రభావితం చేసినట్లు అర్థమవుతోంది. సరైన సెక్షన్లు నమోదు చేయకుండా కేసు దర్యాప్తు చేయడం పోలీసుల అసమర్థత కిందకు వస్తుంది. అదనపు సెక్షన్లు చేర్చడంపై నిందితులు అభ్యంతరం చెప్పడాన్ని తోసిపుచ్చుతున్నాం. పిటిషనర్ల ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేస్తున్నాం' అని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

ధర్నా పేరిట విపక్ష నేత టార్గెట్టా? జోగి, అనుచరుల పిటిషన్లూ కొట్టివేత

చంద్రబాబు విపక్ష నేతగా ఉన్నప్పుడు ఆయన ఇంటిపై దాడి చేసిన వ్యవహారంలో వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేశ్‌కు కూడా హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు, ఆయన అనుచరులు 13 మందికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ బుధవారం తీర్పు ఇచ్చారు. తీర్పు వెల్లడించిన అనంతరం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు వీలుగా అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్లు చేసిన అభ్యర్థనను కూడా తిరస్కరించారు. 'పిటిషనర్లలో ఏ ఒక్కరి పై ఎలాంటి వ్యాఖ్యలు చేయనప్పటికీ చంద్రబాబు నివాసం వద్దకు వచ్చి వారందరూ హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. ధర్నా పేరుతో అక్కడకు వచ్చి అప్పటి ప్రతిపక్ష నేతను టార్గెట్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఈ తరహా చర్యలను ఆమోదించలేం' అని తీర్పులో పేర్కొన్నారు.

ఇటు వరద ముంపు.. అటు నేతల అరెస్టు ముప్పు!

- లండన్ పర్యటనపై జగన్ తర్జనభర్జన
- 7న వెళ్తారంటున్న వైసీపీ వర్గాలు

అమరావతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లండన్ పర్యటన డోలాయమానంలో పడింది. కుమార్తె పుట్టినరోజు వేడుకకు హాజరయ్యేందుకు లండన్ వెళ్లడానికి సీబీఐ కోర్టు నుంచి ఆయన ఇప్పటికే అనుమతి తీసుకున్నారు. ఈ నెల 25వ తేదీలోగా తిరిగి వచ్చేస్తానని కోర్టుకు నివేదించారు. ఈ నెల ఏడో తేదీన జగన్ దంపతులు బయల్దేరాల్సి ఉంది. అయితే విజయవాడ వరద ముంపులో లక్షలాది మంది చిక్కుకుపోయారు. వరద సంభవించిన రెండ్రోజుల తర్వాత జగన్ సింగ్‌నగర్‌లో మొక్కుబడిగా పర్యటించి.. సీఎం చంద్రబాబు వల్లే వరద వచ్చిందని చేసిన ఆరోపణలు, తన నివాసాన్ని కాపాడుకోవడానికి లేని బుడమేరు గేట్లు ఎత్తారంటూ తెలియకుండా మాట్లాడడంపై రాజకీయంగా విమర్శలు వెల్లువెత్తాయి. వైసీపీ తరఫున కోటి రూపాయల సాయమందిస్తానన్న ఆయన.. ఈ విరాళం సీఎం సహాయనిధికి కాకుండా ఏదో రూపంలో అందిస్తాననడంపైనా అభ్యంతరాలు వచ్చాయి. పుట్టెడు కష్టాల్లో ఉన్న బుడమేరు బాధితులను వదిలేసి కుమార్తె పుట్టిన రోజు కోసం తాను లండన్‌కు వెళ్తే రాజకీయంగా దుమారం రేగుతుందని ఆయన భయపడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైసీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించడంతో వారు అరెస్టు ముప్పును ఎదుర్కొంటున్నారు. ఏ క్షణంలోనైనా వీరి అరెస్టు తప్పదని ఆ పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. అటు జనాలను, ఇటు పార్టీ నేతలను వదిలేసి లండన్ వెళ్లడం రాజకీయంగా మంచిది కాదని జగన్ అభిప్రాయపడుతున్నారని అంటున్నాయి. ఏదీ తేల్చుకోలేకపోతున్నారని చెబుతున్నారు. అయితే ఆయన 7న లండన్ వెళ్తారని వైసీపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి

- నిందితుల్లో అప్పిరెడ్డి, తలశిల, నందిగం సురేశ్, దేవినేని అవినాశ్
- విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త అరెస్టు!?

గుంటూరు/విజయవాడ/తుళ్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించడంతో అరెస్టులు, గాలింపులు మొదలయ్యాయి. ఈ కేసులో నిందితుడైన విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త శ్రీనివాసరెడ్డిని మంగళగిరి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. ఇక... వైసీపీ కీలక నేతలు, ఇతర నేతలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు కోర్టు నిర్ణయం వెలువడిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి, నిందితులకోసం గాలింపు మొదలుపెట్టారు. రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలం ఉద్దండ్రాయునిపాలెం గ్రామంలో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేశ్ ఇంటికి వెళ్లారు. అయితే ఆయన ఇంట్లో లేరని కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో ఒక హత్య కేసులోనూ నందిగం సురేశ్ ప్రమేయం ఉందని, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని తెలిసింది. ఇక ఇదే కేసు లో నిందితులైన మాజీ మంత్రి జోగి రమేశ్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్ కూడా నిందితులుగా ఉన్నారు. వారు కూడా అజ్ఞాతంలోకి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

మరో 68 మంది పిటిషన్‌పై రేపు తీర్పు

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ మరో 68 మంది నిందితులు గుంటూరు జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇప్పటికే కోర్టు ఇరువర్గాల వాదనలను వినింది. గురువారం తీర్పు వెలువరించనుంది.

నేటికీ ఆచూకీలేని ప్రధాన నిందితుడు

టీడీపీ ప్రధాన కార్యాలయంలో కీలక నిందితుడు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి ముఖ్య అనుచరుడు పానుగంటి చైతన్య ఆచూకీని ఇప్పటిదాకా పోలీసులు గుర్తించలేకపోయారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజునే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

3 కౌంటర్ వెయిట్ల బాధ్యత బెకమ్‌కు

- హైదరాబాద్‌లో తయారీ.. నేడో రేపో బెజవాడకు
- ప్రకాశం బ్యారేజీలో నిలిచిన బోట్లను తొలగించే బాధ్యతా ఆ సంస్థకే
- నేటి నుంచే ఆ పనులు ప్రారంభం

అమరావతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇనుప బోట్లు వరద ప్రవాహంలో దూసుకొచ్చి ప్రకాశం బ్యారేజీ కౌంటర్ వెయిట్లను ఢీకొనడంతో దెబ్బతిన్న మూడు సిమెంటు దిమ్మెల (కౌంటర్ వెయిట్లు) తయారీ-బిగింపు బాధ్యతలను హైదరాబాద్‌కు చెందిన బెకమ్ సంస్థకు జల వనరుల శాఖ అప్పగించింది. 69, 67, 64 నంబరు ఖానాల వద్ద ఉన్న ఈ వెయిట్లకు సంబంధించి కొలతలను ఆ సంస్థ ఇప్పటికే తీసుకుని.. హైదరాబాద్‌లో తయారీని కూడా ప్రారంభించింది. మూడు కొత్త వెయిట్లను గురువారం లేదా శుక్రవారం నాడు లారీల్లో బ్యారేజీకి తీసుకురానున్నారు. ఇప్పటికే వరద ప్రవాహం బాగా తగ్గిపోయింది. వచ్చే రెండ్రోజుల్లో మరింతగా తగ్గే వీలుంది. దీంతో ఈ కౌంటర్ వెయిట్లను తీసుకొచ్చిన వెంటనే పాతవాటిని తొలగించి కొత్తవాటిని బిగించే కార్యక్రమాన్ని బెకమ్ చేపడుతుంది. స్టీల్ ఫ్రేమ్‌లో సిమెంటు పోసి దిమ్మెలను తయారుచేస్తున్నారు. వాటిని అలాగే బిగించనున్నారు. కొత్త వెయిట్లను బిగించకముందే బ్యారేజీలోకి దూసుకొచ్చిన నాలుగు బోట్లను తొలగించాలని జల వనరుల శాఖ భావించింది. ఇందుకోసం కాకినాడ నుంచి పడవలను తొలగించడంలో అనుభవం కలిగినవారిని తీసుకురావాలనుకుంది. అయితే కొంతమేర ప్రవాహ ఉధృతి తొలిగాక.. తామే వాటిని తీసేస్తామని బెకమ్ తెలిపింది. బ్యారేజీ గేట్లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఈ పనిచేస్తామని చెప్పడంతో ఆ బాధ్యతను కూడా బెకమ్ సంస్థకే అప్పగించారు. గురువారం నుంచి ఆ బోట్లను తొలగించే పనులను ప్రారంభిస్తుందని జల వనరులశాఖ వర్గాలు వెల్లడించాయి.

విజయసాయి సమాచారాన్ని దాచారు

- రాజకీయ శత్రుత్వంతో పిటిషన్లు వేశారు
- హైకోర్టులో ఉమ్మడి ఏపీ మాజీ క్రీడా మంత్రి పీ రాములు వాదనలు

హైదరాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి రాజకీయ శత్రుత్వంతోనే ఉమ్మడి ఏపీ ప్రభుత్వం.. ఐఎంజీ భారత్‌కు 2003లో చేసిన భూకేటాయింపుపై సీబీఐ దర్యాప్తు కోరుతున్నారని అప్పటి ప్రభుత్వంలో క్రీడాశాఖ మంత్రిగా పనిచేసిన పీ రాములు తెలంగాణ హైకోర్టుకు తెలియజేశారు. ఐఎంజీ భారత్‌కు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, సరూర్‌నగర్ ప్రాంతాల్లో చేసిన భూకేటాయింపుపై మునుపటి లిటిగేషన్ల సమాచారాన్ని న్యాయస్థానానికి చెప్పకుండా దాచిపెట్టారని ఆరోపించారు. ఈ భూకేటాయింపుపై మాజీ సీఎం జగన్ తల్లి విజయలక్ష్మి, కాంగ్రెస్ నేత పాల్వాయి గోవర్ధన్ రెడ్డి దాఖలు చేసిన కేసులను న్యాయస్థానాలు కొట్టేశాయని తెలిపారు. విజయసాయి రెడ్డి పిటిషన్‌నూ కొట్టేయాలని కోరారు. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 2003లో ఐఎంజీ భారత్‌కు చేసిన 850 ఎకరాల భూకేటాయింపుపై సీబీఐ దర్యాప్తు కోరుతూ జర్నలిస్టు ఏబీకే ప్రసాద్, ఎంపీ విజయసాయిరెడ్డి, న్యాయవాది టీ శ్రీరంగారావు 2012లో రెండు వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాదే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్లు బుధవారం విచారణకు వచ్చాయి. ఈ పిటిషన్లలో ఇంప్లీడ్ అయిన ఉమ్మడి ఏపీ మాజీ క్రీడాశాఖ మంత్రి పి రాములు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. పిటిషనర్లలో ఒకరైన విజయసాయిరెడ్డి... జగన్‌కు దగ్గరి వ్యక్తి అని, అక్రమాస్తులు సహా ఆయనపై అనేక కేసులు ఉన్నాయని తెలిపారు. మునుపటి లిటిగేషన్ల సమాచారాన్ని విజయసాయిరెడ్డి దాచి పెట్టారని, ఆయన క్లీన్ హ్యాండ్స్‌తో రాలేదని వివరించారు. చాలా ఏళ్ల తర్వాత 2012లో పిటిషన్ దాఖలు చేశారని పేర్కొన్నారు. ఐఎంజీకి భూమి కేటాయిస్తూ 2003లో మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం రద్దు అయ్యిందని, కోర్టు తీర్పుతో సదరు భూములు ప్రభుత్వం దగ్గరే ఉన్నాయని చెప్పారు. 21 ఏళ్ల క్రితం మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయానికి క్రిమినాలిటీ ఆపాదించి దర్యాప్తు కోరడం సరికాదని అభిప్రాయపడ్డారు. అసలు మంత్రి వర్గం తీసుకున్న విధాన నిర్ణయాలను ప్రాసిక్యూట్ చేయడం సాధ్యం కాదని, రాజకీయ దురుద్దేశంతో దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేయాలని సిద్ధార్థ లూథ్రా హైకోర్టును కోరారు. కాగా, సీబీఐ దర్యాప్తు కావాలా? వద్దా? స్పష్టంగా చెప్పాలని ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదిని కోరగా స్పష్టమైన సమాధానం రాలేదు. హైకోర్టు ఎలాంటి ఆదేశాలిచ్చినా శిరసావహిస్తామని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది ఆడెపు దివ్య బదులిచ్చారు. కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ తన వాదన వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమిక విచారణలో ఏమైనా అక్రమాలు జరిగినట్టు తేలితే సీబీఐతో దర్యాప్తు చేయించేందుకు సిద్ధమని చెప్పారు. వాదనలు నమోదు చేసుకున్న న్యాయస్థానం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

హానికరమని గుర్తిస్తే కొట్టేయడంలో తప్పేముంది?

- కోనోకార్పస్ చెట్ల నరికివేతపై పిల్ విచారణ సందర్భంగా ధర్మాసనం

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోనోకార్పస్ చెట్లు మనుషుల ఆరోగ్యానికి హాని తలపెడుతున్నాయని గుర్తించినప్పుడు, వాటిని కొట్టివేయడంలో తప్పేముంది? అని హైకోర్టు ప్రశ్నించింది. జమ్మూ కాశ్మీర్‌లో సైతం ఓ రకం చెట్ల నుంచి దూదిలాంటి పదార్థం విడుదలయ్యేదని, దానివల్ల అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొన్నారని పేర్కొంది. ఇంటి నుండి బయటకు రావడానికి మాస్కు ధరించాల్సి వచ్చేదని గుర్తు చేసింది. కోనోకార్పస్ చెట్ల విషయంలో కూడా ఇలాంటి ఇబ్బంది ఉందని గుర్తించి వాటిని నరికివేయాలని నిర్ణయించి ఉంటారని పేర్కొంది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. చెట్ల పెంపకం విషయంలో తమకు అమితమైన శ్రద్ధ ఉందని చెబుతున్న నేపథ్యంలో చెట్లను పెంచేందుకు ఇప్పటివరకు ఏమి చేశారు? ఎన్ని మొక్కలు నాటారు? తదితర వివరాలను కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్లను ఆదేశించింది. విచారణను నవంబరు 6కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. మానవాళి, పర్యావరణానికి హానికరమని శాస్త్రీయంగా నిరూపితమయ్యేవరకు కోనోకార్పస్ చెట్ల నరికివేతను నిలుపుదల చేసేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ గుంటూరుకు చెందిన వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మరో ఇద్దరు ప్రొఫెసర్లు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) టి.విష్ణుతేజ స్పందిస్తూ... కోనోకార్పస్ చెట్ల కారణంగా ఊపిరి తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో కాకినాడ, నెల్లూరు జిల్లా కలెక్టర్లు మొత్తం 645 చెట్లను కొట్టివేశారు. వాటి స్థానంలో దేశీయ జాతి మొక్కలు నాటుతున్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తాం. అందుకు మరికొంత సమయం ఇవ్వాలి' అని అభ్యర్థించారు. ఈ దశలో పిటిషనర్ల తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాస్ స్పందిస్తూ... 'ఎలాంటి శాస్త్రీయ అధ్యయనం లేకుండా చెట్లను నరికి వేస్తున్నారు. చెట్లపై అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలి' అని కోరారు.

దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యం

- టీచర్స్ డే సందర్భంగా గవర్నర్ శుభాకాంక్షలు

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైందని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబరు 5న జరుపుకొనే 'ఉపాధ్యాయ దినోత్సవం'(టీచర్స్ డే) సందర్భంగా ఉపాధ్యాయులందరికీ గవర్నర్ ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఐదుగురు తెలుగు అధ్యాపకులకు పురస్కారాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు అధ్యాపకులతోపాటు మొత్తం 82 మందిని ఉత్తమ అధ్యాపక పురస్కారాలతో సత్కరించనున్నారు. విద్యారంగంలో ప్రమాణాలు పెంచడంతోపాటు విద్యార్థుల్లో పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు అంకితభావంతో కృషి చేసినందుకు వీరిని గురువారం రూ.50 వేల నగదు, రజత పతకం, ప్రశంస పత్రాలతో రాష్ట్రపతి సత్కరించనున్నారు. అనంతరం ఈ అధ్యాపకులంతా ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలుసుకోనున్నారు. వీరిలో గుడివాడలోని ఎస్‌పీఎస్ మునిసిపల్ హైస్కూల్ అధ్యాపకుడు మిద్దె శ్రీనివాసరావు, ఉరందూర్ జడ్పీ హైస్కూల్ అధ్యాపకుడు సురేశ్ కొనాకి, తెలంగాణలోని తిరుమలాయపాలెం జడ్పీ స్కూల్ అధ్యాపకుడు కీసర ప్రభాకర్‌రెడ్డి, దమ్మన్నపేట జడ్పీ స్కూల్ అధ్యాపకుడు తాదూరి సంపత్‌కుమార్, హైదరాబాద్‌లోని బేగంపేట మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నందవరం మృదుల పురస్కారాలు స్వీకరించనున్నారు.

కాదంబరి కేసులో ఆధారాలు భద్రపరచండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం.. విచారణ 11కు వాయిదా

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీపై ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర ఆధారాలను భద్రపరచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేస్తూ విచారణను ఈ నెల 11కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. జెత్వానీపై నమోదు చేసిన కేసులో పోలీసులు సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను నిందితురాలికి ఇవ్వకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా, కోసూరుకు చెందిన కేవీఆర్ విద్యాసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్ ఫిర్యాదు ఆధారంగా జెత్వానీపై ఫిబ్రవరి 2న పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. జెత్వానీకి చెందిన మొబైల్ ఫోన్‌తో పాటు ఇతర ఆధారాలను పోలీసులు సీజ్ చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత పిటిషనర్‌ను నిందితుడిగా, జెత్వానీని బాధితురాలిగా చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ నేపథ్యంలో ఆధారాలను భద్రపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. కేసు మొదటిసారి విచారణకు వచ్చిందని, వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అడ్వకేట్ జనరల్ అభ్యర్థించారు.

అడ్మిషన్‌కోసం వెళ్తూ... వరదకు బలి

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి ఓ విద్యార్థి నిండు ప్రాణం తీసింది. ఓవైపు వర్షాలు, వరదలతో రాష్ట్రం అతలాకుతలం అవుతుంటే ఆ శాఖ అధికారులు మాత్రం తమకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఆ నిర్లక్ష్యమే ఓ విద్యార్థి మృత్యువాత పడటానికి కారణమైంది. డిగ్రీ అడ్మిషన్ల రెండో విడతలో భాగంగా ఆగస్టు 29న సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 3లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని నిర్దేశించారు. అయితే, 31 నుంచి రాష్ట్రంలో భారీవర్షాలు కురిశాయి. బుడమేరు కారణంగా విజయవాడను వరద ముంచెత్తింది. కానీ, ఉన్నత విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించి కనీసం సెలవులపై ప్రకటన కూడా చేయలేదు. దీంతో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు 3లోగా తప్పనిసరిగా కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి వచ్చింది. విజయవాడలోని సింగ్‌నగర్‌కు చెందిన విద్యార్థి కొడాలి యశ్వంత్‌కుమార్(19)కి వన్‌టౌన్‌లోని కేబీఎన్ కాలేజీలో అడ్మిషన్ లభించింది. తప్పనిసరి పరిస్థితుల్లో కాలేజీలో రిపోర్టు చేసేందుకు మంగళవారం అక్కడక్కడా పడవల సాయం తీసుకుంటూ వెళ్లే ప్రయత్నం చేసిన విద్యార్థి చివరికి గల్లంతయ్యాడు. బుధవారం యశ్వంత్ మృతదేహం లభ్యమైంది. ఉన్నత విద్యాశాఖలో ఏ ఒక్కరైనా స్పందించి.. డిగ్రీ అడ్మిషన్లపై ప్రకటన చేసి ఉంటే విద్యార్థి ప్రాణాలు పోయేవి కావని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.

మద్యం షాపుల బంద్ వాయిదా

- వరదల నేపథ్యంలో నిర్ణయం: ఉద్యోగుల సంఘం

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 7 నుంచి చేపట్టదలచిన బంద్‌ను వాయిదా వేస్తున్నట్లు ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రరావు, జి.కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో బంద్‌ను వాయిదా వేసినట్టు పేర్కొన్నారు.

సాయిరెడ్డి కుమార్తె అక్రమ నిర్మాణం తొలగింపు

- హైకోర్టు ఆదేశాలతో అధికారుల చర్యలు
- 2 వారాల్లో కోర్టుకు నివేదిస్తామని వెల్లడి

భీమునిపట్నం, సెప్టెంబరు 4: హైకోర్టు ఆదేశాల దరిమిలా విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి భీమిలి సమీపాన బీచ్‌రోడ్డులో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను జీవీఎంసీ అధికారులు బుధవారమే తొలగించారు. భీమిలి టౌన్ సర్వే నంబర్లు 1517, 1518, 1519, 1524లో దాదాపు మూడున్నర ఎకరాలను నేహారెడ్డికి చెందిన 'అవ్యాన్' సంస్థ కొనుగోలు చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయసాయిరెడ్డికి ఎదురులేకపోవడంతో తీరం వెంబడి కెరటాలను తాకేలా కాంక్రీటు ప్రహరీ గోడ నిర్మించారు. నిర్మాణాలను అనుమతించకూడదని జీవీఎంసీ అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోలేదు. దీనిపై జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల వుమూర్తియాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేయగా సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలంటూ జీవీఎంసీ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు నిర్మాణాలను 24 గంటల్లోగా తొలగించాలని, లేనిపక్షంలో తామే తొలగిస్తామంటూ జీవీఎంసీ అధికారులు మంగళవారం నేహారెడ్డికి చెందిన కంపెనీకి నోటీసులు జారీచేశారు. వాటిని తీసుకునేందుకు సంస్థ ప్రతినిధులు నిరాకరించగా అధికారులు నోటీసును గోడకు అతికించారు. బుధవారం ఉదయానికి అటు నుంచి ఎలాంటి స్పందనా రాకపోవడంతో అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించారు. నిర్మాణాల తొలగింపుపై భీమిలి జోన్ ఏసీపీ దవళ శ్రీనివాసరావు మాట్లాడుతూ..హైకోర్టు ఉత్తర్వులు, జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలపై సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న కట్టడాలను తొలగించామన్నారు. రెండు వారాల్లో చర్యల నివేదిక (యాక్షన్ టేకెన్ రిపోర్టు)ను కోర్టుకు అందజేస్తామన్నారు.



భీమిలి వద్ద సముద్రతీరంలో విజయసాయిరెడ్డి కుమార్తెకు చెందిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోండి

- విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి సముద్రానికి తీరంలో జరిపిన శాశ్వత కాంక్రీటు నిర్మాణాల కూల్చివేత విషయంలో జోక్యానికి హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది. ఈ వ్యవహారాన్ని సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి తేల్చిచెప్పింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. అంతకుముందు బుధవారం కోర్టు విచారణ ప్రారంభమైన వెంటనే నేహారెడ్డి తరఫు న్యాయవాది స్పందిస్తూ.. ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా అధికారులు నిర్మాణాలను కూల్చివేస్తున్నారన్నారు. వారిచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ సింగిల్ జడ్జి వద్ద పిటిషన్ వేశామన్నారు. అన్ని అనుమతులూ తీసుకున్నాకే నిర్మాణాలు ప్రారంభించామని.. కూల్చివేతలు నిలిపివేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. అందుకు ధర్మాసనం నిరాకరించింది. భీమునిపట్నం పరిధిలోని సీఆర్‌జెడ్-1 ప్రాంతంలో సముద్రానికి అతిసమీపంలో శాశ్వత కాంక్రీటు నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. నిర్మాణాలను తొలగించడంతో పాటు సహజ ఆవాసాలను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును కోరారు. ఇసుక తిన్నెలను ధ్వంసం చేసిన బిల్డర్‌పై క్రిమినల్ చర్యలు ప్రారంభించేలా అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యాజ్యంపై ఈ ఏడాది ఫిబ్రవరిలో విచారణ జరిపిన ధర్మాసనం.. సముద్రానికి అతిసమీపంలో జరుపుతున్న శాశ్వత నిర్మాణాలను తక్షణం నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. నిర్మాణానికి వినియోగిస్తున్న భారీ యంత్రాలను అక్కడికక్కడే తక్షణం సీజ్ చేయాలని స్పష్టం చేసింది. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు జీవీఎంసీ అధికారులకు వెసులుబాటు ఇచ్చింది. ఈ ఆదేశాలకు అనుగుణంగా అక్రమ నిర్మాణాల కూల్చివేత విషయంలో నేహారెడ్డికి నోటీసులు జారీ చేశారు. వీటిని సవాల్ చేస్తూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు. వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో జీవీఎంసీ అధికారులు సీఆర్‌జెడ్ ప్రాంతంలో ఉన్న కాంక్రీట్ నిర్మాణాలను కూల్చివేయడం ప్రారంభించారు. దీనిపై ఆమె ధర్మాసనాన్ని ఆశ్రయించగా.. అక్కడా చుక్కెదురైంది.

మెడికల్ సీట్ల భర్తీ ప్రారంభం

- ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ నోటిఫికేషన్

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్ జారీ చేసింది. బుధవారం సాయంత్రం 3 గంటల నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చింది. పాడేరులో నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీలో అడ్మిషన్లకు కేంద్రం అనుమతి ఇవ్వడంతో వర్సిటీ అధికారులు ఆ కాలేజీలో కూడా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. మరిన్ని వివరాలకు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని అధికారులు సూచించారు.

జోన్ ఆలస్యానికి కారణం వైసీపీ ప్రభుత్వమే

- విశాఖలో అవసరమైన భూమిని అప్పగించలేదు: పురందేశ్వరి

విశాఖపట్నం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వం విశాఖపట్నంలో భూమిని అప్పగించలేదు. అందువల్లే రైల్వే జోన్ పనులు ఆలస్యం అయ్యాయి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విశాఖపట్నం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో పురందేశ్వరి మాట్లాడారు. 'విశాఖపట్నం స్టీల్ ప్లాంటు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది. విజయవాడలో వరదలు దురదృష్టకరం. వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో బీజేపీ శ్రేణులు చురుగ్గా పాల్గొంటున్నాయి. ప్రస్తుతం ఏపీలో బీజేపీకి 38 లక్షల మంది సభ్యులు ఉన్నారు. మూడు దశల్లో సభ్యత్వ నమోదు జరుగుతుంది. అక్టోబరుతో ఈ కార్యక్రమం ముగుస్తుంది' అని పురందేశ్వరి తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో.. మావోయిస్టు అగ్రనేత జగన్ మృతి

- చర్చి పాస్టర్ నుంచి మావోయిజం వైపు..
- ఏరియా కమిటీ నుంచి కేంద్ర కమిటీకి 35 ఏళ్లు సాగిన జగన్ ప్రస్థానం
- జగన్‌పై రూ. 25 లక్షల రివార్డు

వరంగల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్-బస్తర్ జిల్లాల మధ్య మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో.. మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతిచెందగా.. బుధవారం ఉదయం వారిని గుర్తించే ప్రక్రియను ప్రారంభించారు. ఈ క్రమంలో మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ రణదేవ్ దాదా మృతదేహాన్ని గుర్తించారు. జగన్ స్వస్థలం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామం. ఆయన అసలు పేరు మాచర్ల ఏసోబు. జగన్ మృతదేహాన్ని ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకువచ్చేందుకు ఆయన కుమారుడు మహేశ్ బయలుదేరారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఏసోబు.. తొలుత చర్చి పాస్టర్‌గా పనిచేశారు. రైతు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఈ క్రమంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాల పట్ల ఆకర్షితుడై.. 1990లో పీపుల్స్ వార్ గ్రూప్(పీడబ్ల్యూజీ) నేత కడారి రాములు అలియాస్ రవి నేతృత్వంలో అడవుల బాట పట్టారు. అజ్ఞాతంలోకి వెళ్లారు. తొలుత వరంగల్ జిల్లా అన్నాసాగర్ ఏరియా కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 35 ఏళ్లు అనేక ఉద్యమాల్లో, దాడుల్లో పాల్గొన్నారు. క్రమంగా ఆర్గనైజర్‌గా, కమాండర్‌గా నియమితులయ్యారు. 1995లో వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడిగా.. 2001లో తెలంగాణ కమిటీ ప్రెస్, రక్షణ వ్యవహారాల కోసం ఏర్పాటైన ప్లటూన్ కమాండర్‌గా పనిచేశారు. 2004లో కేంద్ర కమిటీ రక్షణ కోసం ఏర్పాటైన కంపెనీ కమాండర్‌గా.. 2012లో ఛత్తీస్‌గఢ్‌లో జనతన సర్కార్‌లో వ్యవసాయాభివృద్ధి కమిటీ నేతగా అబూజ్‌మడ్‌లో పనిచేశారు. ఆ తర్వాత కేంద్ర కమిటీ సభ్యుడిగా.. మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ఇన్‌చార్జిగా, కేంద్ర కమిటీ మిలటరీ ఇన్‌చార్జిగా మావోయిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో జగన్ మృతిచెందినట్లు పోలీసులు ప్రకటించారు. జగన్ అజ్ఞాతంలోకి వెళ్లాక.. ఎన్నడూ సొంత ఊరికి రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. కాగా.. జగన్‌పై రూ.25 లక్షల రివార్డు ఉంది. జగన్ మృతితో టేకులగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గురువారం మధ్యాహ్నానికి ఆయన మృతదేహం టేకులగూడెం చేరుకుంటుందని, ఆయనకు నివాళులు అర్పించేందుకు పెద్ద సంఖ్యలో మాజీ నక్సలైట్లు, హక్కుల కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నెతన్యాహుపై నిరసన

ఇజ్రాయెల్‌లో సోమవారం దేశవ్యాప్త సమ్మె జరిగింది. ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ గాజా యుద్ధం మొదలుపెట్టిన తరువాత ఇంతటి విస్తృతస్థాయి సమ్మె జరగడం ఇదే మొదటిసారి. ఇజ్రాయెల్‌లోని అతిపెద్ద కార్మిక సంఘమైన హిస్ట్రాడ్రట్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. అన్ని వ్యాపార వాణిజ్యసంస్థలూ, పరిశ్రమలు, విద్యాసంస్థలు సమ్మెలో పాలుపంచుకున్నాయి. బ్యాంకులు, ప్రభుత్వకార్యాలయాలు, షాపింగ్ మాల్స్ మూతపడ్డాయి. ఆర్థికవ్యవస్థకు ఆయువుపట్టులాంటి రంగాలన్నీ పనిచేయకపోవడం ఈ సమ్మె లక్ష్యం కనుక, అది నెరవేరినట్టే. హమాస్ చెరలో బందీలుగా ఉన్న వారిని విడిపించడంలో నెతన్యాహూ వైఫల్యాన్ని నిరసిస్తూ ఈ సమ్మె జరిగింది. ఆదివారం నాడు బందీల్లో ఆరుగురు చనిపోయిన స్థితిలో కనిపించడంతో ఇజ్రాయెలీల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సొరంగంలో బందీలుగా ఉంచిన ఈ ఆరుగురినీ తమ సైన్యం అక్కడకు చేరుకోగానే హమాస్ అంతం చేసిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. యుద్ధాన్ని కొనసాగించడం ద్వారా నెతన్యాహూ ఏమీ సాధించలేరనీ, తక్షణమే కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో భాగంగా దేశవ్యాప్తంగా పలు పట్టణాలు, నగరాల్లో ర్యాలీలు జరిగాయి. రాజకీయ దురుద్దేశంతో పిలుపునిచ్చిన ఈ సమ్మెను నిలువరించాలంటూ ఇజ్రాయెల్ ప్రభుత్వం న్యాయస్థానాల్లో వాదించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

ఒకపక్క యుద్ధం సాగుతూ, మరో పక్కన చర్చలు మరింత వెనక్కుపోతున్న స్థితిలో హమాస్ చేతుల్లో బందీలుగా ఉన్నవారు మరణించడం తప్ప, బయటకు రావడం అసాధ్యమని ఇజ్రాయెలీలకు అర్థమైపోయింది. హమాస్ దాడిజరిగి మరోనెలలో సంవత్సరం అవుతుంది. గత ఏడాది అక్టోబర్‌లో ఇజ్రాయెల్‌పై దాడిచేసిన హమాస్ దాదాపు పన్నెండువందలమందిని చంపి, 250మందిని బందీలుగా అపహరించుకుపోయింది. వీరిలో వందమంది ఆ తరువాత విడుదలైనప్పటికీ, ఈ పదకొండునెలల కాలంలో చనిపోయినవారు కాక, మరో వందమంది ఇంకా హమాస్ గుప్పిట్లోనే ఉన్నారు. యుద్ధం సాగుతూంటే మరింతమంది హత్యకు గురయ్యే ప్రమాదమూ ఉంది. ఈ సమ్మె వెనుక ఏవో కుట్రలున్నాయనీ, రాజకీయ కక్షలున్నాయని నెతన్యాహూ ప్రభుత్వం వాదిస్తున్నది కానీ, ఆయన యుద్ధపిపాసి అని ఇజ్రాయెలీలకు తెలుసు.

యుద్ధం ముగిసి, ఎన్నికలు జరిగితే నెతన్యాహూ ఓడిపోవడం ఖాయమని చాలా విశ్లేషణలు వచ్చాయి. దానిని కొనసాగించడం ద్వారా ఇప్పుడున్న విస్తృతమైన అధికారాలను చెలాయించడంతోపాటు, తనకు రాజకీయంగా లబ్ధిచేకూరుతుందన్న నమ్మకం కుదిరినప్పుడే ముగించవచ్చునని నెతన్యాహూ అనుకుంటున్నారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదరకుండా అడ్డుపడుతున్నది ఇజ్రాయెల్ ప్రధాని కదూ అన్న ప్రశ్నకు అవును ఆయనేనని అమెరికా అధ్యక్షుడు విలేకరులముందు ఒప్పుకోవాల్సివచ్చింది. ఈ అంగీకారం బాగున్నది కానీ, నెతన్యాహూ మొండితనాన్ని నిలబెడుతున్నది అమెరికాయే. చర్చల్లో హమాస్ కొంత దిగివచ్చినా ఏదో కారణంతో అవి సాగనివ్వకుండా చేస్తున్నారు. బందీలందరినీ విడిచిపెట్టేవరకూ యుద్ధం సాగిస్తానన్న ఆయన వాదనను దేశప్రజలు మెచ్చడం లేదు. బందీలను వదిలేశాక ఆయన ఇంకెంత విధ్వంసానికి పాల్పడతాడో హమాస్‌కు తెలుసు. యుద్ధం ఆపి, ఇజ్రాయెల్ తన సేనలను ఉపసంహరించుకున్న పక్షంలోనే బందీలను విడిచిపెడతానన్న వాదననుంచి హమాస్ కాస్తంత సడలిందని కూడా వార్తలు వచ్చాయి. ఈజిప్ట్–గాజా సరిహద్దు ప్రాంతంనుంచి ఇజ్రాయెల్‌సేనలు వెనక్కుపోవాలన్న హమాస్ డిమాండ్ కూడా చర్చల్లో ప్రతిష్టంభనకు కారణమంటారు. ఇక్కడ వెనక్కుతగ్గి చర్చలకు సానుకూలత ప్రదర్శించి, అంతిమంగా బందీలను విడిపించుకుందామని సన్నిహితులనుంచే ఒత్తిడి వస్తున్నప్పటికీ నెతన్యాహూ ఒప్పుకోవడం లేదు. టీకాలు వేయించుకుంటున్న పిల్లలమీద కూడా బాంబులు కురిపించి హతమార్చడానికే ప్రాధాన్యం ఇస్తున్నాడు. యుద్ధాన్ని ఆపి, చర్చలకు మొగ్గుచూపిన మరుక్షణంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని కూటమిలోని మితవాద, మతవాద భాగస్వామ్య పక్షాలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఆయన చర్చల ఊసెత్తబోరని విశ్లేణలు సాగుతున్నాయి. నిజానికి, హమాస్ దాడి, బందీల అపహరణను తీవ్రంగా నిరసిస్తూ, నెతన్యాహూ ప్రతీ చర్యనూ సమర్థిస్తూ ఆయనకు అండగా ఉండాల్సిన ప్రజలు, అందుకు పూర్తి భిన్నంగా నిరసన ప్రదర్శనలు చేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆదివారం నాటి భారీ ప్రదర్శనలు, సోమవారం దేశవ్యాప్తంగా జరిగిన సమ్మె ఓ వందమంది బందీలు, వారి బంధువులతో ముడిపడిన విషయం కాదనీ, నెతన్యాహూ మీద దేశప్రజలకు ఇక ఏమాత్రం విశ్వాసం లేదనడానికి నిదర్శనమని విశ్లేషకుల అభిప్రాయం.

కృత్రిమ మేధ పేరిట మన సమాజం ఉపాధ్యాయుడు లేని విద్య దిశగా ఆలోచనలు చేస్తోంది. ఇది మంచి పరిణామం కాదు. గురువు స్థానంలో ఓ కృత్రిమ మేధ బొమ్మను ఉంచి చిలక పలుకులు పలికిస్తే చదువు వస్తుంది. చదువు వస్తుందేమో గానీ, సంస్కారం ఎక్కడ నుంచి వస్తుంది? జీవన వికాసానికి నవ్యమార్గాలను నిర్మించే మహోన్నత విద్యాయజ్ఞాన్ని నిర్వహించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో భావి తరాలకు వెలుగు బాటలు వేయాలి.



సర్వేపల్లి స్ఫూర్తితో భావి పౌరుల శిక్షణ

సమాజమంతా నేటి గురించి ఆలోచిస్తూ ఉంటుంది. కానీ రేపటి సమాజాన్ని గురించి ఆలోచించే మహోన్నత వ్యక్తిత్వం గురువుల సొంతం. వారు ఈ రోజు తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక భవిష్యత్‌ను మహోన్నతంగా నిర్మించాలన్న సంకల్పమే ఉంటుంది. అందుకే ఉపాధ్యాయులు రేపటి ఆశలకు సారథులుగా, భవిష్యత్ నిర్మాణానికి వారధులుగా నేను భావిస్తాను. తమ కోసం ఆలోచించుకోకుండా, భవిష్యత్ గురించి కలలు కనటం బహుశా వారికే చెల్లింది. అందుకే విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులకు ఈ సమాజం ఎప్పుడూ రుణపడి ఉంటుంది. అలాంటి ఉపాధ్యాయులందరినీ గౌరవించుకునేందుకు భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని భారత ప్రభుత్వం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించింది. జీవన వికాసానికి నవ్య మార్గాలను నిర్మించే మహోన్నత విద్యాయజ్ఞాన్ని నిర్వహించి ఉన్నత పదవులను అధిష్ఠించిన రాధాకృష్ణన్ స్మృతికి ఈ సందర్భంగా నివాళులు అర్పించటంతో పాటు, ఆయన చూపిన ఆదర్శనీయ మార్గాన్ని భావి తరాలకు ఆచరణలో చూపెట్టాలని ఆకాంక్షిస్తున్నాను.

ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం కాదు. నాలుగు డబ్బులు సంపాదించుకునే మార్గమూ కాదు. అది రేపటి సమాజాన్ని సృష్టించే ఓ మహా యజ్ఞం. ఆ యజ్ఞాన్ని మహోన్నతంగా నిర్వహించి, భవిష్యత్తును నిర్మించిన మహనీయులు ఎంతో మంది ఉన్నారు. వారందరికీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రణతులు అర్పిస్తున్నాను. గతమంతా శృతంగా సాగిన భారతీయ విద్యా వ్యవస్థలో గురువు స్థానం మహోత్కృష్టమైనది. శిష్యులను కుమారుల కంటే ఎక్కువగా చూసిన గొప్పతనం గురువులదైతే, గురువును తల్లిదండ్రుల కంటే గొప్పగా గౌరవించిన సంస్కారం శిష్యుల సొంతం. మైసూరు రాజా వారి కళాశాలలో పని చేసి బదిలీ అవుతున్న సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను అక్కడి విద్యార్థులు గుర్రపు బగ్గీలో ఊరేగిద్దామనుకుని, సమయానికి గుర్రాలు రాకపోతే స్వయంగా వారే బండి లాగి తమ గురువు పట్ల గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సంఘటనకు మొదటి కారణం తరతరాలుగా మన రక్తంలో జీర్ణించుకుపోయిన గురుశిష్య సంబంధం ఒక కారణమైతే, రెండోది సర్వేపల్లి వారు ఆ విద్యార్థుల్లో నాటిన సంస్కార బీజాలు.

ఇటీవల పత్రికల్లో చదివాను. ఇదే విధమైన గౌరవాన్ని శిష్యుల నుంచి పొందిన గురువు గురించి, గురువు బదిలీ అయ్యి వెళుతుంటే కన్నీళ్ళు పెట్టుకున్న శిష్యుల గురించి. ఇదో మంచి పరిణామం. కాలం మారుతోందని మనం నమ్మి తీరాల్సిన వాస్తవం. అయితే మన పెద్దలు నాటిన సంస్కార బీజాల కారణంగా కాలం మారుతున్నా, గురుశిష్య సంబంధాల్లో ఇలాంటి సానుకూల పరిణామాలనే నేను ఆకాంక్షిస్తున్నాను. అయితే కారణాలు ఏవైనా కావచ్చు అక్కడక్కడా మానవీయ విలువలు పలుచనైపోయి, మానవసంబంధాలు ప్రతికూల మార్గంలో వెళుతున్న సంఘటనలు చూస్తూ ఉన్నాం. ఇలాంటి పరిస్థితి రాకూడదంటే మన బోధనా విధానాల్లో మార్పు రావలసిన అవసరం ఎంతైనా ఉంది. మన విద్యా వ్యవస్థలో గురువులపైన ఉన్న నమ్మకం సన్నగిల్లలేదు. ఉపాధ్యాయుడు చెప్పింది పొరపాటున ఒకవేళ వాస్తవం కాదని చెప్పినా, మా ఉపాధ్యాయుడు సరిగానే చెబుతాడు అనే నమ్మకం విద్యార్థుల్లో బలంగా ఉంది. మన విద్యావ్యవస్థ మూలాలు బలంగా ఉన్నాయని చెప్పటానికి ఇదొక్కటి చాలు. అయితే బలమైన మూలాల నుంచి మరింత పటిష్ఠమైన భావి భారత నిర్మాణం రూపుదిద్దుకోవాలంటే చదువులోని నిజమైన పరమార్థాన్ని తెలియజెప్పే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాలి.



నేను అనేక సందర్భాల్లో చెప్పినట్లు చదువంటే మార్కులు మాత్రమే అనే సంస్కృతి పోవాలి. జ్ఞానాన్ని అందించటంతో పాటు భారతీయ విలువలతో కూడిన విద్యను బోధించాలి. ఇందుకోసం విద్యా విధానాల్లో మార్పులు రావలసిన అవసరం ఉంది. ఋగ్వేదం చెప్పినట్లుగా 'ఆనో భద్ర\ కృతవో\ యంతు\ విశ్వతః' అంటే ఉత్తమమైన భావాలు అన్నివైపుల నుంచి రావాలి. దీన్ని విస్తృత అర్థంలో ఆకళింపు చేసుకోవలసిన అవసరం ఉంది. విద్యార్థులు తరగతి గదుల నుంచి, పుస్తకాల నుంచి మాత్రమే కాదు సమాజం నుంచి, ప్రకృతి నుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది. మొక్కలను చూసి ఎదగడం, పక్షులను చూసి ఎగరడం, చెట్టును చూసి సాయం... ఇలా ఎన్నింటినో నేర్చుకోవచ్చు. అప్పుడే విద్యార్థుల్లో నిజమైన నైపుణ్యం బయటకు వస్తుంది. దీనితో పాటు ఉపాధ్యాయులు వ్యక్తిగత అలవాట్లు కీలకమే. అవి విద్యార్థులను ప్రభావితం చేస్తాయి. ఈ మధ్య కాలంలో మొబైల్ ఫోన్ పుణ్యమాని కొంతమంది ఉపాధ్యాయుల తీరులోనూ మార్పులు వచ్చాయని అక్కడక్కడా వినిపిస్తోంది. ఇంటి సమస్యలను పాఠశాలల వరకూ మోసుకొచ్చేవారు, పాఠశాల సమయంలోనూ ఇంటి గురించి దిగులుపడేవారు ఉన్నారన్నది వాస్తవం. అలాంటి పరిస్థితుల్లో మార్పు రావాలి. ఉపాధ్యాయుల కోపం, కష్టం లాంటివి పాఠశాలల గోడలకు బయటే ఉండాలి తప్ప, ఆ గోడలు దాటి తరగతి నాలుగు గోడల మధ్యకు రాకూడదనే విషయాన్ని ఉపాధ్యాయులు గుర్తుంచుకోవాలి.

ఈ సందర్భంగా నాకు ప్రహ్లాద చరిత్రలో ఓ ఘట్టం గుర్తుకువస్తోంది. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే దేవుడు కాదు నేనే దేవుణ్ణి అన్న హిరణ్యకశిపుడు సైతం తన కుమారుడికి విద్యను నేర్పేందుకు గురువుల వద్దకే పంపించాడు. చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రి అంటూ నిజమైన విద్యలోని పరమార్థాన్ని తెలుసుకోగలిగానన్న ప్రహ్లాదుని జీవితమే ఈ తరాలకు ఆదర్శం కావాలి. ఈ మధ్యకాలంలో కృత్రిమ మేధ పేరిట మన సమాజం గురువు లేని విద్య దిశగా ఆలోచనలు చేస్తోంది. ఇది మంచి పరిణామం కాదు. నేను అనేక సందర్భాల్లో చెప్పినట్లు గూగుల్ సైతం గురువుకు ప్రత్యామ్నాయం కాదు. గూగుల్‌కు సమస్య వచ్చినా దాన్ని తీర్చడానికి గురువే కావాలి. అసలు తరగతి గతంలో 30 మందికి మించి విద్యార్థులు ఉండకూడదు అనే నియమం ఎందుకు పెట్టారన్న కనీస విషయాన్ని ఆలోచించే ఎవరికైనా ఇది అవగతం అవుతుంది. ప్రతి ఒక్కరి పట్ల గురువు శ్రద్ధ వహించాలనేది ఇందులోని పరమార్థం. గురువు స్థానంలో ఓ కృత్రిమ మేధ బొమ్మను ఉంచి చిలకపలుకులు పలికిస్తే చదువు వస్తుంది. చదువు వస్తుందేమో గానీ, సంస్కారం ఎక్కడ నుంచి వస్తుంది? చంపటం ఎలా అని ఎవరైనా గురువును అడిగితే... అది తప్పు అని చెబుతాడు. గూగుల్‌ని అగిడితే మొత్తం వివరాలు అందిస్తుంది. అంటే మనిషి దగ్గర ఉండే ఒకే ఒక మెదడు, సానుకూల ఆలోచనతో సంబంధం లేకుండా భవిష్యత్ తరాలను తయారు చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందో మనం గమనించవచ్చు.

గురువు లేని విద్య – గుడ్డి విద్య అని మన పెద్దలు ఏనాడో చెప్పారు. విద్య అంటే నాలుగు మాటలు నేర్పి దాన్ని అదే విధంగా రాస్తే మార్కులు వేసి సర్టిఫికేట్ ఇవ్వటం కాదు. విద్యార్థుల జ్ఞానాన్ని పెంపొందింపజేసి, వారిని భవిష్యత్ పౌరులుగా తీర్చిదిద్దే ఓ అత్యున్నత విధానం. విద్యార్థి మూర్తిమత్వ వికాసం, జ్ఞానాభివృద్ధి సరైన విద్య ద్వారానే సాధ్యమౌతుంది. ప్రపంచంలో ఎన్ని బోధనా పద్ధతులు వచ్చినా, వాటి ప్రధాన ఉద్దేశం ఇదే. విద్య అంటే మార్కుల కోసం నేర్చుకునే అక్షరాలు కాదు... మనుగడ కోసం నేర్చుకోవలసిన సంస్కారం అనే ఆలోచన సమాజంలో రావలసిన అవసరం ఉంది. ఇందుకోసం భారతీయ నూతన విద్యావిధానం సరికొత్త బాటలు వేస్తోంది. వీటిని అధ్యాపకులు వినియోగించుకోవాలి. దీనితో పాటు విద్యార్థులకు మాతృభాషలో బోధించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ మధ్యకాలంలో ఏ మీడియంలో బోధించాలనే విషయం మీద అనేక మల్లగుల్లాలు సాగుతున్నాయి. ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే అందించాల్సిన అవసరం ఉంది. అప్పుడే విద్యార్థులను మనవైన విలువలతో పరిపూర్ణంగా తీర్చిదిద్దగలము.

ఎన్ని నూతన విధానాలు వచ్చినా మంచి సమాజం సాకారం కావాలంటే విద్యే మూలాధారం. విద్యకు ఆధారం గురువే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. దేశానికి రాజైనా ఒక గురువుకు శిష్యుడే. అది గుర్తుంచుకున్న ప్రతి ఒక్కరూ తాము ఎంత స్థానంలో ఉన్నా గురువులను గౌరవిస్తారు, ఆ వృత్తిని పూజిస్తారు. భారతదేశానికి తలమానికమైన గురుశిష్య సంబంధం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయం కావాలని ఆకాంక్షిస్తూ... ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

• ముప్పవరపు వెంకయ్యనాయుడు
పూర్వ ఉపరాష్ట్రపతి
(నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం)

మనుషులం కదా, ముద్రలూ మూసలూ ఎందుకు?





• కె. శ్రీనివాస్

సందర్భం

నేను అన్నది ఎంతటి సంఖ్యతో సమానం? లక్షల మంది, కోట్లమంది గురించి లెక్కవేస్తున్నప్పుడు కూడా, 'నేను' పక్కన వేసే విలువ ఎంత? నేను అన్నది ఉనికి. ఆ ఉనికిలో నుంచి సమస్త ప్రపంచం, జీవితం వ్యక్తమవుతుంది. కనీసం తనవరకు అయినా 'నేను'తోనే అంతా పుడుతుంది, అంతా అంతమవుతుంది. అటువంటప్పుడు, తనని తాను కేవలం ఒకటిగా లెక్కించుకుని, పెద్ద అంకె ముందు తనను తక్కువ చేసుకోవడం ఎంత కష్టం? ఇతరులను కాపాడడానికి సాహసం చేయడం సరే, అందుకు సిద్ధపడినప్పుడు తనకు తాను చెప్పుకున్న సమర్థన, అనేక ఇతర ప్రాణాల ముందు తానొక్కడే కదా? ప్రాణాలకు తెగించినందుకే కాదు, 'నేను'ను జయించిన ఈ సమర్థన వల్ల కూడా సుభాన్ మనందరి ఆరాధనలకు అర్హుడు.

ఒక ఉదాత్తమైన మానవీయత తారసపడినప్పుడు, దైనందిన అల్పత్వం నుంచి ఉద్ధరింపు దొరికిన తన్మయ భావన కలుగుతుంది. ఆ క్షణాలను కూడా కలుషితం చేయడానికి కావలసినంత కల్మషం సమాజంలో యథావిధిగా ప్రవహిస్తూనే ఉంటుంది. సుభాన్ మతం గురించిన ప్రస్తావన అటువంటిదే. అతను ముస్లిమ్ కావడాన్ని ఒకరు ఎక్కువచేసినా, మరొకరు తక్కువ చేసినా, అందులో విషాదం తప్ప మరేమీ లేదు. సుభాన్ స్థానంలో ఒక శంకర్ కూడా ఉండి ఉండవచ్చు అతను కూడా మరొక సమర్థనతో ప్రాణాలకు తెగించి ఉండేవాడేమో? మంచితనం ఏ మతస్థులకూ గుత్త సొత్తు కాదు, చెడ్డతనం కూడా అంతే. నేరగాళ్లు, ఉత్తములు ఏ గుర్తింపునకు చెందినవారయినా, ఆ గుర్తింపు సమూహమంతా నేరస్థులూ కాదు, నీతివంతులూ కాదు. సమాజంలో తమ, పర భేదాలను తీవ్రంగా విస్తరింపజేసేవారికి, పరులు మంచిపని చేసినప్పుడు అప్రియంగా ఉంటుంది. పరులకు 'మంచి' పేరు వస్తుందన్న ఉక్రోషం ఉంటుంది. సమాజంలో సహజీవన సంస్కృతి కోరుకునేవారికి మాత్రం ఇటువంటి ఉదంతాలు జరిగినప్పుడు పండగే. వారిది ఒక నిస్సహాయ స్థితి. 'పరులు'గా చిత్రితమయ్యే వారు కూడా మంచివారే అని చెప్పగలిగే ఉదాహరణలు ఇట్లా రూపొందుతూ ఉండాలి, వారికి. అందరూ, కనీసం శ్రమజీవులందరూ, లోలోపల, సారాంశంలో, పదిమంది కోసం, పదిమందితో నిలబడేవారే అని సుభాన్ సాహసం చెబుతున్నది. అంతిమంగా, మనుషులలో ఉండే ఏకసూత్రతను, ఏకరూపతను చాటిచెబుతూ, ఒక సముదాయాన్ని, జనశ్రేణిని మూకుమ్మడిగా ఇతరులుగా, పరులుగా చిత్రించే ద్వేషవైఖరిని పరాజితం చేస్తున్నది. కానీ, ఈ విలువను నిరూపించడం కోసం, మంచివారిగా, త్యాగజీవులుగా ఉండే నిర్బంధ భారాన్ని ఆ 'పరులు' మోయవలసి రావడం విచారం కలిగిస్తుంది. ఎంత మంచితనాన్ని కుమ్మరిస్తే, నిర్మించి నిర్మించి వదిలిన రాక్షసముద్రలు తొలగిపోతాయి?

నేరగాళ్లు, ఉత్తములు ఏ గుర్తింపునకు చెందినవారయినా, ఆ గుర్తింపు సమూహమంతా నేరస్థులూ కాదు, నీతివంతులూ కాదు. సమాజంలో తమ, పర భేదాలను తీవ్రంగా విస్తరింపజేసేవారికి, పరులు మంచిపని చేసినప్పుడు అప్రియంగా ఉంటుంది. పరులకు 'మంచి' పేరు వస్తుందన్న ఉక్రోషం ఉంటుంది. సమాజంలో సహజీవన సంస్కృతి కోరుకునేవారికి మాత్రం ఇటువంటి ఉదంతాలు జరిగినప్పుడు పండగే. అందరూ, కనీసం శ్రమజీవులందరూ, లోలోపల, సారాంశంలో, పదిమంది కోసం, పదిమందితో నిలబడేవారే అని సుభాన్ సాహసం చెబుతున్నది. అంతిమంగా, మనుషులలో ఉండే ఏకసూత్రతను, ఏకరూపతను చాటిచెబుతూ, ఒక సముదాయాన్ని, జనశ్రేణిని మూకుమ్మడిగా ఇతరులుగా, పరులుగా చిత్రించే ద్వేషవైఖరిని పరాజితం చేస్తున్నది. కానీ, ఈ విలువను నిరూపించడం కోసం, మంచివారిగా, త్యాగజీవులుగా ఉండే నిర్బంధ భారాన్ని ఆ 'పరులు' మోయవలసి రావడం విచారం కలిగిస్తుంది. ఎంత మంచితనాన్ని కుమ్మరిస్తే, నిర్మించి నిర్మించి వదిలిన రాక్షసముద్రలు తొలగిపోతాయి?

ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆపద్బాంధవుల్లాగా వచ్చే ధీరోదాత్తులు కొందరున్నట్టే, తామనుకున్న ధర్మాన్ని రక్షించడానికి ప్రాణాలు తీయగలిగేవారు కూడా కొందరు ఉంటారు. వారిలో గోరక్షకులమంటూ ఆయుధాలతో సంచరించేవారు కూడా కొందరుంటారు. వారికి గోవుల రక్షణ ముఖ్యం. అందుకోసం స్వచ్ఛంద సైనికుల్లాగా, ఎక్కడెక్కడ పశువుల రవాణా జరుగుతుందో, ఎవరెవరు పశుమాంసం తింటూ ఉంటారో నిఘావేసి పట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. పట్టుకునే క్రమంలో, ఆగ్రహం ప్రకటించే క్రమంలో మనుషుల ప్రాణాలను తీయడానికి కూడా వారు వెనుకాడరు. చట్టాలను కూడా ఖాతరు చేయని గాఢమైన విశ్వాసం వారిది. హర్యానాలో పోయిన సంవత్సరం పశువుల రవాణాదార్లు అన్న అనుమానంతో ఇద్దరిని వారి వాహనంతో సహా దహనం చేయడం, అనంతరం జరిగిన హింసాకాండ తెలిసిందే. పరిస్థితి ఏమీ మారలేదు. ఈ ఆగస్టు నెలాఖరులో పాత సామాన్లు అమ్మి బతికే ఒక వలస కార్మికుడిని ఈ గోరక్షకులు చంపేశారు. అతను బెంగాల్ నుంచి వచ్చాడు. బీఫ్ తిన్నాడని అతని మీద అభియోగం. ఈ సంఘటన మీద నిరసనలు వినిపించినప్పుడు, హర్యానా ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైని దిగ్భ్రాంతికరమైన వ్యాఖ్యలు చేశారు. "ఆవులంటే వాళ్లకు అంతటి భక్తి, వాళ్లను ఎవరు ఆపగలరు?" అన్నాడాయన. ఇటువంటివి జరగకూడదు, ఇటువంటివి చేయకండి, అని కూడా అన్నారు తప్ప, చేసినవారిని చట్టం ఉపేక్షించదన్న మాట అనలేదు. ఆ ఘాతుకం సరే, దానికి మించి బాధ కలిగించే అంశం, ఆ హత్య చేసిన వారిలో ఇద్దరు మైనర్లు ఉండడం. ఎటువంటి తరం తయారవుతోందన్న బాధ కలుగుతుంది. బీజేపీ దట్టిస్తున్న ఆవేశాల వల్లనే ఇటువంటివి జరుగుతున్నాయని టీఎంసీ నాయకురాలు మహువా మొయిత్రా అన్నారు కానీ, బీజేపీ నేతలందరూ సైనీ లాగా మాట్లాడలేదు. "ఇదేమి అన్యాయం? ఇందులో గోరక్షణ ఏముంది? ఇది మానవత్వానికే అవమానం, పోలీసులు కఠినచర్య తీసుకోవాలి" అన్నారు బీజేపీ ఎంపీ ధరంబీర్‌సింగ్. చూపు పూర్తిగా కలుషితం కాని రాజకీయవాదులు లేకపోలేదు. ఈ సంఘటనలో హతుడు నిరుపేద. అతని మతమేమిటో స్పష్టంగా తెలుసును. అతను బీఫ్ తిన్నాడో లేదో కానీ, తినడానికి ఆస్కారమున్న పుట్టుకే అతన్ని చంపడానికి కావలసిన ఆధారం. అతన్ని ఒక మనిషిగా, అతనిది ఒక ప్రాణంగా చూడడానికి ఆ పుట్టుకే ఒక అవరోధం.

భారతదేశంలో గోవులను మాంసానికి కానీ, ఇతర అవసరాలకు కానీ వధించడాన్ని నిరోధించడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రయత్నిస్తే, అందుకు సామరస్యంతో జనాభిప్రాయాన్ని కూడగట్టడమూ అసాధ్యం కాదు. కానీ, ఇక్కడ సామరస్యమూ, పరిష్కారమూ ముఖ్యం కావు. సమస్య, ఘర్షణా కొనసాగడమే వారికి ప్రయోజనకరం. నిజానికి, సమస్య మూలకారణాలలోకి వెడితే, పరిస్థితి కొంత అర్థమవుతుంది. గోవులను నిర్వహించడం రైతాంగానికి అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. పశువులతో కూడిన వ్యవసాయం బాగా జరిగే రోజుల్లో కూడా, శ్రమచేయలేని, పాలివ్వలేని పశువులను రైతులు విక్రయించేవారు. సంక్షోభంలో ఉన్న రైతాంగమే గోవులను అమ్ముతున్నది. కబేళాలు కొంటున్నాయి. పశుమాంసాన్ని ఇతర దేశాలకు ఎగుమతిచేసే పెద్ద పెద్ద కబేళాలేవీ బీఫ్ భక్షక సామాజిక, మతవర్గాలకు చెందినవి కావు. ఈ రెండు చోట్లా గోరక్షకులు ఏ కార్యక్రమమూ తీసుకోరు. పశుమాంసం ఎగుమతిని నిషేధించమని, కబేళాలు మూసివేయమని వారెప్పుడూ ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయరు. తరలింపులు చేసి పొట్టపోసుకునే వారి మీద మాత్రం దాడులు చేస్తారు. మాంసం తీసుకుపోయే వారిని అనుమానిస్తారు. కారణాలు పెద్ద ఆశ్చర్యకరమైనవేమీ కావు. ముద్రలే ముఖ్యం. ముద్రల సహాయంతో చేయగలిగే సమీకరణలు ముఖ్యం.

మనుషుల మీద పడే ముద్రలు, ఒక్కోసారి ఆ ముద్రల నుంచి రక్షణ ఉన్నవారిని కూడా బలితీసుకుంటాయి. ఆగస్టు నెలలోనే హర్యానాలో ఒకచోట పశువులను ఎస్‌యువి వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారం తెలిసి, గోరక్షక బృందం మాటువేసింది. ఆ సమయంలో ఎదురైన ఒక వాహనాన్ని అడ్డగించబోతే, లోపల ఉన్నవారు బెదిరిపోయి, వేగం పెంచి పారిపోవడానికి ప్రయత్నించారు. దానితో గోరక్షకులు తుపాకితో కాల్పులు జరిపారు. ఆ ఘటనలో వాహనంలో ఉన్న 12వ తరగతి విద్యార్థి ఆర్యన్ మిశ్రా చనిపోయాడు. బహుశా, ఆ సమయంలో వాహనంలోని వారిని 'గుర్తించడానికి' గోరక్షకులకు వీలు కాలేదో, రూపురేఖలు అందుకు అవకాశం ఇవ్వలేదో? అనుమానితులు, అమాయకులు అందరూ ఒకేరకంగా కనిపించడంలోని 'శారీరక' సారూప్యత ఒక్కోసారి హంతకుల చేత 'పొరపాటు' చేయిస్తుంది. భారతదేశపు ముఖాలలో ఇంకా మతవిభజన జరగలేదు. తరలింపుదారులు వీరే అనుకుని పొరపడ్డామని హంతకులు చెబుతున్నారు తప్ప, తాము చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని తుపాకులతో వీధుల్లోకి రావడం తప్పని అనుకోవడం లేదు. ఈ రెండో వరుస సంఘటన తరువాత కూడా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిలో పెద్ద కదలిక లేదు. రెండు రోజుల కిందట మహారాష్ట్రలో కూడా ఒక ముసలాయనను రైల్లో ఒక గుంపు కిందకు తోసేసినంత పనిచేసింది. ఆయన దగ్గర గోమాంసం ఉన్నదని అనుమానం. అటువంటి ఘటనలు సాధారణమైపోయాయి. కానీ, ఆ గుంపు ఎవరు? పోలీసు ఉద్యోగానికి అర్హత పరీక్ష రాయడానికి వెడుతున్న ఉద్యోగార్థులట! రేపు వాళ్లు పోలీసులైతే, న్యాయం ఎట్లా ఉంటుందో?

హర్యానా, మహారాష్ట్ర రెండూ త్వరలో ఎన్నికలకు వెడుతున్న రాష్ట్రాలు. ద్వేషాలను మరింతగా పెంచి లాభపడదామనుకునే రాజకీయాలు గెలుస్తాయా, విసిగి వేసారి లోగుట్టు అర్థం చేసుకున్న ప్రజలు గెలుస్తారా అన్నది చూడాలి.

ఈ సంఘటనల్లో మృత్యువు కంటె, హింస కంటె, దేశవ్యాప్తంగా అది వ్యాపింపజేసే భయమూ పరాయితనమే ఎక్కువ బాధిస్తుంది. అంతో ఇంతో సభ్యత సహజీవనం ఉన్న దక్షిణాదిలో కూడా, విభజనరేఖలు వెలుస్తున్నాయి. మంచిచెడ్డలను చట్టం కాక, విశ్వాసాలు నిర్వచించి అమలుచేస్తున్నాయి. మూసలను బట్టి, ముద్రలను బట్టి మనుగడలు నిర్ణయం అవుతున్నాయి. విభజనల మీద ఆధారపడి రాజకీయార్థిక పరమార్థాలు చెలరేగిపోతున్నాయి!

కొత్త ఆలోచనలు లేకపోవడం ఎవరికైనా అవలక్షణం మాత్రమే, కానీ, బలశాలికీ, పెత్తందారుకీ భావదారిద్ర్యం ఉంటే మాత్రం అది మహా ప్రమాదకరం. ఒకసారి విఫలం అయ్యాక, జనం నీలో చెడు చూడడం మొదలుపెట్టారని తెలిశాక, ఆ గ్రహింపు తెచ్చుకోవడమే మొదట చేయవలసినది. అప్పుడు దిద్దుబాటు కోసం అన్వేషించాలి. అయితే, తప్పులను గుర్తించి దారి సరిచేసుకోవాలి లేదా, కొత్తదారులను వెదుకుతూ ప్రజల సమ్మతిని గెలుచుకోవాలి. ఈ రెండూ చేతకాక, తనకు తెలిసింది ఒకే విద్య, దాన్ని మాత్రమే పదే పదే ప్రయోగిస్తాను, మరింత బలంగా, మరింత తీవ్రంగా ఉపయోగిస్తాను అనుకునే శక్తులు, బహుశా, తమ శూన్యబుద్ధుల కారణంగానే పతనాన్ని చవిచూస్తారు.

హర్యానా, మహారాష్ట్ర రెండూ త్వరలో ఎన్నికలకు వెడుతున్న రాష్ట్రాలు. ద్వేషాలను మరింతగా పెంచి లాభపడదామనుకునే రాజకీయాలు గెలుస్తాయా, విసిగి వేసారి లోగుట్టు అర్థం చేసుకున్న ప్రజలు గెలుస్తారా అన్నది చూడాలి.

షరతులు వర్తించవు

కొన్ని అవసరాలూ
కొన్ని అనవసరాలూ అయిన
నిబంధనల బంధనాల
ఈ ప్రపంచ వలయంలో
షరతులు వర్తించని/ మానవీయ క్షేత్రాలు రెండు
ఒకటి అమ్మ ఒడి/ మరొకటి చదువుల బడి

తన కడుపులో శిశువు
రూపుదాల్చిందన్న ఊహ విరిస్తేచాలు
ఆ అమ్మతనం ఆనందాల ఆర్ణవం
ప్రాణాన్ని పణంగా పెట్టిన ప్రసవ వేదనసైతం
ఆ పురిటికేకతో ఓ ఆశల ఏరువాక

పసి ఆశను ప్రపంచశ్వాసగా
అందిస్తున్న ఆ పవిత్ర బాధ్యతలో
తల్లి తన ప్రపంచాన్ని పక్కకు నెడుతుంది
తానొక నవజాత చైతన్యశేతనమవుతుంది
అది అమ్మ ఒడి/ షరతుల ఛాయసైతం లేని
మమతల గుడి

తన తరగతి గదియే
తన ప్రపంచంగా మలచుకొని
తన మేధను మథియించి
తన గుండెను కరిగించి
ఆ లేత హృదయాలలో ఒదిగిపోతాడు
నలువైపులా జ్ఞానకిరణాల్ని ప్రసరింపచేస్తాడు
ప్రపంచాన్ని ఒక ఆశావహ వేదికగా
ముస్తాబు చేస్తాడు ఉపాధ్యాయుడు

పసిపాప కేరింతల్లో/ తల్లి మనసు పులకరించినట్లే
తన విద్యార్థి వికసనంలో
ఉపాధ్యాయ హృదయం పరవశిస్తుంది
తనకంటూ ఏమీ దాచుకోని అమ్మలాగే
తన విద్యార్థులలోనే విశ్వాన్ని దర్శిస్తాడు.
అమ్మఒడి మానవజాతి గర్భగుడి
తరగతిగది మానవనీతి గర్భగుడి
మనిషిని పెంచిన అమ్మతనానికి మాతృదేవోభవ
మనసును పంచిన ఉపాధ్యాయుడికి ఆచార్యదేవోభవ!

– మడిపల్లి దక్షిణామూర్తి



కొలిచే దైవం

మనసుని చెక్కే విద్యతో
జీవితానికి పునాదిలా
అక్షరమై నుదుట వ్రాతలో
బతుకును మలిచేవాడు

దేవుడు రూపాన్ని ధరించి
ప్రేమగా బుద్ధులు గుద్ది చెప్పి
తీపి కలకు అల్లిక నేర్పి
మంచి మనిషిగా తీర్చువాడు.

విలువ రుచిని రంగరించి
మనసు పాదున చిలరించి
చక్కని మొక్కలా నిలిపి
మంచి ఫలాల్ని కానించే వాడు

ప్రతి జీవితంలో తప్పని పాత్రలా
ప్రతి గుండెలో మరువని బంధంలా
ప్రతి నోరూ కొలిచే దైవం
ప్రతి చేయి పూజించే ఇష్టం ఉపాధ్యాయుడు.

– చందలూరి నారాయణరావు

సృష్టికి ప్రతిసృష్టి చేయగలడు

పేగుబంధంతో బిడ్డలను తీర్చిదిద్దేది తల్లిదండ్రులైతే...
ఏ బంధం లేని ఆ బిడ్డల భవిష్యత్తు తీర్చిదిద్దేది గురువులు



నుదిటి రాతను రాసేది బ్రహ్మైతే...
భవిష్యత్తు రాతను రాసేది గురువు

ప్రకృతి సంపద సృష్టికర్త భగవంతుడైతే...
ఆ ప్రకృతిలోని జ్ఞాన సంపద సృష్టికర్త గురువు

దేశాభివృద్ధిలో కీలకమైనది యువశక్తైతే...
ఆ యువశక్తిని శక్తివంతం చేసేది గురువు

పురోభివృద్ధికి అవసరమైనది జ్ఞానం అనుభవమైతే...
ఆ జ్ఞానాన్ని అనుభవాన్ని ప్రసరింపజేసేది గురువు

సామరస్య సమ్మిళిత సమాజ నిర్మాణానికి కావలసింది ఐక్యతా భావమైతే...
ఆ ఐక్యతా భావాన్ని పెంపొందించేది గురువు

దేశ పురోభివృద్ధికి అవసరమైనది భవిష్యత్తరమైతే...
ఆ భవిష్యత్తరాన్ని ప్రభావితం చేయగల జ్ఞాన శక్తి గురువు

సృజనాత్మకత, సాంకేతికత, పారిశ్రామిక విప్లవాలను తీసుకొచ్చేది విద్యాధికులైతే...
ఆ విద్యాధికులకు స్ఫూర్తి ప్రదాత, మార్గదర్శకుడు గురువు

నాయకులు, సైనికులు, ఆవిష్కర్తలు,
బాధ్యత గల పౌరులు దేశానికి వెన్నుముకైతే...
ఆ వెన్నుముక నిర్మాణంలో మూల స్తంభమైన
గురువుకు వందనం... పాదాభివందనం

– ననుబోలు రాజశేఖర్

గురువు

తమస్సు తరిమి వేసి
విజ్ఞానపు విత్తును నాటే ఉషస్సు
జ్ఞాన చక్షువును తెరిపించే
అక్షర విధాత
మట్టిని మాణిక్యాలుగా
అజ్ఞానపు పిండాలను
విజ్ఞానపు పుంజాలుగా
విద్యార్థిని విద్వత్తుగా మలిచే
విజ్ఞానపు అమృత భాండం
నాలుగు గోడల మధ్య
పరిపూర్ణ మేధస్సును పెంచి
లోకాన్ని వీక్షింపచేసే గవాక్షం
కలెక్టరైనా ప్రధాని అయినా
నన్ను మలిచింది
ఈ మహనీయుడే అని
అర క్షణమైనా ఆలస్యం లేకుండా
తలవంచి నమస్కరించే అర్థం
గురువు...

– పెండెం శివానంద్

దిద్దుబాటల్ని చూపే వేళ్లు

ఆదిమ కాలపు గురుకులాలైనా
ఆధునిక యుగంలో హంగుల నెలవులైనా
బడిలో అడుగుపెట్టే ప్రతిరోజూ
మీ గురుస్థానం మీకు మరో బాల్యం
బోధించేది ఆదికాండమైనా
ఆఖరి పర్వమైనా
పాఠం మొదలుపెట్టే ప్రతిసారీ
మీది అక్షరమాల వల్లెవేసిన నాటి శ్రద్ధ!

పండ్లచెట్టు కింద ఫలాలు రాలినట్టు
మీ మునివేళ్ల నుండి
ముచ్చటగా బొమ్మలు రాల్తాయి
మీ గొంతులో మాటలూ పాటలూ కథలూ
పరుగుపందెంలా పోటీ పడతాయి


ఛాత్రోపాధ్యాయ శిక్షణలో
ఎన్ని వాత్సల్య సూత్రాలు
మీ చెవిలో ఊది ఉంటారో..
నిదురించే పాపాయి మోములో
సన్నగా చిర్నవ్వురేఖ మురిసినట్లు
పిల్లల ముందు మీదెంత ప్రశాంత వదనం!

విద్యార్థులు వినయంగా పుస్తకాలై
మీ చెయ్యందుకోవాలేగాని
వారి బతుకులోంచి సగం చీకట్లు మాయం
మీ చూపుడువేళ్ల వెంట
దిద్దుబాటల్లో నడిస్తే
అనునిత్యం ముట్టడించాలని చూసే
ఏ అసురసంధ్యలైనా మటుమాయం

మీలాంటి నిస్వార్థ ఉపాధ్యాయ లోకం
జాతి శ్రేయస్సును కోరుతుంది
విలువలూ విజ్ఞానం అతుల్య సంపదలుగా
కొత్త తరాలకు పంచిపెడుతుంది
మీ తరగతి గది స్వప్నాల వెలుగులోనే
ఈ దేశం పచ్చగా శ్వాసిస్తుంది

– కంచరాన భుజంగరావు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా/ఎన్టీఆర్
గురువారం 5 సెప్టెంబరు 2024





పుట్టగుంట వద్ద వరద తగ్గి కనిపిస్తున్న హనుమాన్‌జంక్షన్ - గుడివాడ రహదారి



చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ సమీపంలో వరద బాధితులకు ఆహారం పంపిణీ

పాయకాపురంలో వాటర్ బాటిల్స్ తీసుకెళుతూ..

హమ్మయ్యా..!

తగ్గుముఖం పట్టిన వరద | కాస్త ఊపిరి పీల్చుకున్న జనం

- బురద మేటతో ఇబ్బంది • ఖాళీగా ఉన్న ఇళ్లల్లో చోరీలు • ఫైర్ ఇంజన్లతో పారిశుధ్య పనులు



బీడీసీ లెఫ్ట్ బ్యాంక్‌పై గండ్ల వద్దకు బురదలో నడిచి వెళుతున్న మంత్రి లోకేశ్



అజిత్‌సింగ్ నగర్ నుంచి ట్రాక్టర్లలో సురక్షిత ప్రాంతాలకు వెళుతున్న బాధితులు



వరద ప్రాంతంలో బురద శుభ్రం చేసేందుకు సిద్ధమైన ఫైర్ ఇంజిన్లు

ఒకవైపు కృష్ణానది వరద.. మరోవైపు బుడమేరు మహోగ్రంతో మూడ్రోజులు విలవిల్లాడిన బెజవాడ బుధవారం నాటికి కాస్త తేరుకుంది. బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రవాహం తగ్గింది. బాధితులు ముంపు నుంచి బయటికొస్తున్నారు. బురద మేట వేయడం.. నాలుగు రోజులపాటు మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. వ్యాధుల ముప్పు పొంచి ఉండటం.. విద్యుత్తు సరఫరా లేకపోవడం.. సర్పాలు సంచరిస్తుండటం.. వంటి కారణాలతో చాలామంది ఇళ్లను తాత్కాలికంగా వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళుతున్నారు. బాధితులు తరలి వెళ్లడంతో ఇళ్లలో చోరీలు జరుగుతున్నాయి.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

గాడినపడుతున్న సహాయక చర్యలు

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంను ఫుడ్‌స్టాక్ పాయింట్‌గా మార్చేశారు. బుధవారం ఒక్కరోజే ఇక్కడి నుంచి 10 లక్షల ఆహార ప్యాకెట్లు, 10 లక్షల వాటర్ బ్యాటిల్స్ పంపిణీ అయ్యాయి. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ఆహారంతో బయలుదేరే ప్రతి వాహనం వెంట సచివాయల కార్యదర్శిని, వలంటీరును పంపుతున్నారు. మరోవైపు నాలుగు రోజులుగా నీటిలో ఉండటంతో చాలామంది బాధితులు జ్వరాల బారిన పడుతున్నారు. వీరందరికీ అందుబాటులో మందులు ఉంచడంపైనా అధికారులు దృష్టి సారించారు.

- విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 3454 మంది పారిశుధ్య కార్మికులతోపాటు 450 మంది ప్రజారోగ్య సిబ్బందిని ఈ పనులకు వినియోగిస్తున్నారు. వీరితోపాటు ఇతర మున్సిపాలిటీల నుంచి వచ్చిన 5889 మంది కార్మికులను పారిశుధ్య పనుల్లో వినియోగిస్తున్నారు.
- వీధుల్లో, ఇళ్లలో పేరుకుపోయిన బురద మేటను శుభ్రపర్చేందుకు ఫైర్ ఇంజన్లను వినియోగిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 48 ఫైర్ ఇంజన్లను తెప్పించారు. వాటి ద్వారా వీధుల్లో, ఇళ్లలోకి చేరిన మురుగునీరును తొలగించే పనులు వేగవంతం చేశారు.



కబేళా రోడ్డులో సహాయం కోసం..



ఐఆర్‌ఆర్ వద్ద బయటికొస్తూ



డబ్బా కొట్లు సెంటర్‌లో ఇలా..



సురక్షిత ప్రాంతాలకు వెళుతూ..



వైఎస్సార్ కాలనీ నుంచి వెళుతూ..

బాధితుల నుంచి వసూళ్లు చేస్తే కఠిన చర్యలు

- సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ముంపు ప్రాంతాల్లో బాధితులను తరలించినప్పుడు, అక్కడే ఉన్న వారికి ఆహారం, పాలు, తాగునీరు అందించినప్పుడు వారి నుంచి డబ్బులు వసూలు చేస్తే బోట్లు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు హెచ్చరించారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న వారికి మానవతాదృక్పథంతో సహాయం చేయాలని సూచించారు. వరద ప్రాంతాల్లో బోట్లు నడిపే వారు బాధితుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కేసులు నమోదు చేయడంతోపాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోలుకుంటున్న బెజవాడ



ప్రశాంతినగర్‌లో సహాయమిలా..

వరద ముంపులో మరో 50 వేల మందికిపైగా బాధితులు

నేటి సాయంత్రానికి పూర్తిస్థాయిలో తరలింపు

బోట్లు అందుబాటులో ఉన్నా ఉపయోగించని అధికారులు

సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పైనే బోట్లు నిలిపివేత

స్వచ్ఛంద సంస్థల సహకారంతో సురక్షిత ప్రాంతాలకు బాధితులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్) : బుడమేరు వరద నుంచి నగరం క్రమంగా కోలుకుంటోంది. బాధితులు బుధవారం వెల్లువలా ముంపు ప్రాంతం నుంచి బయటకు తరలివస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో సింగ్‌నగర్ నుంచి దూరప్రాంతాలైన కండ్రిక, ఆంధ్రప్రభ కాలనీ, రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్, రాధానగర్, డాబాకొట్లు సెంటర్, ఇందిరానాయక్ నగర్, పైపులరోడ్డు, తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా వరద బాధితులు సురక్షిత ప్రాంతాలకు పోటెత్తారు.

- తెల్లవారుజాము నాటికి రెండు నుంచి మూడు అడుగుల మేర సింగ్‌నగర్ దూర ప్రాంతాల్లో వరద మట్టం తగ్గింది. దీంతో గత మూడు రోజులుగా బిక్కుబిక్కుమంటూ గడిపిన వరద బాధితులు బయటకు వచ్చేశారు. అయితే బుధవారం మధ్యాహ్నం నాటికి కండ్రిక, అంబాపురం వైపు ఉన్న ఆంధ్రప్రభ కాలనీ 11లో ఇంకా మెడలోతు నీటితోనే ఉన్నాయి. ఈ ప్రాంతంలో దాదాపు 75 వేల మంది బుధవారం మధ్యాహ్నానికి బయటకు వచ్చేశారు. ఇంకో 75 వేల మంది బయటకు రావల్సి ఉంది.

స్వచ్ఛంద సంస్థల సాయంతో..

బాధితుల తరలింపు తక్కువగా ఉండటం వల్ల అగ్నిమాపక శకటాలు తమ పనులు నిర్వహించలేకపోయాయి. స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నాయకుల పంపిన ట్రాక్టర్లు బాధితుల రాకపోకలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వరద నుంచి వచ్చే బాధితులు దాదాపుగా నాలుగు నుంచి పది కిలో మీటర్ల మేర నడుచుకుని రావటంతో వారికి స్వాంతన కలిగించేందుకు స్వచ్ఛంద సంస్థలు ఆటోలు, లారీలు, మినీవ్యాన్‌లు, ట్రాక్టర్ల వంటివి పెద్ద సంఖ్యలో నడిపాయి. పైపులరోడ్డు, గొల్లపూడి, తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపించింది.

ఇద్దరు అధికారులతోనే..

రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఐఏఎస్ అధికారి కోన శశిధర్ బాధితుల తరలింపు విషయంలో చొరవ చూపించారు. ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసి అందులోకి స్థానిక కార్పొరేషన్ సిబ్బందిని వరద ముంపు ప్రాంతాల్లోకి పంపించారు. పోలీసు శాఖ నుంచి ఏడీసీపీ గున్నం రామకృష్ణ ఒకేఒక్కడుగా సింగ్‌నగర్ దగ్గర పనిచేశారు. అటు కోన శశిధర్, ఇటు గున్నం రామకృష్ణ ఇద్దరూ సమన్వయం చేసుకుంటూ వరద బాధితుల తరలింపు కోసం వాహనాలు, సిబ్బందిని పంపిస్తూ బాధితులను తరలించారు. మాజీ మునిసిపల్ కమిషనర్, ప్రస్తుత సీఎంఓలో పనిచేస్తున్న ప్రద్యుమ్న కలెక్టరేట్‌కు వచ్చిన తరువాతే బాధితుల ఆపరేషన్ ఓ గాడిలో పడింది.

కొనసాగుతున్న అధికారుల నిర్లక్ష్యం

నాలుగో రోజు సింగ్‌నగర్ దూర ప్రాంతాల నుంచి వరద బాధితులను తీసుకువచ్చే విషయంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం మరోమారు బయటపడింది. రాష్ట్ర వ్యాప్తంగా సమీకరించిన పడవలు, ఎన్డీఆర్ఎఫ్ బోట్లు మూడు వంతులకుపైగా సింగ్‌నగర్ ఫ్లైఓవర్ సర్వీసు రోడ్డులోనే నిలిపేశారు. వాస్తవానికి ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో బుధవారం ప్రచురితమైన కన్నీళ్లు-కష్టాలు కథనంపై జిల్లా యంత్రాంగం తెల్లవారుజామునే స్పందించింది. ఆహార వ్యర్థాలతో తీవ్ర అపరిశుభ్రంగా, దుర్గంధంగా ఉన్న సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌ను మాత్రం పరిశుభ్రం చేశారు. ఆ తరువాత జిల్లా యంత్రాంగం ఈ బోట్లను సింగ్‌నగర్ నుంచి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు పంపిస్తుందని భావిస్తే ఆ పని చేయలేదు. బోట్ల నిర్వాహకులకు జిల్లా యంత్రాంగం నుంచి కనీస సహకారం లేదు. కేవలం డాబా కొట్లు సెంటర్ పరిసర ప్రాంతాల నుంచి మాత్రమే 75 వేలకుపైగా బాధితులు బయటకు వచ్చారు. మధ్యాహ్నం 3 గంటల తరువాత ఒకటి, రెండు అడుగులు నీటి మట్టం తగ్గటంతో శివారు ప్రాంత వాసులు కూడా తరలిరావటం పరిమిత సంఖ్యలో ప్రారంభమైంది. వీరికి ఆహారం, నీటి పంపిణీ జరగలేదు. ఎస్డీఆర్ఎఫ్ బోట్లు కూడా సర్వీసు రోడ్డు పక్కనే పెద్ద సంఖ్యలో నిలిపేశారు. చాలా బోట్లు లారీల నుంచి కూడా బయటకు తీయలేదు. ఎన్డీఆర్ఎఫ్ బోట్లు 30 శాతం వరద నీటిలోకి దిగి బాధితులను రక్షించాయి.

కృష్ణమ్మ శాంతం.. బుడమేరు భయానకం!



మోపిదేవి మండలంలో నీటి ముంపులో ఉన్న కంద పంటను చూపుతున్న రైతు

ప్రకాశం బ్యారేజీ నుంచి భారీగా తగ్గిన వరద

బడమేరు వరద దిగువకు ప్రవాహం • గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల్లో పొంచి ఉన్న ముప్పు

వరి, కంద, మొక్కజొన్న, అరటి తోటలకు తీవ్ర దెబ్బ • వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణానదికి వరద ప్రవాహం తగ్గింది. ప్రకాశం బ్యారేజీ నుంచి 3.93 లక్షల క్యూసెక్కుల వరద నీటిని బుధవారం నాటికి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. పులిగడ్డ అక్విడెక్టు వద్ద 19 అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. లంక గ్రామాలు ముంపు నుంచి బయటపడ్డాయి.

- విజయవాడను పూర్తిగా ముంచేసిన బుడమేరు వరదనీరు దిగువకు ప్రవహిస్తుండంతో గుడివాడ, పామర్రు, గన్నవరం నియోజకవర్గాల్లోని నందివాడ, ఉంగుటూరు, పెదపారుపూడి మండలాలపై ప్రభావం చూపుతోంది. గుడివాడ నియోజకవర్గంలోని లింగాల, పెదలింగాల, చేదుర్తిపాడు, ఒద్దులమెరక, రామాపురం, అరిపిరాల, వెన్ననపూడి, కుదరవల్లి, ఇలపర్రు, లక్ష్మీనరసింహపురం, పెదపారుపూడి మండలం మోపర్రు తదితర గ్రామాల్లోకి వరదనీరు చేరింది.
- పుట్టగుంట నుంచి హనుమాన్‌జంక్షన్‌కు వెళ్లే రహదారిపై బుడమేరు కాజ్‌వేపై నాలుగు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. చేపలచెరువులకు గండ్లు పడ్డాయి. పెదపారుపూడి మండలం మోపర్రు, నందివాడ మండలం పుట్టగుంట వద్ద బుడమేరు వరద ఉధృతిని కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు బుధవారం పరిశీలించారు.
- నందివాడ మండలంలోని చేదుర్తిపాడు, ఒద్దులమెరక, రామాపురం, అరిపిరాల గ్రామాల ప్రజలను నందివాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. గన్నవరం మండలం కీసరపల్లి-ఉప్పులూరు రహదారికి బుడమేరు వరదనీటి కారణంగా గండి పండింది. దీంతో కంకిపాడు-గన్నవరం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తరిగొప్పుల, మానికొండవద్ద బుడమేరు, వన్నెవాగు, పొంగి ప్రవహిస్తుండటంతో మానికొండ-గన్నవరంల మధ్య రాకపోకలు ఆగిపోయాయి.
- ఉంగుటూరు-లంకపల్లి, తేలప్రోలు-ఉయ్యూరు, తరిగొప్పుల-ఉంగుటూరు, గన్నవరం నుంచి పుట్టగుంట వెళ్లే రహదారుల్లో కాజ్‌వేలపై రెండు అడుగులకుపైగా వరదనీరు ప్రవహిస్తుంటంతో ఈమార్గాల వెంబడి రాకపోకలు నిలిచిపోయాయి. ఉంగుటూరు మండలం తరిగొప్పుల, వేంపాడు, చికినాల, వెల్దిపాడు, ఓంద్రంపాడు, లంకపల్లి, ముక్కపాడు, వెంకటరామాపురం ఎలుకపాడు, గారపాడు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు తదితర గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి.



చేదుర్తిపాడులో పడవల్లో వరద బాధితులను తరలిస్తున్న అధికారులు



వరద ప్రాంతాల్లో కృష్ణాజిల్లా కలెక్టర్, ఎస్పీ

నీట మునిగిన పంట పొలాలు..

- బాపులపాడు మండలంలో 5వేల ఎకరాల్లో వరి, మినుము నీటమునిగాయి. నందివాడ మండలంలో మూడువేల ఎకరాల వరిపొలాలు నీటిలో మునిగాయి.
- ఉంగుటూరు మండలంలో 8 వేల ఎకరాల్లో వరిపైరు నీట మునిగింది. మచిలీపట్నం, కోడూరు, నాగాయలంక, గుడివాడ, పామర్రు, తదితర మండలాల్లో వరి పొలాల్లో నీరు ఇంకా నిలబడే ఉంది.
- లంకభూముల్లో, కరకట్టకు కృష్ణానదికి మధ్య ఉన్న భూముల్లో సాగుచేసిన కంద, పసుపు, అరటి, మొక్కజొన్న, కూరగాయలు, నిమ్మ, పూలతోటలు వరదనీటి నుంచి బయటపడుతున్నాయి.
- పసుపు పైరు నాలుగురోజులుగా నీటిలోనే ఉండటంతో మొవ్వ ఊడిపోయే పరిస్థితిలో ఉంది. కంద, అరటి పిలక తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

కడగండ్లు!


అన్నదాత కష్టం వరదపాలు

8లో..


- వరదలకు పూర్తిగా దెబ్బతిన్న పంటలు
- పనికిరాకుండా పోయిన కంద, పసుపు, కూరగాయ తోటలు
- నాలుగురోజులుగా నీటిలోనే పంటలు
- వరి, పత్తి, మినుముతో పాటు అరటి, పసుపు, కంద నీట మునక
- రైతులకు కోట్లలో నష్టం.. ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

మేమున్నామని.. మీకేం కాదని..

వరద బాధితులకు సినీ ప్రముఖుల సాయం









వరదలతో ఇబ్బంది పడుతున్న తెలుగు ప్రజానీకాన్ని ఆదుకునేందుకు కొంతమంది సినీ ప్రముఖులు ఇప్పటికే తమవంతు సాయాన్ని అందించగా బుధవారం మరికొందరు విరాళాలను ప్రకటించారు. వరద బాధితులను ఆదుకునేందుకు చిరంజీవి రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయనిధికి చెరో రూ. 50 లక్షలు ఇస్తున్నట్లు ఆయన సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'వరద వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు నన్ను కలిచివేశాయి. పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అందరూ తమకు తోచినట్లు సహాయ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి. ఈ విపత్కర పరిస్థితులు త్వరలోనే తొలగిపోవాలి' అని ఆయన ఆకాంక్షించారు. చిరు తనయుడు రామ్‌చరణ్ సైతం రూ. 50 లక్షల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. తెలుగు ప్రజలకు అందరూ అండగా ఉండాల్సిన సమయమిదని రామ్‌చరణ్ పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి కూడా రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వరద బారిన పడిన 400 పంచాయతీలకు ఒక్కోదానికి రూ. లక్ష చొప్పున మొత్తం రూ. నాలుగు కోట్ల సాయాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.

అగ్ర కథానాయకుడు ప్రభాస్ తన వంతుగా రూ. రెండు కోట్ల విరాళాన్ని ప్రకటించారు. తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. కోటి చొప్పున అందజేయనున్నట్లు ఆయన టీమ్ తెలిపింది. అల్లు అర్జున్ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ విపత్కర పరిస్థితులు తొలగిపోయి ప్రజలంతా సురక్షితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వరద బాధితులను ఆదుకునేందుకు అక్కినేని కుటుంబం, గ్రూపు సంస్థలు రెండు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించాయి. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 25 లక్షల సాయాన్ని ప్రకటించిన వైజయంతీ మూవీస్ సంస్థ తాజాగా తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 20 లక్షల విరాళాన్ని ప్రకటించింది. నిర్మాత అశ్వనీదత్ బుధవారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్ అందజేశారు. హీరో సాయిదుర్గ తేజ్ ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. 20 లక్షలు, విజయవాడలోని అమ్మ ఆశ్రమానికి రూ. 5 లక్షల విరాళం ప్రకటించారు. అలీ, జుబేదా దంపతులు ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. ఆరు లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు.

పవన్ కల్యాణ్ - రూ. 2 కోట్లు (ఏపీలోని గ్రామ పంచాయితీలకు రూ. 4 కోట్లు)
ప్రభాస్ - రూ. 2 కోట్లు
చిరంజీవి - రూ. కోటి
రామ్‌చరణ్ - రూ. కోటి
అల్లు అర్జున్ - రూ. కోటి
అక్కినేని కుటుంబం, గ్రూప్ సంస్థలు కలిపి - రూ. కోటి
సాయిదుర్గ తేజ్ - రూ.20 లక్షలు
వైజయంతీ మూవీస్ - రూ. 20 లక్షలు (తెలంగాణకు)
అలీ, జుబేదా దంపతులు - రూ. 6 లక్షలు

సమంతకు గాయం



టాలీవుడ్ కథానాయిక సమంత గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆమె బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఎప్పుడు, ఎలా గాయపడ్డారు అనే వివరాలను ఆమె వెల్లడించలేదు. మోకాలి గాయానికి ఆక్యుపంచర్ విధానంలో చికిత్స తీసుకుంటున్నారు సమంత. తన శరీరంలో రెండు సూదులు గుచ్చి ఉన్న ఫొటోను ఆమె షేర్ చేసి, 'గాయాల బారిన పడకుండా యాక్షన్ స్టార్‌ను అవ్వగలనా?' అని సరదాగా స్పందించారు. దీంతో సమంత లీడ్‌రోల్‌లో నటిస్తూ, నిర్మిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం షూటింగ్‌లో గాయపడ్డారని భావిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ బన్నీ' వెబ్‌సిరీస్ త్వరలో ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది.

లైంగిక వేధింపులకు పాల్పడితే ఐదేళ్ల నిషేధం

నడిగర్ సంఘం మహిళా భద్రతా కమిటీలో తీర్మానం



నటీమణులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు రుజువైతే చిత్రపరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్ళపాటు నడిగర్ సంఘం నిషేధం విధించనుంది. ఈ మేరకు నడిగర్ సంఘం అనుబంధ విభాగమైన మహిళా భద్రతా కమిటీ సమావేశంలో తీర్మానించారు. ఈ కమిటీ సమావేశం బుధవారం నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, కోశాధికారి కార్తీ, కమిటీ అధ్యక్షురాలు రోహిణి సారథ్యంలో కమిటీ సభ్యులు సుహాసిని, ఖుష్బూ, లలిత కుమారి, కోవై సరళ తదితరులు పాల్గొన్నారు. ఇందులో కొన్ని తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే వాటిపై విచారణ జరిపి నిజమని తేలితే చిత్ర పరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్ళపాటు నిషేధం విధించేలా తీర్మానం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు, న్యాయ సలహాలు ఇప్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని తొలుత హెచ్చరించి, ఆ తర్వాత చర్యలకు ఉపక్రమిస్తారు. కమిటీకి ఫిర్యాదు చేసే బాధితులు మీడియాతో ప్రత్యక్షంగా మాట్లాడకూడదు. యూట్యూబ్‌లో సినీ నటులను కించపరిచేలా మాట్లాడేవారిపై బాధితులు సైబర్ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారికి కమిటీ అన్ని విధాలా సహకరిస్తుంది.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

కోరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర 1' చిత్రం నుంచి మాస్ నంబర్‌ను విడుదల చేశారు. 'కోరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా' అంటూ రామజోగయ్యశాస్త్రి రాసిన పాట వీడియోను విడుదల చేశారు. ఈ పాటలో ఎన్టీఆర్ వేసిన స్టెప్పులు ఆడియన్స్‌తో డాన్స్ చేయించేలా ఉన్నాయి. ఎన్టీఆర్ డాన్స్ ఎలా ఉండాలని అభిమానులు కోరుకుంటారో దాన్ని వించేలా శేఖర్ మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించారు. జాన్వీకపూర్ గ్లామరెస్‌గా కనిపించారు. ఎన్టీఆర్‌తో పోటీగా స్టెప్స్ వేశారు. 'దేవర' మీద ఇప్పటివరకూ ఉన్న అంచనాలు ఈ పాటతో నెక్స్ట్ లెవల్‌కు చేరాయి. అనిరుధ్ అందించిన సంగీతం పాటకు ప్రాణం పోసింది. హై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'దేవర' రెండు భాగాలుగా ప్రేక్షకులను అలరించనుంది. మొదటి భాగాన్ని ఈ నెల 27న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల చేస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ నిర్మిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్

విడుదల వాయిదా



'ఈ నెల ఏడున 'జనక అయితే గనక' సినిమాను విడుదల చేయాలనుకున్నాం.అయితే ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో వరద పరిస్థితుల కారణంగా విడుదల వాయిదా వేస్తున్నాం. నవ్వుల వినోదం పండించే రోజుని త్వరలో ప్రకటిస్తాం. ప్రేక్షకులు అందరూ థియేటర్లలో చూసి ఆస్వాదించాల్సిన సినిమా కనుక ఈ నిర్ణయం తీసుకున్నాం' అని వెల్లడించారు దిల్ రాజు. సుహాస్ హీరోగా రూపుదిద్దుకున్న 'జనక అయితే గనక' చిత్రానికి సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. శిరీష్ సమర్పణలో హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'మూవీ ఫైనల్ వెర్షన్ చూశాను. చాలా బాగా నచ్చింది. అందుకే యుఎస్‌ఏ హక్కులు కొన్నాను. ప్రతి దానికీ లెక్కలు చెప్పే మిడిల్ క్లాస్ యువకుడిగా నటించా. దిల్ రాజుగారు ఎంతో సపోర్ట్ చేశారు' అన్నారు.

పిల్లలతో చూడాల్సిన సినిమా



ప్రియదర్శి, విశ్వదేవ్, నివేద థామస్, గౌతమి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నందకిషోర్ ఈమాని దర్శకత్వంలో రానాదగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ 'ఇది పిల్లలతో కలసి చూడాల్సిన సినిమా. దర్శకుడు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా తెరకెక్కించార'ని ప్రశంసించారు.

మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది



వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు మీనాక్షీ చౌదరి. వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ సరసన ఆమె నటించిన 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీనాక్షీ మీడియాతో పంచుకున్నారు.

"ఈ సినిమాలో నాది చాలా మంచి పాత్ర. ఆ పాత్ర నన్ను నేను రిలేట్ చేసుకునేలా ఉంటుంది. దర్శకుడు వెంకట్ ప్రభు ఈ సినిమాలో ప్రతీ క్యారెక్టర్‌ను చాలా బాగా తీర్చిదిద్దారు. ఈ మూవీ షూటింగ్ సమయంలో విజయ్, స్నేహ, లైలా వంటి అనుభవజ్ఞులైన నటుల నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ సినిమా అందరికీ మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది. విజయ్ యాక్టింగ్, వెంకట్ ప్రభు డైరెక్షన్ స్కిల్స్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి" అని చెప్పారు.

ఫిష్ వెంకట్‌కు సాయం



విలన్ పాత్రల్లోనూ తనదైన శైలిలో కామెడీని పండిస్తూ తెలుగు ప్రేక్షకులను నవ్వించిన ఫిష్ వెంకట్ రెండు కిడ్నీలు పాడై దయనీయ స్థితిలో జీవితం వెళ్లదీస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఖర్చు పెట్టే స్తోమత లేక ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నట్లు ఆయన ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. సినిమాల్లో నటించమని పిలుపు వస్తున్నా ఒంట్లో సత్తువ లేక కొన్నేళ్ల నుంచి ఇంటికే పరిమితమైనట్లు చెప్పారు. ఖర్చులకు చేతిలో పైసా లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలను అందజేశారు. ప్రసన్న కుమార్, రామసత్యనారాయణ, కె.అజయ్‌కుమార్, అనిల్ ఈ చెక్కును ఫిష్ వెంకట్‌కు అందజేశారు.



జేఎన్‌టీయూకేలో ఎంటెక్ స్పాన్సర్డ్ కోటా



కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. కనీసం ఏడాది అనుభవం ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- సివిల్ ఇంజనీరింగ్ - స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్
- ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ - హై ఓల్టేజ్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్
- మెకానికల్ ఇంజనీరింగ్ - క్యాడ్/క్యామ్, మెషిన్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్
- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ - కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ
- రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ - రెన్యూవబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఏఐఎంఈ లేదా ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ/ఫిజిక్స్/బయోటెక్నాలజీ/ఎర్త్‌సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/జియాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. గేట్ 2024/జీప్యాట్ 2024/ఏపీ పీజీఈసెట్ 2024 ర్యాంక్ ఉండాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

'దికూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cHqjyDZలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. దీని వ్యవధి నాలుగు నెలలు(150 గంటలు). ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండుంబావు వరకు, సాయంత్రం రెండు నుంచి అయిదుంబావు వరకు సెషన్స్ నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా అసైన్‌మెంట్లు, అసెస్‌మెంట్లు, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఫైనల్ ఎగ్జామ్స్ ఉంటాయి. కోర్సు మెటీరియల్‌కు సంబంధించి లైఫ్ టైమ్ యాక్సెస్ ఇస్తారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** www.iift.ac.in





మేము సైతం..


వరద బాధితులను పరామర్శించి, పాల ప్యాకెట్లు అందజేస్తున్న మండలి వెంకట్రామ్

- వరద ముంపు బాధితులకు అండగా దాతలు, స్వచ్ఛంద సంస్థలు
- విరాళాలు, ఆహారం, తాగునీరు, మందులు, దుప్పట్ల పంపిణీ
- పశువులకు సైతం మేత పంపిణీ చేస్తోన్న నాయకులు

నాగాయలంక, సెప్టెంబరు 4 : వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్దప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ అన్నారు. బుధవారం మండలంలోని ఈల చెట్లదిబ్బ, నాచుగుంట, ఏసుపురం, కృష్ణాపురం, ఎదురుమొండి గ్రామాల్లో వెంకట్రామ్ అధికారులు ఎల్.నిత్యానంద్, ఎం.హరనాథ్‌బాబులతో కలసి పర్యటించారు. వరద ముంపు నుంచి తేరుకుంటున్న నివాసితుల కుటుం బాలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈలచెట్లదిబ్బలో పశువుల కోసం ప్రభుత్వం ద్వారా రెండు టన్నుల దాణా అందజేశారు. మెండు లక్ష్మణరావు, కన్నా నాగరాజు, తలశిల నాని, గుడివాక శివరావు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్ : వరదల్లో ఇళ్లు చేరుకుని తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న పాత ఎడ్లంక వాసులకు జనసేన నేత మండలి వెంకట్రామ్ నేతృత్వం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ జనసేన నేతలు దాసరి సత్యం, గుడివాక శివరావు, రాయపూడి వేణుగోపాలరావు, గుడివాక శేషుబాబు, తాతపూడి గణేష్, శ్రీనివాస్, చందు పవన్, తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి : మోపిదేవి మండలంలోని వరద ప్రభావిత గ్రామాలైన కె.కొత్తపాలెం, బొబ్బర్లంక గ్రామాల్లో బాధిత కుటుంబాలకు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవ స్థానం, ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో 2500 పులిహోర ప్యాకెట్లు, 2500 వెజిటబుల్ బిర్యాని, వాటర్ ప్యాకెట్లను ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ద్వారా కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక గ్రామాల్లోని వరద బాధి తులకు ఆహార ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు ప్రిన్సిపాల్ మధుసూదనరావు, బాధితులకు అందజేశారు.

మోపిదేవి, : కృష్ణానది వరద ఉధృతి కారణంగా ముంపుకు గురైన ప్రతీ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి తెలిపారు. బుధవారం ఉదయం మోపిదేవి మండలంలోని బొబ్బర్లంక, కె.కొత్తపాలెం, మోపిదేవి వార్పుల్లో పర్యటించి ముంపు బారిన పడిన గృహాలను పరిశీలించారు. మరో రెండు రోజులు పునరావాస శిబిరాలు ఏర్పాటు కొనసాగుతుందని, ప్రతీ ఒక్కరూ తమ తమ నివాస గృహాలను శుభ్రం చేసుకుని ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు దిడ్ల జానకి రాంబాబు, దొప్పలపూడి గంగాభవాని, కొక్కిలిగడ్డ మాధవి, ఎంపిటిసి సభ్యులు చందన రంగారావు, రావి రత్నగిరి, తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, ఆర్ఐ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆహారం పంపిణీ చేస్తున్న పెడన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

అవనిగడ్డ : అవనిగడ్డ మండల పరిధిలోని దివి గ్రామమైన ఎడ్లంకలో పశుగ్రాసం కొరత ఏర్పడి మూగజీవాల ఆకలిని తీర్చేందుకు పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ ముందుకు వచ్చారు. బుధవారం రెండు ట్రాక్టర్ల వరి గడ్డిని పశువుల మేత కోసం అందించగా, గ్రాసం లేక అల్లాడుతున్న జీవాల మేత కోసం ఐదు బస్తాల జొన్నలను రైతులకు అందజేశారు. గ్రామ ప్రముఖులు దోవా గోవర్ధన్, సర్పంచ్ పాలేపు సామ్రాజ్యం, విక్కుర్తి వీర రాఘవయ్య ట్రస్ట్ ప్రతినిధి విక్కుర్తి రాంబాబు, పులిగడ్డ చంద్ర, వర్రే బస్వారావు, శ్రీను, నాంచారయ్య, పున్నయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి : గుంటూరు జిల్లాలో అంతర్భాగంగా ఉండే చల్లపల్లి మండలం ఆముదార్లంక గ్రామానికి అధికారులు బుధవారం లాంచీల ద్వారా భోజనం తీసుకువెళ్లి గ్రామంలోని వరద బాధితులకు అందచేశారు. సుమారు 750 మందికి భోజనం ప్యాకెట్లు, వాటర్ టిన్‌లు, మంచినీటి ప్యాకెట్లు తీసుకువెళ్లారు. తహసీల్దార్ డి.వనజాక్షి ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి డీటీ కృష్ణమోహన్, ఏపీవో రామ్మోహన్‌తోపాటు అధికారుల బృందం సహాయక కార్యక్రమంలో పాల్గొన్నారు.

చల్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పునరావాసం పొందుతున్న వరద బాధితులకు చల్లపల్లి శ్రీఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో సిహెచ్.చినరాట్నాలు, ఈవోఆర్డీ బూరేపల్లి అశోక్‌కుమార్, ఈవో పివి.మాధవేంద్రరావుల చేతులమీదుగా బాధితులకు దుప్పట్లు అందచేశారు. ఆర్యవైశ్యసంఘం అధ్యక్ష, కార్యదర్శులు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్, తమ్మన సతీష్‌కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ బొజ్జా దంపతులు రూ.50వేలు విరాళం


పశువులకు మేత, దాణా అందిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్

జగ్గయ్యపేట : రాష్ట్రంలో వరద, తుఫాన్ బాధితుల సహాయా ర్థం జగ్గయ్యపేటకు చెందిన దంతవైద్య దంపతులు డాక్టర్ బొజ్జా రాజే ష్, సౌమ్య దంపతులు కుమార్తె అక్షజ్ఞతో కలిసి రూ.50వేలు చెక్‌ను విజయవాడ పార్లమెంట్ టీడీ పీ అధ్యక్షుడు నెట్టెం రఘురాంకు బుధవారం ఆయన నివాసంలో కలిసి అందచేశారు. వ రద బాధితులను ఆదుకునేందుకు తమవంతుగా మానవత్వంతో ఈ సాయం అందిస్తున్నామని వారు చెప్పారు. రాష్ట్ర వైసీపీ డాక్టర్స్ మహిళా వి భాగం ప్రధాన కార్యదర్శిగా ఉన్న సౌమ్య రూ.50వేలు విరాళంగా ఇవ్వటం చర్చనీయాంశమైంది.

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం నుంచి విజయ వాడకు మూడు వేల పొట్లాల ఆహార పదార్థాలను తీసుకుని వెళ్ళే వాహనాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. మాన వత స్వచ్ఛంద సేవా సంస్థ, బ్రాహ్మణ సేవా సంఘం ప్రతి నిధులు శ్రీరామ్, పి.వి. ఫణికుమార్, బి. కుటుంబరావు, సిహెచ్. విజయచడగార్, వింజమూరి శివరాం, పి.ఎస్.ఎస్.ఆర్. శర్మ కార్యక్రమాలను చేపట్టారు. కాగా మైత్రి ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో తోట్లవల్లూరు వరద బాధితులకు తీసుకుని వెళ్ళే ఆహార పదార్థాలను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు వేణుకుమార్ పాల్గొన్నారు. **పామర్రు :** తోట్లవల్లూరు మండలంలోని వరద బాధితులకు పామర్రు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం తోట్లవల్లూరు మండ లంలోని పునరావాస కేంద్రాల్లో గల 200మంది బాధితులకు అల్పా హారంతోపాటు మరో 400మందికి భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నవులూరి వీరవెంకయ్య, చంద్రశే ఖర్, బైసాని నాగేశ్వరరావు తోటరమేష్, శ్రీనివాసరావు, బొప్పన స్వర్ణలత పాల్గొన్నారు. కొండాయపాలెం వనం మనం సేవ సంస్థ తరఫున ఆ సంస్థ అధ్యక్షుడు పీఎస్ఆర్ రూ .లక్ష విలువ గల నిత్యావసర సరుకులును కొండపల్లి, ఇబ్రహింపట్నం పరిసర వరద బాదితులకు పంపిణి నిమిత్తం తరలించారు.

పెడన : బుడమేరు వరదల సందర్భంగా విజయవాడలోని 58వ డివిజన్ ఇన్‌చార్జిగా నియమి తులైన పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ వరద బాధితులకు ఆహారం, పాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని అధికారులతో సమా వేశాలు ఏర్పాటు చేస్తూ సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.


కె.కొత్తపాలెం వద్ద ముంపు గృహాలను పరిశీలిస్తున్న ఆర్డీవో


మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నుంచి భోజనం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ ప్రారంభిస్తున్న ఈవో చక్రధరరావు


మానవత స్వచ్ఛంద సేవా సంస్థ విజయవాడకు వెళ్తున్న ఆహార పదార్థాలను తీసుకు వెళ్తున్న వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న గొర్రెపాటి గోపిచంద్

ఆపరేషన్ 'అగ్నిపథ్'

- విజయవాడకు చేరుకున్న 131 అగ్నిమాపక వాహనాలు
- నేటి నుంచి ముంపు ప్రాంతాల్లో పరిశుభ్రత చర్యలు

విజయవాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు వరద 2.50 లక్షల మందిని బాధితులుగా చేసింది. వేలాది ఇళ్లను బురదలో ముంచేసింది. నీరు తగ్గిన ప్రాంతాల్లో అడుగుపెట్టలేని పరిస్థితి. ఈ ప్రాంతాల్లో రహదారులు, ఇళ్లను శుభ్రం చేయడానికి అగ్నిమాపక వాహనాలు రంగంలోకి దిగాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 131 అగ్నిమాపక వాహనాలు ఇక్కడికి చేరుకున్నాయి. వాటిని బీఆర్టీఎస్ రోడ్డులో నిలుపుదల చేశారు. నీరు తగ్గుముఖం పట్టిన భవానీపురం, ఊర్మిళానగర్ ప్రాంతాల్లో అగ్నిమాపక శాఖ అధికారులు బుధవారం ట్రయల్ నిర్వహించారు. అక్కడి పరిస్థితులను అంచనా వేశారు. ఈ వాహనాల్లో నింపడానికి నీరు ఎంతదూరంలో అందుబాటులో ఉందో గుర్తించారు. మొత్తం 31 డివిజన్లను బుడమేరు బురద కమ్మేసింది. వరద నీరు తగ్గిన ప్రాంతాల్లో రహదారులు, ఇళ్ల ప్రహరీలు, ఇళ్లను ఈ ఫైరింజన్ల సహాయంతో శుభ్రం చేస్తారు. రహదారులపై ఉన్న బురదను ఎక్కువ ఫోర్స్‌తో, ఇళ్లు, ప్రహరీలకు ఉన్న బురదను తక్కువ ఫోర్స్‌తో నీళ్లను పంపి ఊడ్చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో అర కిలోమీటరు, మరికొన్ని ప్రాంతాల్లో రెండు కిలోమీటర్ల దూరంలో మంచినీరు లభ్యమవుతున్నట్టు అగ్నిమాపక శాఖ అధికారులు గుర్తించారు. ఒక్కో ఇంటిని శుభ్రం చేయడానికి 10-30 నిమిషాల సమయం పడుతుంది. ఒక్కో ఫైరింజన్‌లో నీరు రెండు గంటలపాటు వస్తుంది. ఖాళీ అయిన ఫైరింజన్‌ను నింపడానికి రెండు గంటల సమయం పడుతుందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

రైతన్న కష్టం వరదపాలు

- జలాశయాన్ని తలపిస్తున్న పంట పొలాలు
- ఆందోళన చెందుతున్న రైతులు

కోడూరు, సెప్టెంబరు 4 : వాయుగుండం ప్రభావంతో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు, కృష్ణానదికి భారీగా వస్తున్న వరద తాకిడికి వర్షపు నీరు బయటికిపోయే దారి లేక కురిసిన వర్షం పంట పొలాల్లోనే నిలిచిపోయి కోడూరు మండలంలో పలు చోట్ల దశలలో ఉన్న పంట పొలాలు జలాశయాన్ని తల పిస్తున్నాయి. పంట మునిగి ఐదు రోజులు కావొస్తున్నప్ప టికీ ఇప్పటి వరకు తేలకపోవటంతో తీవ్రంగా నష్టపోతా మని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోడూరు మండలంలో పలు దశలలో ఉన్న వరి సుమారు 4 వేల ఎకరాలలో నీటమునిగిందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

చల్లపల్లి : కుండపోత వర్షాలకు చల్లపల్లి మండలంలో 1250 హెక్టార్లలో వరిపంట నీటమునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. ముంపు గ్రామాల్లో మండల వ్యవసాయశాఖ అధికారిణి జి.సాయిసింధు పర్యటించి రైతులకు సూచనలు అందిస్తున్నారు. ఘంటసాల కేవీకే శాస్త్రవేత్తలు, గుంటూరు లాం ఫాం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.సత్యనారాయణ తదితరులు మంగళాపురం గ్రామంలో పర్యటించి పంట నష్టం పరిశీలించారు. కృష్ణానదికి వరదనీటి విడుదల జరుగుతున్న నేపథ్యంలో మురుగు కాల్వలు ఎగదట్టి ఉండటంతో ఇంకా మంగళాపురం, మాజేరు గ్రామాల్లో వరిచేలల్లో నీరు పూర్తిగా బయటకు వెళ్లలేదు. మండల పరిధిలో ప్రధానంగా మంగళాపురం, మాజేరు గ్రామాల్లో వరి నీటమునిగింది. పాగోలు, మేకావారిపాలెం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లోనూ వరి నీటిముంపుకు గురికాగా, పలుచోట్ల క్రమేపీ ముంపులోంచి బయటపడింది.


చల్లపల్లి మండలం మంగళాపురంలో ముంపును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు


కరకట్టను పటిష్టపరచడాన్ని పరిశీలిస్తున్న గోపు సత్యనారాయణ

కూచిపూడి : వరద ప్రభావం కారణంగా నీటమునిగిన వరి పొలాలు నేటికీ ముంపులోనే తేలియాడుతున్నాయి. గొరుచుట్టుపై రొకలిపోటులా వరద తగ్గుముఖం పడుతుందన్న దశలో బుధవారం కురిసిన వర్షానికి అన్నదాతలు మరింత ఆందోళన చెందుతున్నారు. చినముత్తేవి, నిడుమోలు, మొవ్వ, నర్సంపాలెం, కాజ, కోసూరు, నిడుమోలు, కూచిపూడి, పెదపూడి తదితర గ్రామాల్లో సుమారు 6 వేల ఎకరాల్లో వరి పంట నీటమునిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

మచిలీపట్నం టౌన్ : బందరు మండలంలో సుల్తానగరం, పెదయాదర, చినయాదర, కోన, ఎస్.ఎన్. గొల్లపాలెం తదితర ప్రాంతాల్లో వరి పొలాలు, వేరుశెనగ పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ముంపునకు గురైన ప్రాంతాలలో టీడీపీ, జనసేన నాయకులు సందర్శించారు.

బాధితులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 4 : తుఫాను వల్ల పంట దెబ్బతిన్న రైతాంగాన్ని ఆస్తులు కోల్పోయిన ప్రజలనురాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. తుఫాను వల్ల రహదారులు, పంట, ఇల్లు నష్టపోయిన మండలంలోని ముచ్చింతాల, అనిగండ్లపాడు గ్రామాలను ఎమ్మెల్యే స్థానిక దేశం నేతలతో కలసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారని తప్పనిసరిగా ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఆస్తులు కోల్పోయిన వారు కూడా తప్పనిసరిగా ప్రభుత్వం న్యాయం చేస్తుందని, ఎవరు అధైర్య పడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య, ప్రముఖులు అత్తులూరి అచ్యుతరావు, పొందూరి శేఖర్, పొందూరి సుధాకర్, తొట్టెంపూడి వేణు, గంగోరి జనార్ధన్, పొందూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెప్పరిల్లిన దివిసీమ

అవనిగడ్డ, సెప్టెంబరు 4 : గడిచిన మూడు రోజులుగా అవనిగడ్డ నియోజకవర్గాన్ని వణికించిన కృష్ణానదికి వరద తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద ఉధృతిలో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు వరద 3.50 లక్షలకు తగ్గిపోవటంతో నీటమునిగిన తమ పంట పొలాలు చూసుకుని కన్నీరుమున్నీరు అవుతున్నారు.

బయటపడిన లంక గ్రామాలు

వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో వరదలో చిక్కుకున్న పలు గ్రామాలు బుధవారం తెల్లవారు జాము నుంచి వరద నీటి నుంచి క్రమేణా బయటపడుతున్నాయి.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

హుండీల ఆదాయం రూ.61 లక్షలు


హుండీల ఆదాయం లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

మోపిదేవి, సెప్టెంబరు 4 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ. 61,76,785లు వచ్చినట్లు ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు తెలిపారు. బుధవారం దేవాయదాశాఖ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో హుండీలను తెరచి లెక్కించగా, 68 రోజులకు గానూ ఆలయంలోని హుండీలలో గల నగదు 61 లక్షలు, కేజీ 500 గ్రాముల వెండి, బంగారం 10 గ్రాములు, అమెరికన్ డాలర్లు 199 వచ్చినట్లు ఈవో తెలిపారు. పోలీసు సిబ్బంది, ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రి మహోత్సవాల రాట ప్రతిష్ఠ

గుడివాడ : స్థానిక బంటుమిల్లి రోడ్డులో వ్యాపారస్తుల ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీగణపతి నవరాత్ర మహోత్సవాల పందిరి రాటను బుధవారం ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో శ్రీకన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థాన చైర్మన్ జవ్వాజి గంగరాజు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు యక్కలి మణిదీప్, వైశ్య ప్రముఖులు జల్లా రఘు, పాల్వాది శేషుబాబు, జగత్, శ్యాంసుందర్, పవన్‌కుమార్, నాగరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ రథోత్సవం



జగ్గయ్యపేట, సెప్టెంబరు 4 : శ్రావణమాస ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ బుధవారం అమ్మవారి రథోత్సవం వైభంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. దేవస్థానం కమిటీ ప్రతినిధులు కొత్తా రమేష్‌కుమార్, కొంకిమళ్ల సురేష్, నోముల శివకుమార్, దేవరశెట్టి నాగప్రసాద్ తదితరులు యాత్రలో పాల్గొన్నారు.

300 కిలోల గంజాయి పట్టివేత


మాట్లాడుతున్న ఏసీపీ రవికిరణ్

కంచికచర్ల, సెప్టెంబరు 4: కంచికచర్ల వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం పోలీసులు 300 వందల కిలోల గంజా యి పట్టుకున్నారు. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం అటవీ ప్రాంతం నుంచి గంజాయి కొని, కారులో ముంబైకు అక్రమంగా తరలిస్తున్నారు. మహారాష్ట్ర పూణే జిల్లా సోంగాన్ గ్రామానికి చెందిన శుభం దత్తాత్రేభన్డవాల్కర్ (26)ను అరెస్టు చేసి, కారు, మూడు సెల్‌ఫోన్లు, రూ. 11500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నర్సీపట్నంలో కిలో మూడు వేల వంతున కొని, ముంబైలో పది వేలకు అమ్ముతున్నారని ఏసీపీ రవికిరణ్ చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ 30 లక్షలుంటుదని చెప్పారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ చవాన్, ఎస్ఐ బోనగిరి రాజు ఉన్నారు.

నాగవరప్పాడు వంతెన వద్ద బారికేడ్లు



గుడివాడ : బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో స్థానిక నాగవరప్పాడు వంతెన వద్ద ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా బారికేడ్లను ఏర్పాటు చేశామని, ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్.ఐ ప్రసాద్ తెలిపారు.

జగ్గయ్యపేట అతలాకుతలం

జగ్గయ్యపేట, సెప్టెంబరు 4: వరదలు, తుఫాన్ ప్రభావంతో జగ్గయ్యపేట అతలాకుతలమైంది. జగ్గయ్యపేట నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదార్లలో బ్రిడ్జిల తీవ్రంగా దెబ్బతిన్నాయి. జగ్గయ్యపేట నుంచి తెలంగాణా, గుంటూరు జిల్లాలను అనుసంధానించే ముఖ్యాల రోడ్డులో అగ్రహారం వద్ద పాలేటి బ్రిడ్జికు అప్రోచ్ రోడ్డు పాలేటి వరదకు కోసుకు పోవటంతో రాకపోకలు స్థంబించాయి. ఆంధ్రా-తెలంగాణా రాష్ట్రాలతో పాటు అనేక సిమెంట్ కర్మాగారాలకు రవాణా స్థంభించింది. విజయవాడ-హైద రాబాద్ హైవేపై ఆంధ్రా-తెలంగాణా సరిహద్దులో గరికపాడు-రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న బ్రిడ్జి ధ్వంసం కావటంతో ప్రస్తుతానికి తాత్కాలికంగా వాహనాలను అనుమతించినా భారీ నష్టాన్ని మిగిల్చింది. జగ్గయ్యపేట నుంచి తెలంగాణాలో వైరాను కలిపే ప్రధాన రహదారిపై లింగాల వద్ద మునేటికి వచ్చిన వరద తాకిడి వల్ల కాజ్‌వే నామ రూపాల్లేకుండా పోయింది.

తాగునీటికి ముప్పు

జగ్గయ్యపేట పట్టణానికి తాగునీటిని అందించే వాటర్ వర్క్స్ కృష్ణాపాలేటికి వచ్చిన వరద వల్ల ముంపుకు గురైంది. అగ్రహారం వద్ద వాటర్ వర్క్స్ నుంచి పట్టణానికి సర ఫరా అయ్యే మెయిన్ పైపులైన్ ధ్వంసం కావటంతో గత రెండు రోజులుగా మంచినీటి పంపిణి నిలిచిపోయింది. 10 రోజుల వరకు ఇదే పరిస్తితి కొనసాగే అవకాశం ఉంది. వాటర్ వర్క్స్‌లో మోటార్లు, ఇతర యూనిట్లు బాగు చేసి, పైపులైన్‌ను పునరుద్ధరించాల్సి ఉంది.


వల్లూరుపాలెంలో కుళ్ళిన పసుపు మొక్కలను చూపుతున్న రైతులు

వరద ముంపుకు గురై నల్లగా మాడిపోయిన పత్తి చేను

కడగండ్లు!



- అన్నదాత కష్టం వరదపాలు
- వరదలకు పూర్తిగా దెబ్బతిన్న పంటలు
- పనికిరాకుండా పోయిన కంద, పసుపు, మొక్కజొన్న, కూరగాయ తోటలు
- లంక భూముల్లో తీవ్ర నష్టం
- నాలుగురోజులుగా నీటిలోనే పంటలు
- వరి, పత్తి, మినుముతో పాటు అరటి, పసుపు, కంద నీట మునక
- రైతులకు కోట్లలో నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

(తోట్లవల్లూరు/కంచికచర్ల)

కృష్ణానదీ వరదకు తోట్లవల్లూరు లంకల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బుధవారం వరద తగ్గటంతో రైతులు పడవలపై లంకలకు వెళ్లారు. నాలుగు రోజుల క్రితం పచ్చగా కళకళలాడిన పంటలు వరద నీటిలో కుళ్లిపోవటం చూసి బావురు మంటున్నారు. పొలాల్లో నిలిచిన వరద నీటిని గండ్లుపెట్టి బయటకు పంపిస్తున్నారు. అయినా కంద, పసుపు, మొక్కజొన్న, కూరగాయ తోటలు ఎందుకు పనికిరాకుండా కుళ్లిపోయాయని రైతులు కన్నీరు పెడుతున్నారు. ఎకరాకు కందకు రూ 3 లక్షలు, ఎకరా పసుపుకి రూ. 1.50 లక్షల చొప్పున నష్టం వచ్చిందని రైతులు చెపుతున్నారు. ఒక ఎకరంలో కంద విత్తనం రూ 2 లక్షలు పెట్టి కొన్నామని, సాగు ఖర్చులు, కౌలుతోతో కలిపి రూ 3 లక్షల వరకు నష్టపోతున్నామని, పుట్టు పసుపు విత్తనం రూ 10 వేల నుండి రూ 12 వేలు పెట్టి సాగు చేశామని రైతులు తెలిపారు. లంకల్లో ఈ క్రాప్ పూర్తి చేయలేదని రైతులు చెపుతున్నారు. ప్రభుత్వం నిబంధనలు సడలించి పంటల బీమా వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే పునరావాస శిబిరాల నుండి కొందరు లంక గ్రామాల్లోని ఇళ్ళకు వెళుతున్నారు. ఇళ్ళల్లో ఒండ్రుమట్టి పేరుకుని వస్తువులను పూడ్చేసిందని అంటున్నారు. లంక గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి కరెంటును పునరుద్ధరిస్తే మళ్ళీ జనజీవనం మొదలయ్యే పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది.

లంకభూముల్లో..

కృష్ణా, మునేరు వరదలకు లంక భూములోని పంటలు కకావికలమయ్యాయి. కోట్లలో నష్టం వాటిల్లటంతో రైతులు అల్లాడిపోతున్నారు. కంచికచర్ల మండలం మున్నలూరు వద్ద కృష్ణానదిలో మునేరు విలీనమయ్యే సంగమ ప్రాంతంలో మున్నలూరు, మోగులూరు, చందర్లపాడు మండలం ఏటూరు గ్రామాలకు చెందిన రైతులకు మూడు వందల ఎకరాల సారవంతమైన భూములు ఉన్నాయి. లంక భూముల్లో వరి, పత్తి, వినుముతో పాటు అరటి, పసుపు, కంద సాగు చేస్తుంటారు. 150 ఎకరాల్లో వరినాట్లు వేయగా ఎకరాకు కౌలుతో కలిపి రూ. 45 వేలు పెట్టుబడి అయింది. ప్రస్తుతం వరి పొట్టదశలో ఉంది. కంద 55 ఎకరాల్లో సాగు చేయగా, కేవలం విత్తనం ఖర్చు ఎకరానికి రెండు లక్షలు కాగా, పెట్టుబడి రూ. 50 వేలు దాటింది. అరటికి ఎకరానికి రూ. 70 వేల నుంచి రూ. 80 వేల వరకు పెట్టుబడి అయింది. మినుము పంట 70 ఎకరాల్లో సాగుచేయగా రూ. 40 వేలు పెట్టుబడి అయింది. పంటలు ఆశాజనకంగా ఉన్న తరుణంలో కృష్ణానది, మునేరు లంక భూములపై విరుచుకుపడ్డాయి. 15 నుంచి 20 అడుగుల ఎత్తున వరద ముంచెత్తింది. నాలుగు రోజులు నీట మునిగి ఉండటంతో పంటలన్నీ కకావికలమయ్యాయి. కోట్లలో నష్టం వాటిల్లింది. కృష్ణానదికి వరద ఇంకా వస్తుండటంతో లంక భూములకు వెళ్లటానికి వీలుపడటం లేదు. ఐదు రోజులు నీటిలో మునిగి ఉండటంతో వరి పనికిరాకుండ పోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కదిలిస్తే కన్నీళ్లు పెడుతున్నారు. బాధిత రైతులను తక్షణమే ఆదుకోవాలని తెలుగుదేశం సీనియర్ నాయకులు సూర్యదేవర నాగేశ్వరరావు, కొండపనేని నాగయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


తోట్లవల్లూరు లంకలో వరదకు చనిపోయిన పసుపుతోట


వరద దెబ్బకు కకావికలమైన మాగాణి వరి


దాములూరు - కూడలి రహదారిపై గండి

దాములూరు-కూడలి రహదారికి నాలుగు చోట్ల భారీ గండ్లు

వీరులపాడు : వైరా కట్లేరు, మునేరుకు వచ్చిన భారీ వరదలకు దాములూరు-కూడలి వెళ్లే రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. రెండు కిలోమీటర్లలో నాలుగుచోట్ల భారీ గండ్లు పడ్డాయి. రోడ్డు సగానికి పైగా దెబ్బతింది. 15 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వీరులపాడు మండలానికి, తెలంగాణ రాష్ట్రంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ మండలం ఏటి పట్టు గ్రామాల్లో భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో నాలుగు రోజులుగా అంధకారంలో ప్రజలు అల్లాడుతున్నారు.

సింగ్‌నగర్ ముంపు ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

- వరద బాధితులకు భోజనం, వాటర్, పాలు పంపిణీ


సింగ్‌నగర్‌లో వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

వన్‌టౌన్, సెప్టెంబరు 4 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగ్‌నగర్‌లోని వరద ముంపు ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ నుంచి చంద్రబాబు నాయుడు జేసీబీ వాహనంపై వాంబే కాలనీ వరకు వెళ్లారు. వాహనం దిగి నేరుగా బాధితుల వద్దకు నడుచుకుంటూ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు ఎవరూ అధైర్యపడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ముంపు ప్రాంతాల్లో బాధితులకు ఆహార ప్యాకెట్లు, వాటర్, పాలు, పండ్లు అందచేస్తున్నట్లు తెలిపారు. వరద నీరు తగ్గటంతో పారిశుధ్య పనులు కూడా వేగవంతం చేసినట్లు తెలిపారు. సర్వస్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వరద బాధితులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలతో పాటు భద్రతా ఏర్పాట్లను కల్పించాలని సంబంధిత అధికారులను సీఎం ఆదేశించారు.






వరద బాధితులకు బియ్యం బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న బుద్దా వెంకన్న

పశ్చిమ బాధితులకు బియ్యం బ్యాగ్‌లు పంపిణీ

వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గం 40వ డివిజన్ పరిధి భవానీపురం టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం వరద బాధితులకు టీడీపీ నాయకులు బియ్యం బ్యాగ్‌లను పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సుమారు 1500 మందికి బియ్యం బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి), కాకినాడ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పి.వి. చిన్న సుబ్బయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌ఘడ్ జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న ఆకువాని చెరువు నీరు

ఆకువాని చెరువుకు గండి

శాంతినగర్, ఇందిరమ్మ కాలనీలు ముంపు

జి.కొండూరు: కొండపల్లి ఎర్ర బ్రిడ్జ్ సమీపంలో ఉన్న ఆకువాని చెరువుకు ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌ఘడ్ 30వ జాతీయ రహదారి వైపు గండి పండింది. దీంతో నీరు శాంతినగర్, ఇందిరమ్మ కాలనీలలోకి చేరడంతో ప్రజలు ఇళ్లను ఖాళీ చేస్తున్నారు. నిన్నటి వరకు బుడమేరు గండ్ల వల్ల ముంపు బారిన పడిన కాలనీ వాసులు ఆకువాని చెరువు గండితో మరో మారు ముంపు బారిన పడ్డారు. బీడీసీ రైట్ బ్యాంక్‌కు పడిన గండ్ల నుంచి బుడమేరు వరద మరోమారు ఇందిరమ్మకాలనీని ముంచే ప్రమాదం ఉందని కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు.

వదంతులను నమ్మొద్దు

కలెక్టర్ సృజన

వన్‌టౌన్ : బుడమేరుకు మళ్లీ వరద వస్తుందంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. బుడమేరులో ప్రమాదకరస్థాయిలో నీరు లేవని, ఒకవేళ బుడమేరుకు మళ్లీ వరద వస్తే ముందుగానే సమాచారం తెలియపరుస్తామని పేర్కొన్నారు. ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకుని సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఆమె సూచించారు. ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదన్నారు.


చెక్కును చంద్రబాబుకు అందజేస్తున్న శంకరబాబు

వరద బాధితులకు వెలగపూడి రూ.10 లక్షల విరాళం

పెనమలూరు : వరద బాధితులకు టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు రూ.10 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి చెక్కును శంకరబాబు ముఖ్యమంత్రికి అందజేశారు.


మొండితోక కారును అడ్డగించిన వరద బాధితులు

మొండితోకకు చేదు అనుభవం

- కారును అడ్డుకున్న వరద బాధితులు

కంచికచర్ల రూరల్ : నందిగామ వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావుకు వరద బాధితుల నుంచి చేదు అనుభవం ఎదురైంది. కృష్ణా పరీవాహక ప్రాంతాల వరద బాధితులకు కంచికచర్ల ఓసీ క్లబ్‌లో కూటమి నాయకులు పునరావాసం ఏర్పాటు చేసి మూడు రోజులుగా భోజనం, నీరు అందిస్తున్నారు. బుధవారం ఉదయం వరద బాధితులను పరామర్శించేందుకు మొండితోక రాగా.. నాలుగు రోజులుగా ఏమయ్యామో కూడా చూడకుండా ఇప్పుడు పరామర్శకు వచ్చారా.. అంటూ బాధితులు నిలదీశారు. గో బ్యాక్ అంటూ నినాదాలు చేసి ఆయన వాహనాన్ని చుట్టుముట్టారు. ప్రజలను టీడీపీ నేతలు వారించినా బాధితులు నెట్టేశారు. మొత్తం మీద మొండితోకకు చేదుఅనుభవం తప్పలేదు.

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి



గంపలగూడెం : కిడ్నీ వ్యాధితో బాధపడుతూ బుధవారం మరొకరు మృతి చెందారు. వినగడప గ్రామ శివారు తండాకు చెందిన మాడవతు తిరుపతిరావు (50) ఐదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి తీవ్రం కావడంతో ఇంటి వద్దనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

తగ్గినట్టే తగ్గి..

- బుడమేరుకు పెరుగుతున్న వరద ప్రవాహం
- వర్షానికి పొంగిన పులివాగు, కొండ వాగులు
- గండ్ల మరమ్మతులు పూర్తి కాకుంటే విజయవాడకు ప్రమాదమే..


గండ్ల వద్ద పరిస్థితిని లోకేశ్‌కు వివరిస్తున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే వసంత

జి.కొండూరు, సెప్టెంబరు 4 : బుడమేరు ముంపు ప్రమాదం పూర్తిగా తొలిగిపోలేదు. మంగళవారం వరద కాస్త తగ్గుముఖం పట్టినట్టు కనిపించినా మంగళవారం రాత్రికి ఎగువ ప్రాంతాలతో పాటు జి.కొండూరు మండలంలో కురిసిన వర్షానికి మరోమారు జి.కొండూరులోని పులివాగుతో పాటు ఇతర వాగులు కదిలాయి. దీంతో బుడమేరుకు వరద వస్తున్నది. ప్రస్తుతం వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద 5,500 క్యూసెక్కుల వరద వస్తోంది. రాత్రికి సుమారు 6,500 క్యూసెక్కులకు చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రెగ్యులేటర్ గేట్లు పూర్తిగా మూసి వచ్చే వరదను మొత్తం బీడీసీ ద్వారా కృష్ణానదిలోకి మళ్లించాలంటే బీడీసీ లెఫ్ బ్యాంకుకు పడిన మూడు భారీ గండ్లను పూడ్చాల్సి ఉంటుంది. గండ్ల మరమ్మతు పనులు ఏమాత్రం అలస్యం అయినా రెగ్యులేటర్ గేట్లు ఎత్తి వచ్చే వరదను విజయవాడ వైపు మళ్లించాల్సిందే. అలా చేస్తే వరద నీటి నుంచి విజయవాడను రక్షించడం సాధ్యపడని విషయం. వాతావరణశాఖ మరో 24 గంటల పాటు వర్షాలు ఉన్నాయని చేస్తున్న హెచ్చరికలతో అటు రైతులు ఇటు వరద బాధితులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

బీడీసీ గండ్లు పూడ్చండి

ముంపు ప్రాంతాల్లో లోకేశ్ పర్యటన

జి.కొండూరు : ఎన్ని కోట్లు ఖర్చయినా పర్వాలేదు తక్షణం బుడమేరు వరద మళ్లింపు కాలువ (బీడీసీ)కు పడిన గండ్లను పూడ్చించాలని మంత్రి నారా లోకేశ్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని, ఇరిగేషన్‌శాఖ అధికారులను ఆదేశించారు. బీడీసీ లెఫ్ట్ బ్యాంక్‌కు వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద శాంతినగర్ సమీపంలో పడిన గండ్లకు మరమ్మతు పనుల్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బుడమేరు పరిస్థితికి అధికారులదే బాధ్యత అని అసహనం వ్యక్తం చేశారు. త్వరగా గండ్లను పూడ్చించాలని, బుడమేరు వరద నీరు విజయవాడ వైపు రాకుండా నివారించాలన్నారు. గండ్లను పూడ్చించే బాధ్యతను మంత్రి నిమ్మల రామానాయుడు, స్థానిక ఎమ్మెల్యే వసంతకు అప్పగించారు. వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి నారా లోకేశ్ బీడీసీ పక్కనే ఉన్న శాంతినగర్ ఇందిరమ్మ కాలనీ వరద బాధితులకు హామీ ఇచ్చారు. నాలుగు రోజులు ఓపిక పట్టండి.. అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. ఆయన వెంట మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గండ్ల మరమ్మతులు పూర్తి కాకపోతే..

గండ్ల మరమ్మతులు పూర్తికాకపోతే వెలగలేరు రెగ్యులేటర్ గేట్లు ఎత్తినా ఒకటే, దింపినా ఒక్కటే ఎందుకంటే బీడీసీ ద్వారా వచ్చే వరద గండ్ల మరమ్మతులు పూర్తయితేనే కృష్ణాలో కలుస్తుంది. మూడు గండ్లలో ఏ ఒక్క గండి ఉన్నా ఆ గండి నుంచి బీడీసీలో వచ్చే వరదంతా మరల విజయవాడ వైపే వెళుతుంది. గండ్ల మరమ్మతులు పూర్తయితే 8 వేల క్యూసెక్కుల వరద నీటిని బీడీసీ ద్వారా కృష్ణానదిలో కలపవచ్చు.

మార్చురీకి 24 మృతదేహాలు

18 మృత దేహాలు బంధువులకు అప్పగింత.. గుర్తు తెలియనివి నాలుగు

విజయవాడ (ప్రభుత్వ ఆసుప్రతి), సెప్టెంబరు 4 : వరదల కారణంగా నగరంలోని అజిత్‌సింగ్‌నగర్‌తో పాటు పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగిపోవడంతోపాటు కొన్నిచోట్ల వరద ఉధృతికి ప్రజలు కొట్టుకుపోయారు. కొంతమందికి ఎటువంటి సహకారం అందక ఆకలితో, ఇతర అనారోగ్య కారణాలతో మరణించారు. ఈ కారణంగా నగరంలోని ప్రభుత్వాసుపత్రికి ఈ మూడురోజుల్లో బుధవారం సాయంత్రం నాటికి మొత్తంగా 24 మృతదేహాలు వచ్చాయి. మార్చురీకి వచ్చిన మృతదేహాల్లో 18 మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు. మరో నాలుగు మృతదేహాలను గుర్తు తెలియనివన్నారు. పోస్టుమార్టం నిర్వహించిన 18 మృతదేహాలను వారి బంధువులకు అప్పగించగా ఇంకా రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాల్సి ఉందన్నారు.

మార్చురీ వద్ద బంధువుల హాహాకారాలు

వరద ముంపు కారణంగా కనిపించకుండా పోయినవారు, మృతుల వివరాలను తెలుసుకునేందుకు బుధవారం పెద్దసంఖ్యలో నగరంలోని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలివచ్చారు. కొంతమంది తమ కుటుంబసభ్యులు కనిపించకుండా పోవడంతో ఆందోళన వ్యక్తం చేయగా, మరికొందరు మార్చురీలో శవమై కనిపించడంతో వారి కుటుంబసభ్యులు పెద్దపెట్టున ఆర్తనాదాలు చేస్తూ కన్నీరు మున్నీరవుతున్నారు. దీంతో మార్చురీ వద్ద ఉద్విగ్న వాతావరణం నెలకొంది. ఇంకొందరు తమ కుటుంబ సభ్యులు పేర్లు చెబుతూ వారి ఫొటోలను పట్టుకుని కనిపించినవారందరినీ అడుగుతుండటం కలిచివేసింది. ఇక తప్పిపోయిన మరికొందరైతే తమకోసం తమవాళ్లు ఆసుపత్రికి వస్తారేమోనన్న ఆశతో ఎదురుచూడటం కనిపించింది.

300 కిలోల గంజాయి పట్టివేత

కంచికచర్ల రూరల్: విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం అటవీప్రాంతం నుంచి 300 కేజీల గంజాయిని కొనుగోలు చేసి కారులో ముంబైకి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఏసీపీ రవికిరణ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, మహారాష్ట్ర పూణే జిల్లా సోంగాన్ గ్రామానికి చెందిన శుభం దత్తాత్రే భన్దవాల్కర్ (26)ను అరెస్టు చేసి అతడి నుంచి 300 కిలోల గంజాయి, కారు, 3 సెల్‌ఫోన్స్, రూ.11,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఏ తల్లి బిడ్డో..!

రోడ్డుపై మృత శిశువు



తిరువూరు : కట్టలేరు సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో రోజుల మృత శిశువును గుర్తుతెలియన వ్యక్తులు వదిలి వెళ్లారు. బుధవారం పాదచారులు, ద్విచక్రవహనదారులు రోడ్డు పక్కనే ఉన్న శిశువును గుర్తించారు. రోజుల శిశువును ఎవరు వదిలివెళ్లారోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరద బాధితులకు అండగా అయాన..


భోజన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అయాన కన్వెన్షన్ సెంటర్ అధినేతలు

కంకిపాడు, సెప్టెంబరు 4 : వరద బాధితులకు అండగా నిలిచేందుకు ముందుకు రావాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు తమ వంతు సాయం అందిస్తున్నామని కంకిపాడు అయాన కన్వెన్షన్ అధినేతలు యార్లగడ్డ మనోజ్ కుమార్, యార్లగడ్డ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడే లేని విధంగా వరద భీభత్సాన్ని సృష్టించిందన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతు సాయంగా అయాన కన్వెన్షన్ సెంటర్ నుంచి విజయాడ పట్టణంలోని గొల్లపూడి, పాయకాపురం, గుణదల, పెనమలూరు మండలంలోని యనమలకుదురు, పులపాక గ్రామాల్లో చిక్కుకున్న బాధితులకు, పునరావాస కేంద్రాలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు.

కనిగిరి ఆర్డీవో బృందానికి ప్రశంసలు..



విజయవాడ : వరద సహాయ చర్యలను చేపట్టడంలో నిరంతరం శ్రమిస్తున్న ప్రకాశం జిల్లా కనిగిరి ఆర్డీవో జానీర్విన్ బృందాన్ని స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా ప్రశంసించారు. జానీర్విన్ బృందం గత మూడు రోజులుగా బుడమేరు వరద ప్రాంతంలో తీవ్రంగా శ్రమిస్తోంది. వీరి సేవలను గమనించిన సిసోడియా బుధవారం వారి వద్దకు వచ్చి ప్రశంసించారు. ఈ టీంలో పొదిలి ఇన్‌చార్జి ఆర్ఐ కె.సుబ్బారావు తదితరులు వున్నారు.

వరద బాధితులకు అండగా తానా ఫౌండేషన్..



సత్యనారాయణపురం : వరద బాధితులకు అండగా తానా ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఆహారం, పాలు, వాటర్‌బాటిల్స్‌ను సరఫరా చేశారు. మూడు రోజులుగా సుమారు 50 వేల ఆహార పొట్లాలు, మంచి నీటి బాటిల్స్, పాల ప్యాకెట్లను వరదలో చిక్కుకున్నవారికి అందచేశామని తానా ఫౌండేషన్ ఛైర్మన్ శశికాంత్ తెలిపారు.

లక్ష వాటర్ బాటిల్స్ పంపిణీ



వరద బాధితులు భయపడాల్సిన అవసరం లేదని, సీఎం చంద్రబాబు, ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉంటాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహన కృష్ణ అన్నారు. ముంపు ప్రాంతాలలో పర్యటించి వరద బాధితులకు లక్ష వాటర్ బాటిల్స్‌ను అందజేశారు.

ఆంధ్రప్రదేశ్ కోళ్ల రైతుల తరపున రూ. 25 లక్షల విరాళం..

ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీఫెడరేషన్ అధ్యక్షుడు కె.సుబ్బారావు నేతృత్వంలో ఉపాధ్యక్షుడు టి.కుటుంబరావు, పశ్చిమగోదావరి జిల్లా ఎన్ఇసిసి ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు, తుర్పుగోదావరిజిల్లా సత్యబాస్కర పౌల్ట్రిస్ అధినేతలు నల్లమిలి వీరెడ్డి, పడాల రామకృష్ణలు విజయవాడలో చంద్రబాబును కలిసి వరద బాధితుల సహాయార్థం రూ.25లక్షల చెక్కును అందచేశారు.

సాయిమేధా విద్యాసంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటిలో భాగంగా ముంపు ప్రాంతాలైన సింగ్‌నగర్, ఆర్ఆర్‌పేట, కె.ఎల్.రావు నగర్, పాటు గుణదల కరకట్ట ప్రాంతంలో పులిహోర పొట్లాలు, తాగునీరు పంపిణీ చేశారు.

వినాయకచవితికి వినాయకుడిని పెద్ద పెద్ద మండపాల్లో మాత్రమే కాదు.. ఇళ్లలో కూడా అందంగా అలకరించుకుంటారు. అయితే ఆ అలంకరణ ఎలా చేయాలనే విషయంలో చాలా మందికి సందిగ్ధత ఉంటుంది. దీనిని తొలగించటానికి నాలుగు రకాల అలంకరణలను మీకు సూచిస్తున్నాం..

వినాయకుడి మండపాల అలంకరణ ఇలా!



పూల మండపం

మండపానికి పూలు ఇచ్చినంత శోభ- మరే ఇతర అలంకారాలతోను రాదు. అంతే కాదు పువ్వులు పాజిటివిటీకి, స్వచ్ఛతకు ప్రతిరూపాలు కూడా! రకరకాల పువ్వులను తీసుకువచ్చి.. వాటిని గణపతి వెనక అందంగా పేరిస్తే- అద్భుతమైన మండపం అవుతుంది. బంతి పువ్వులు, చేమంతులతో పాటుగా గులాబీలను అందమైన బొకేలుగా తయారుచేసి మండపం ముందు పెడితే చూడటానికి చాలా అందంగా కనిపిస్తుంది.



దుప్పట్టాలతో...

ఎరుపు, పసుపు, ఆకుపచ్చ- ఇలా మన ఇళ్లలో రకరకాల దుప్పట్టాలు ఉంటాయి. వీటిలో తీసుకొని మండపాన్ని జాగ్రత్తగా అలంకరిస్తే- మొత్తం లుక్ మారిపోతుంది. ఒక వేళ ఇంట్లో కొత్త దుప్పట్టాలు లేకపోతే- ప్రత్యామ్నాయంగా శాలువాలను కూడా ఉపయోగించవచ్చు.

లైట్లతో అందం...

చిన్న చిన్న అరటి మొక్కలు.. వెనక ధగధగలాడే లైట్లు- ముందు అందమైన వినాయకుడు.. ఈ తరహా మండపాన్ని ఊహించుకుంటేనే ఆనందంగా అనిపిస్తుంది. అయితే లైట్ల కనెక్షన్ మాత్రం తప్పనిసరిగా ఉండాలి. దీనికి కూడా అయ్యే ఖర్చు తక్కువే!





రంగు రంగుల కాగితాలతో...

రంగు కాగితాలు మనకు స్టేషనరీ షాపుల్లో దొరుకుతాయి. వీటిని అందంగా కట్ చేయటం ఎలాగో యూట్యూబ్‌లో అనేక మంది నేర్పుతున్నారు. కొన్ని కాగితాలు కొని- వాటిని అందమైన ఆకృత్తుల్లో కట్ చేసి గణేష్ మండపానికి వెనక అందిస్తే చూడటానికి చాలా బావుంటుంది. దీనికయ్యే ఖర్చు కూడా చాలా తక్కువ.

ప్రొఫెసర్‌గా తరగతి గదిలో పాఠాలే కాదు... చక్కని రచనలతో గ్రంథకర్తగానూ పేరు గడించారు. పుస్తకాలే తన పిల్లలుగా... సాహిత్యమే తన లోకంగా జీవిస్తున్న డాక్టర్ కవితా భట్ కథ ఇది.

ఆమెకు పుస్తకాలే పిల్లలు

"జీవితం ఎప్పుడూ మనం అనుకున్నట్టు సాగదు. ఎత్తుపల్లాలు.. ఆటుపోట్లు... అన్నిటినీ తట్టుకొని ముందుకు సాగితేనే అనుకున్నది సాధించగలం. ఇది నాకు అనుభవం నేర్పిన పాఠం. ఉత్తరాఖండ్ తెహ్రీ గఢవాల్ జిల్లాలోని బౌన్సారా గ్రామం మాది. మా నాన్న బంకేలాల్ రతూరీ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పని చేసేవారు. ఆయన జీతంతో ఇల్లు గడవడమే కష్టంగా ఉండేది. ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ పరిస్థితులూ అంతంతమాత్రమే. సంతానంలో నేనే పెద్ద. మా కోసం నాన్న పడుతున్న ఆవేదన, ఆందోళన నాకు అర్థమయ్యేది. నేనూ ఆయన కష్టాన్ని పంచుకోగలిగితే బాగుండని చిన్నప్పుడు ఎన్నో సందర్భాల్లో అనుకునేదాన్ని. వీటి నుంచి గట్టెక్కాలంటే చదువు ఒక్కటే మార్గమని భావించాను. బీఎస్సీ పూర్తయిన తరువాత ఫిలాసఫీ, యోగా, ఇంగ్లీష్, సోషల్‌వర్క్ సబ్జెక్టుల్లో మొత్తం నాలుగు మాస్టర్స్ డిగ్రీలు సాధించాను. లక్ష్యం వైపు పయనించాలంటే బలమైన పునాదులు ఉండాలి కదా. అందుకే ఇవన్నీ చదివాను. అంతేకాదు... సామాజిక అంశాలపై మరింత లోతైన అవగాహన కోసం ఉమెన్ ఎంపవర్‌మెంట్ తదితర డిప్లమో కోర్సులతోపాటు పీహెచ్‌డీ కూడా చేశాను.

కఠిన పరీక్షలకు నిలిచి...

ఫిలాసఫీ, యోగా సబ్జెక్టుల్లో యూజీసీ-నెట్ పరీక్ష రాస్తే, అందులో అర్హత సాధించాను. 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలాసఫికల్ రీసెర్చ్' నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, జనరల్ రీసెర్చ్ ఫెలోషిప్. దాంతోపాటు యూజీసీ నుంచి పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ అందుకున్నాను. మా కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో... వేరొకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగిన ఒక మహిళగా నాలాంటివారికి ఆదర్శంగా నిలవాలనుకున్నాను. అందుకే ఎన్ని కఠిన పరీక్షలు ఎదురైనా తట్టుకొని చదువు కొనసాగించాను. ఆత్మస్థైర్యంతో అడుగులు వేసి ఇక్కడి వరకు రాగలిగాను. ప్రస్తుతం ఉత్తరాఖండ్ 'హేమవతీ నందన్ బహుగుణ గఢవాల్ సెంట్రల్ యూనివర్సిటీ' ఫిలాసఫీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నా.

ఎన్నో రచనలు...

ఒక పక్క విద్యా బోధన... మరోవైపు పుస్తక రచన చేస్తున్నా. సాహిత్య ప్రపంచంలో నాకంటూ కొన్ని పేజీలు ఉండాలనే తపన. ఇప్పటికి 27 పుస్తకాలు రాశాను. యోగిక్ స్టడీస్, సత్కర్మాస్, భారతీయ సాహిత్యం తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందులో ఉన్నాయి. అయితే నాకు బాగా పేరు తెచ్చిన రచనలు 'గీతా దర్శన్', 'భారతీయ సాహిత్య మే జీవన్ మూల్య'. వీటికి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి పురస్కారాలు,

అభిరుచి



సత్కారాలు అందుకున్నాను. యూపీలోని 'పటేల్ ప్రతినిధి సభ' వారు 'శైల్‌పుత్రి' బిరుదుతో గౌరవించారు. 2019లో మధ్యప్రదేశ్ సాహిత్య అకాడమీ 'అఖిల్ భారతీయ ఆచార్య రామచంద్ర శుక్లా' పురస్కారంతో కలిపి ఇప్పటికి ముప్పైకి పైగా అవార్డులు అందుకున్నాను. ఇవి సాహిత్యం, సంస్కృతికి అందించిన సేవలకు నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.

అక్షరంపై ప్రేమతో...

కొన్ని కారణాల వల్ల నేను తల్లిని కాలేకపోయాను. మాతృత్వపు మాధుర్యానికి నోచుకోనందుకు కొన్నాళ్లు బాధపడ్డాను. కానీ త్వరగానే దాని నుంచి కోలుకున్నాను. సాహిత్య లోకంలో విహరించడం ప్రారంభించాను. ఇప్పుడు నాకు పిల్లలు లేరన్న బాధ లేదు. ఎందుకంటే నా పుస్తకాలే నా పిల్లలు. నవ మాసాలు మోసి, బిడ్డను ప్రసవించడానికి ఎంత వేదన పడుతుందో... ఒక అంశాన్ని ఎంచుకొని, దానికి అక్షర రూపం ఇచ్చి, పుస్తకంగా బయటకు తేవడానికి నేనూ అంతగా శ్రమిస్తాను. రచనలో మునిగిపోతాను. అంతే ప్రేమతో ప్రతి పుస్తకానికీ రూపం ఇస్తాను. ఎవరైనా నా రచనలను ప్రశంసిస్తే... అది నా బిడ్డకు దక్కిన అభినందన. ఒక తల్లిగా సంతోషిస్తాను.

సమాజం కోసం...

బోధన, సాహిత్యంలో ఎంతగా మునిగినా... ఈ సమాజంలో ఒక వ్యక్తిగా నావంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాను. పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. వారానికి రెండు రోజులు దీనికి కేటాయించాను. అలాగే అణగారిన వర్గాల పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, అవసరమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నాను. మధ్యలో చదువు మానేసిన చిన్నారులను బడి బాట పట్టించేందుకు కృషి చేస్తున్నాను. ఎందుకంటే వారి జీవితాలను మార్చగలిగేది చదువు మాత్రమే. దానికి నన్నే ప్రత్యక్ష ఉదాహరణగా చూపిస్తూ, వారిలో స్ఫూర్తి నింపుతున్నాను."

ఆసరా

స్వదేశం ఫ్రాన్స్. కళపై మక్కువతో ఓ ప్రాజెక్ట్ పనిపై భారత్ వచ్చిన ఆమె... ఆ తరువాత ఇక్కడే స్థిరపడ్డారు. ఔత్సాహికులను కళాకారులుగా తీర్చిదిద్దడమే కాదు... ఎంతోమంది అఫ్ఘానిస్థాన్ మహిళా శరణార్థులకు ఉపాధి మార్గం చూపారు. భర్తతో కలిసి వారి అభ్యున్నతికి బాటలు వేసిన ఐరిస్ స్టైల్ జర్నీ ఇది.

అఫ్ఘాన్ శరణార్థుల కోసం..!





"సరిగ్గా ఏడున్నరేళ్ల కిందట... నేను, నా భర్త బిశ్వదీప్ మోయిత్రా ఢిల్లీలోని అఫ్ఘానిస్థాన్ శరణార్థుల శిబిరానికి వెళ్లాం. అక్కడ మహిళల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. చేతిలో డబ్బు లేక, సంపాదన మార్గాలు దొరక్క అవస్థలు పడుతున్నారు. ఒసామా బిన్ లాడెన్‌ను మట్టుబెట్టడం, అమెరికా తన బలగాలను ఉపసంహరించుకోవడం తదనంతర పరిణామల నేపథ్యంలో అఫ్ఘాన్ మహిళలు భారత్‌కు వలస వచ్చారు. ఢిల్లీలో వారిని కలిసినప్పుడు తమ బాధలు చెప్పుకున్నారు. బతకడానికి వేరే దారి లేక స్వదేశం నుంచి వెంట తెచ్చుకున్న తమ వస్తువులన్నిటినీ అమ్ముకోవాల్సి వచ్చింది. ఏ పూటకాపూట కష్టం నెట్టుకొస్తున్నారు. వారి బాధలు విని మా గుండె బరువెక్కింది. దీనికి పరిష్కారం ఏమిటి? ఏదో తోచిన సాయం చేసి చేతులు దులుపుకొంటే సరిపోదు. ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే వారికి మనుగడ. అందుకు మేం ఏం చేయగలం? నేను, బిశ్వదీప్ తీవ్రంగా ఆలోచించాం.

సాధికారత వైపు అడుగులు...

అఫ్ఘాన్ శరణార్థ మహిళలకు శాశ్వత జీవనోపాధి కల్పించాలంటే... వారికి వృత్తి విద్యల్లో నైపుణ్యం కావాలి. అటు వైపు వారిని ప్రోత్సహించాం. తద్వారా ఆర్థిక సాధికారత సాధించవచ్చని చెప్పాం. తొలుత ఒకరిద్దరు మహిళలు మాత్రమే మమ్మల్ని నమ్మి ముందుకు వచ్చారు. ఒక ఏడాది తరువాత మరికొంతమంది జత కలిశారు. వీరందరి అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని 2018లో నేను, మావారు కలిసి 'సిలైవాలీ' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థ నెలకొల్పాం. దీని ద్వారా క్లాత్ బొమ్మలు, పౌచ్‌లు, పర్సులు, వాల్ ఆర్ట్స్, వాల్ హ్యాంగింగ్స్ తయారు చేసి, విక్రయిస్తాం. రెడీమేడ్ దుస్తుల తయారీ పరిశ్రమల్లో వ్యర్థంగా పడేసే వస్త్రాన్ని సేకరించి, వాటితో ఈ ఉత్పత్తులు రూపొందిస్తాం.



పర్యావరణ పరిరక్షణ కూడా...

ఒకరిద్దరితో మొదలైన మా సంస్థలో ఇప్పుడు డెబ్బై మంది అఫ్ఘాన్ మహిళలు ఉన్నారు. వారందరికీ బొమ్మలు, ఇతర వస్తువుల తయారీలో పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చాం. అనంతరం సంస్థ ద్వారా జీవనోపాధి కల్పించాం. ఇప్పుడు ఆ మహిళలందరూ తమ కాళ్లపై తాము నిలబడ్డారు. సంతోషంగా జీవనం సాగించగలుగుతున్నారు. నెలకు పన్నెండు వేల నుంచి పద్నాలుగు వేల రూపాయల వరకు సంపాదిస్తున్నారు. డిమాండ్ అధికంగా ఉండే నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో మరింత ఆదాయం లభిస్తుంది. అంతేకాదు... ఇప్పటివరకు 15 వేల కేజీల ఫ్యాబ్రిక్ వేస్ట్ చెత్త కుప్పల్లో చేరి, భూమికి భారం కాకుండా చూడగలిగాం. తద్వారా పర్యావరణ పరిరక్షణకు కొంతవరకు దోహదపడగలిగాం.

అలా భారత్‌కు వచ్చి...

నాకు మొదటి నుంచి కళలంటే మక్కువ. అందుకే ఆర్ట్ అండ్ డిజైన్ డిప్లమాలో చేరాను. ఫైనల్ ఇయర్ అసైన్‌మెంట్‌లో భాగంగా 1990లో తొలిసారి భారత్‌కు వచ్చాను. ఈ దేశం నాకు ఎంతో నచ్చింది. కళపై ఉన్న ఇష్టంతో ఇక్కడి పలు స్వచ్ఛంద సంస్థలో కలిసి ఔత్సాహిక కళాకారులకు శిక్షణ ఇచ్చేదాన్ని. వారికి విభిన్న కళాకృతుల తయారీ నేర్పించేదాన్ని. అలా తరచూ భారత్‌కు వచ్చిపోతున్న నేను... 2006లో బిశ్వదీప్‌తో పెళ్లి తరువాత ఇక్కడే స్థిరపడిపోయాను. బిశ్వదీప్ ఒకప్పుడు పాత్రికేయుడు. ఒక యోగా కేంద్రంలో తనతో పరిచయం అయింది. పెళ్లి తరువాత అంతర్జాతీయ వస్త్ర బ్రాండ్లకు డిజైన్ కన్సల్టెంట్‌గా పని చేసేదాన్ని. ఆ క్రమంలోనే నా దృష్టి భారత ఫ్యాషన్ పరిశ్రమలో టన్నులకు టన్నులు పేరుకుపోతున్న ఫ్యాబ్రిక్ వేస్ట్‌పై పడింది.

వ్యర్థంతో ఆకర్షణీయ ఉత్పత్తులు...

ఎన్నో అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్లకు కేంద్రం ఢిల్లీ. ఇక్కడ రోజుకు వందల కిలోల వస్త్ర వ్యర్థాలు చెత్తకుప్పలను ముంచెత్తుతున్నాయి. ఈ వ్యర్థాన్ని పనికొచ్చే ఉత్పత్తులుగా మలిస్తే పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. అలాగే ఆర్థిక స్తోమత లేని కుటుంబాలకు అది ఒక ఉపాధి మార్గం అవుతుందని భావించాను. అందులో భాగంగానే అఫ్ఘాన్ మహిళలకు కళాకృతుల తయారీలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాను. దీనికి బిశ్వదీప్ కూడా మద్దతునిచ్చారు. పూర్తి సమయం కేటాయించాలనే ఉద్దేశంతో ఒక ప్రముఖ ఆంగ్ల వారపత్రికలో ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ఉన్న ఆయన, తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఒక మంచి లక్ష్యం కోసం ఇద్దరం కలిసి పని చేయడం ప్రారంభించాం. అందులో భాగంగానే ఫ్యాబ్రిక్ వేస్ట్‌ను అప్‌సైక్లింగ్ చేసి, కళాకృతులు రూపొందించాలని నిర్ణయించాం. అది సత్ఫలితాలను ఇచ్చింది. దానివల్ల అఫ్ఘాన్ మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. వారి జీవితానికి ఒక భరోసా లభించింది.

ప్రపంచవ్యాప్తంగా...

మా సంస్థలో అఫ్ఘాన్ కళాకారులు రూపొందించిన బొమ్మలు, అల్లికలు, ఇంటి అలంకరణ వస్తువులు దేశవిదేశాల్లోని 150 నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. శరణార్థులు తయారు చేసే బొమ్మల్లో అద్భుతమైన సృజన మాత్రమే కాదు... వారి కథలు, వ్యక్తిత్వాలకు ప్రతిరూపాలుగా కనిపిస్తాయి. భారత్‌తో పాటు అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్, కొరియా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ఈ బొమ్మలకు మంచి డిమాండ్ ఉంది. 'సిలైవాలీ' కళాకృతుల ధరలు రూ.280 నుంచి రూ.5,400 వరకు ఉన్నాయి. ఏడాదికి రెండు లక్షల డాలర్ల ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నాం. ఇప్పటివరకు మొత్తం నాలుగువందల మంది అఫ్ఘాన్ శరణార్థ మహిళలకు శిక్షణ ఇచ్చాం. వలస విధానాల వల్ల వీరిలో చాలామంది కెనడాకు వెళ్లి స్థిరపడ్డారు. ఏదిఏమైనా నేను, మావారు తీసుకున్న నిర్ణయంవల్ల వారి బతుకుల్లో వెలుగులు నింపగలిగాం. దీనికి మించిన సంతృప్తి, సంతోషం మాకు మరెందులోనూ లభించదు."

కౌన్సెలింగ్

ఆకర్షణ లోపిస్తే..?

డాక్టర్! నాదొక చిత్రమైన అనుమానం. దంపతుల మధ్య కాలక్రమేణా లైంగిక ఆకర్షణ తగ్గడం సహజం. ఇలాంటప్పుడు ఇద్దరి మధ్యా అనుబంధం బలహీనపడే ప్రమాదం ఉంటుంది కదా? అలాంటప్పుడు దంపతులను కలిపి ఉంచే అంశం ఏముంటుంది?

– ఓ సోదరి, హైదరాబాద్.

సన్నిహిత సమయాల్లో దాపరికం లేకుండా మెలగడం, ఒకరి స్పర్శనూ, దగ్గరితనాన్నీ మరొకరు మనస్ఫూర్తిగా ఆస్వాదించడం అవసరం. లైంగిక సాన్నిహిత్యం దంపతుల మధ్య దూరాలు తగ్గించాలి. అంతేతప్ప, అసౌకర్యాలకూ, ఇబ్బందులకూ, మనస్పర్థలకూ కారణం కాకూడదు. ఒత్తిడి, ఆందోళనలు సాన్నిహిత్యానికి ప్రధాన శత్రువులు. పెళ్లైన మొదట్లో శారీరక ఆకర్షణలు సహజం. కానీ కాలక్రమేణా అవి మసకబారే అవకాశాలుంటాయి. అయితే కేవలం శారీరక ఆకర్షణే దంపతుల్ని కలిపి ఉంచుతుందనుకుంటే పొరపాటు. అంతకు మించి ఒకరి ఉనికిని



మరొకరు ఆనందించడం, ఒకరి అభిప్రాయాలను వేరొకరు గౌరవించడం, సమస్యలను కలిసికట్టుగా పరిష్కరించుకోవడం, చర్చలు, సంప్రతింపులు లాంటివన్నీ దంపతులను కలిపి ఉంచుతాయి. ఎంతటి అభిప్రాయబేధాలొచ్చినా, ఎన్ని గొడవలు జరిగినా రాత్రి పడుకునే ముందు వాటి గురించి, పరిష్కరించుకుని, మనసులు తేలిక పరుచుకుని, ప్రేమగా హత్తుకుని, మునుపటి సాన్నిహిత్యాన్ని కొనసాగించాలి. దంపతుల మధ్య అహంభావాలు, పొగరు లాంటివి పనికి రావు. అలాగని అలకలు, బుజ్జగింపులు ఉండకూడదని అనడానికి వీల్లేదు. అవి కూడా ఉండి తీరాలి. అయితే అంతిమంగా చివరివరకూ జీవితాన్ని అన్యోన్యంగా కొనసాగించడమే ధ్యేయంగా నడుచుకోవాలి.

డాక్టర్ రమ,
గైనకాలజిస్ట్, హైదరాబాద్

నేడు టీచర్స్ డే

తల్లితండ్రులకు టీచర్లు ఇచ్చే సలహాలివే!

మన దేశ భవిష్యత్ తరాలను తయారు చేసేది ఉపాధ్యాయులే కాబట్టి వారికి సమాజంలో ఒక ప్రముఖమైన స్థానం ఉంటుంది. అలాంటి ఉపాధ్యాయులు పిల్లలకు సంబంధించిన తల్లితండ్రులకు ఇస్తున్న సలహాలేమిటో చూద్దాం...

- విద్య అంటే పాఠశాలల్లో చెప్పేది మాత్రమే కాదు. స్కూలు అయిపోయిన తర్వాత చదివే పుస్తకాలు.. ఇతరులతో మాట్లాడటం ద్వారా వచ్చే పరిణితి.. వీటన్నింటినీ కూడా పరిగణనలోకి తీసుకోవాలి. చాలా మంది పాఠశాలల్లో చెప్పేది మాత్రమే చదువు అనుకుంటారు. అది నిజం కాదు. స్కూలు పూర్తయిన తర్వాత నేర్చుకొనేది కూడా విద్యే. వాస్తవానికి స్కూల్లో బోధించేది కేవలం విజ్ఞానం మాత్రమే! కానీ వాస్తవ ప్రపంచంలో మనకు ఉపయోగించే విషయాలన్నీ మన చుట్టూ ఉన్న సమాజం నేర్పుతుంది.
- పిల్లల అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పనివ్వాలి. ఒక వేళ వారు తమ అభిప్రాయాలను చెప్పటానికి ఇష్టపడకపోయినా- వారి చేత చెప్పించటానికి ప్రయత్నించాలి. దీని వల్ల వారి ఆలోచనా విధానం మనకు తెలుస్తుంది.
- ప్రతి విద్యార్థికి 24 గంటలు ఉంటాయి. వాటిలో ఎనిమిది గంటలు స్కూలుకు పోయిందనుకుద్దాం. మరో ఎనిమిది గంటలు ఇతర కార్యక్రమాలకు సరిపోయిందనుకుందాం. మిగిలిన ఎనిమిది గంటలూ వారిని నిద్రపొమ్మని సలహా ఇవ్వాలి. పడుక్కొనే ముందు ఆ రోజు స్కూల్లో జరిగిన సంఘటనలను



అడిగి తెలుసుకోవాలి. మంచి నిద్ర- బుర్రలో ఉన్న ఆలోచనలన్నింటినీ ఒక క్రమపద్ధతిలో పెట్టుకుంటుంది. దీని వల్ల పిల్లలు లాజికల్‌గా ఆలోచించగలుగుతారు. ఆలోచనలలో చురుకుతనం కూడా పెరుగుతుంది. చాలా మంది పిల్లలు నిద్రను తగ్గించి- ఫోన్లను వాడటం.. టీవీలను చూడటం మొదలైన పనులు చేస్తూ ఉంటారు. దీని వల్ల వారిలో చురుకుతనం తగ్గుతుంది.
- చాలా మంది టీవీ చూడటం తప్పు అనుకుంటారు. టీవీలు పిల్లల మానసిక అభివృద్ధికి తోడ్పడతాయి. వారికి ప్రపంచంలో జరుగుతున్న అనేక విషయాల గురించి తెలియజేస్తాయి. అయితే ఈ విషయంలో పిల్లలు ఏ ఛానల్స్ చూడాలనే విషయంపై స్పష్టత ఉండాలి.
- పిల్లలతో కానీ.. పిల్లల ఎదురుగా కానీ టీచర్లను తక్కువ చేసి మాట్లాడకూడదు. దీని వల్ల పిల్లల్లో చులకన భావన ఏర్పడుతుంది. ఒక వేళ టీచర్లు ఏదైనా విషయంపై తగిన శ్రద్ధ చూపించటం లేదని భావిస్తే- వారితోనే నేరుగా మాట్లాడాలి. అంతే కాకుండా- పిల్లలతో టీచర్లకు సందేశాలు పంపకూడదు.
- పిల్లలను సరైన సమయానికి తయారుచేసి.. వారిని స్కూళ్లకు పంపాల్సిన బాధ్యత తల్లితండ్రులదే! తల్లితండ్రులలో క్రమశిక్షణ లేకపోతే- పిల్లలకు కూడా క్రమశిక్షణ ఉండదు.
- పిల్లలకు టీచర్లు ఏదైనా పనిష్మెంట్ ఇస్తే- వారికి మద్దతుగా టీచర్లతో మాట్లాడవద్దు. ఏదైనా తప్పు చేస్తే- శిక్ష అనుభవించాల్సి వస్తుందనే విషయం వారికి తెలియాలి. తమ పిల్లలకు పనిష్మెంట్ రావటాన్ని కొందరు తల్లితండ్రులు జీర్ణించుకోలేరు. ఆ పనిష్మెంట్ రావటానికి తామే కారణమని భావిస్తారు. కానీ అది నిజం కాదనే విషయాన్ని తల్లితండ్రులు గుర్తించాలి.
- ఆరోగ్యం సరిగ్గా లేకపోయినా- కొందరు తల్లితండ్రులు తమ పిల్లలను స్కూలుకు పంపుతారు. దీని వల్ల ఇతర పిల్లలకు కూడా జలుబు వంటి వ్యాధులు అంటుకోవచ్చు. అందువల్ల పిల్లలకు ఆరోగ్యం బావుండనప్పుడు- వారిని స్కూలుకు పంపకపోవటమే మంచిది.
- టీచర్లకు సంబంధించిన ఈమెయిల్స్, ఫోన్ నెంబర్లు తల్లితండ్రులు తమ వద్ద తప్పనిసరిగా ఉంచుకోవాలి. దీని వల్ల అవసరమైనప్పుడు వారితో మాట్లాడటానికి వీలుంటుంది.
- స్కూలు, కాలేజీలకు సంబంధించి పిల్లలతో పాజిటివ్‌గానే మాట్లాడాలి. అనవసరపు కామెంట్స్ చేయటం వల్ల వారిలో చెడు అభిప్రాయాలు ఏర్పడుతాయి.



వరద బాధితుల సహాయార్థం ఒక రోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించి అందుకు సంబంధించిన లేఖను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తున్న ఏపీఎన్జీవో నేతలు

ఉద్యోగుల విరాళం 120 కోట్లు

- ఒకరోజు జీతం ప్రకటించిన ఏపీ జేఏసీ, ఏపీ ఎన్జీవో నేతలు
- ఏపీ సచివాలయ సంఘం కూడా... సీఎం ధన్యవాదాలు

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరద బాధితులకు ఉద్యోగులు రూ.120కోట్ల భారీ విరాళం ప్రకటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి సెప్టెంబరు నెల జీతం నుంచి ఒకరోజు మూల వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ఏపీ జేఏసీ, ఏపీ ఎన్జీవో ప్రకటించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఒకరోజు బేసిక్ పే సుమారు రూ.120 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఏపీ జేఏసీ ఛైర్మన్, ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, సెక్రటరీ జనరల్ హృదయరాజు, ఏపీ యూటీఎఫ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, ఏపీ జేఏసీ ఎన్టీఆర్ జిల్లా ఛైర్మన్ విద్యాసాగర్, ఎన్జీవో సంఘం నాయకుడు జగదీశ్, రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రభుదాస్, పీఏవో ఉద్యోగుల అధ్యక్షుడు హరినాథ్‌బాబు, గ్రామ సచివాలయ సంఘం అధ్యక్షుడు జానీ బాషా, ఇతర సంఘాల నేతలు సీఎం చంద్రబాబును కలిసి అంగీకార పత్రాన్ని అందజేశారు. అలాగే ఏపీ సచివాలయ సంఘం నాయకులు సీఎంను కలిసి ఒకరోజు మూల వేతనాన్ని సీఎంఆర్ఎఫ్‌కు విరాళంగా అందజేశారు. పెద్దఎత్తున విరాళాలు అందించిన దాతలకు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఇక, రిత్విక్ ప్రాజెక్ట్స్ తరఫున రూ.కోటి విరాళాన్ని అందించనున్నట్లు బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ప్రకటించారు. భారత్ బయోటెక్ సంస్థ రూ.కోటి విరాళాన్ని అందజేసింది. బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ బలుసు శ్రీనివాసరావు రూ.కోటి, సినీ నిర్మాత అశ్వనీదత్ రూ.25లక్షలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఏపీ) రూ.25లక్షలు, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.25లక్షలు, కాకతీయ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ రూ.25లక్షలు, ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ రీడింగ్ కమిటీ రూ.25లక్షలు, చుక్కపల్లి రమేష్ రూ.25లక్షలు, ఏపీ పౌల్ట్రీ అసోసియేషన్ రూ.25లక్షలు, గుంటూరు క్లబ్ రూ.10లక్షలు, తెనాలి డబుల్ హార్స్ రూ.10లక్షలు, ఐఏఎస్ ఆఫీసర్స్ వైవ్స్ అసోసియేషన్ రూ.5లక్షలు, సిద్ధార్థ వాకర్స్ క్లబ్ (విజయవాడ) రూ.5లక్షలు, టీడీపీ మహిళా నేత రాయపాటి శైలజ (గుంటూరు) రూ.5లక్షలు, చిలకమర్రి శ్రీనివాసాచార్యులు రూ.లక్షన్నరతో పాటు పలువురు రూ.లక్ష చొప్పున విరాళం అందించారు. మంత్రి సవిత కుమారుడు జగదీశ్ సాయి తన కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న రూ.21వేలు విరాళంగా అందించారు. గుంటూరు లోటస్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు రూ.10 లక్షలు, ఏలూరుకు చెందిన ఎన్ఆర్ఐ వినయ్‌కుమార్, గోళ్లమూడికి చెందిన పవన్‌కుమార్ రూ.10లక్షలు చొప్పున, సిటీకేబుల్ ఎండీ సాయి రూ.5లక్షలు విజయవాడలో మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అకౌంట్ల వివరాలు

వరద బాధితుల సహాయార్థం విరాళాలు ఇచ్చే దాతల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన అకౌంట్ నంబర్లను ప్రభుత్వం ప్రకటించింది. సీఎంఆర్ఎఫ్ ఖాతాకు సంబంధించిన వ్యక్తిగత విరాళాలను ఆన్‌లైన్ పేమెంట్‌గా ఏపీ సెక్రటరేట్‌లోని ఎస్‌బీఐ అకౌంట్ నం.38588079208, యూబీఐ అకౌంట్ నం.110310100029039 కు పంపాల్సి ఉంటుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కింద ఇచ్చే విరాళాలను విజయవాడ మహాత్మాగాంధీ రోడ్‌లోని ఎస్‌బీఐ అకౌంట్ నం00000036897128069కు పంపాలి. క్యూఆర్ కోడ్ ద్వారా యూపీఐ పేమెంట్స్‌ను యూపీఐ ఐడీ 68893701@యూబీఐఎన్, యూపీఐ ఐడీ.. ఏపీసీఎంరిలీఫ్@ఎఎస్‌డీబీకు పంపాలని అధికారులు సూచించారు.

మాజీ సీజేఐ ఎన్వీ రమణ రూ.10లక్షల విరాళం



ఢిల్లీలో అధికారులకు చెక్కు అందజేస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితుల సహాయార్థం సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ విరాళం అందజేశారు. ఆయా రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కి చెరో రూ.10 లక్షల చొప్పున ప్రకటించారు. చెక్‌లను తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఏపీ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్‌కు.. జస్టిస్ ఎన్వీ రమణ బుధవారం ఇక్కడ తన నివాసంలో అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కి ఆర్థిక సహాయాన్ని అందించినందుకు రెండు రాష్ట్రాల అధికారులు జస్టిస్ ఎన్వీ రమణకు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్న పాప.. పెద్దమనసు!

అమలాపురం టౌన్, సెప్టెంబరు 4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన దస్తావేజు లేఖరి మట్టపర్తి శ్రీరాములు కుమార్తె లక్ష్మీ కార్తీక సౌందర్య(8) నవంబరు 1న జన్మించింది. ఆమె తండ్రి ఏటా కొంత మొత్తం దాచి చిన్నారి పుట్టినరోజున అన్నదానం, వస్త్రదానం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సౌందర్య ఈ ఏడాది తన పుట్టినరోజు కోసం దాచిన డబ్బును వరద బాధితులకు ఇవ్వాలని కోరింది. ఈ మేరకు శ్రీరాములు బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.28 వేల చెక్కును కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్‌కు అందించారు. బాలికను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

పరదాల మాటున తిరిగేవారికి ప్రజల కష్టాలెలా తెలుస్తాయి!: సోమిరెడ్డి

నెల్లూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పరదాల మాటున తిరిగే జగన్‌కు ప్రజల కష్టాలు ఎలా తెలుస్తాయని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కష్టకాలంలో సీఎం చంద్రబాబు ప్రజల మధ్యన ఉండడాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. వరదలు వచ్చిన మూడు రోజులకు చంద్రబాబు జనంలోకి వచ్చారంటూ అబద్ధాలు చెప్పడానికి వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సిగ్గుండా అని ధ్వజమెత్తారు.

కేంద్రం ఆదుకోవాలి: వ్యవసాయ కార్మిక సంఘం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): 'భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రెండు తెలుగు రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలి. తక్షణ వరద సహాయం అందించాలి' అని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. బుధవారం, తెలంగాణ భవన్‌లో సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడారు. 'విపత్తు నిర్వహణ నిధులు రూ.వేల కోట్లున్నా వరద సాయం చేయడంలో కేంద్రం అలసత్వం వహిస్తోంది. కేంద్ర బృందాలను వెంటనే తెలుగు రాష్ట్రాలకు పంపి నష్టం అంచనా వేయాలి' అని వెంకట్ కోరారు.

'ప్రజావేదిక' మూడు రోజులు రద్దు

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరగాల్సిన ప్రజావేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎమ్మెల్సీ అశోక్‌బాబు తెలిపారు. సీఎం, మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ వరద సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నందున ఈ మూడు రోజులు గ్రీవెన్స్ ఉండదని పేర్కొన్నారు.

జంతు కళేబరాలను తక్షణమే తొలగించాలి: అచ్చెన్న

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరదలతో కొట్టుకొచ్చిన జంతువుల కళేబరాలను తక్షణమే తొలగించాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. జనవాసాల మధ్య నుంచి వాటి అవశేషాలను తొలగించి, ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ పిచికారీ చేయాలన్నారు. బుధవారం విజయవాడ చిట్టినగర్‌లో వరద ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి బుడమేరు ముంపు బాధితులను పరామర్శించారు.



వరద ప్రభావానికి గురైన ఒక మందుల దుకాణంలో పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

బాధితుల్ని దోచుకోవాలని చూస్తే అరెస్టు చేసి లోపల పడేస్తాం

- ప్రైవేట్ బోట్లకు అనుమతి లేదు: బాబు

విజయవాడ నగరంలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో రెండు రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు అంచనా వేశారు. ప్రజల ఇబ్బందులను ఆసరా చేసుకొని వారిని ఎవరైనా దోచుకోవాలని చూస్తే అరెస్టు చేయిస్తామని ఆయన హెచ్చరించారు. "ప్రైవేటు బోట్లు వరద ప్రాంతాల్లో తిరగడానికి అనుమతి లేదు. వాటిని ప్రభుత్వానికి ఇస్తే వారికి మేమే రోజుకు ఇంత అని చెల్లిస్తాం. ఎవరైనా ఇష్టం వచ్చినట్టు డబ్బులు డిమాండ్ చేస్తే పోలీసులకు చెప్పండి. కూరగాయల ధరలు పెరగకుండా ప్రభుత్వం తరఫున మేమే అమ్మించాలని నిర్ణయించాం" అని అన్నారు. "పారిశుధ్య సమస్యల వల్ల జ్వరాలు వంటివి వ్యాపించే ప్రమాదం ఉంది. అందుకే 62 శిబిరాలు ఏర్పాటయ్యాయి. కాల్వలు, రోడ్లు త్వరగా శుభ్రం చేయడానికి రెండు వేల మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేస్తున్నాం. ఇళ్లలో పేరుకుపోయిన బురదను తొలగించేందుకు 150 ఫైర్ ఇంజన్లు ఏర్పాటు చేస్తాం. మంచినీటి కోసం 182 ట్యాంకర్లు ఉంచాం. వరద తగ్గిన చోట బుధవారం సాయంత్రం నుంచి కరెంటు ఇస్తాం" అని చంద్రబాబు తెలిపారు.

"ఒక వ్యక్తి చేష్టలకు విజయవాడ నగరం మొత్తం గజగజ వణకాల్సివచ్చింది. బుడమేరుకు వచ్చిన వరదలో కొంత భాగం పోలవరం కుడి కాల్వ ద్వారా కృష్ణా నదిలోకి వెళ్లాలి. పోలవరం కాల్వ గట్లకు ఉన్న మట్టిని కూడా ఈ పెద్ద మనుషులు తవ్వుకొని అమ్ముకొన్నారు. కట్టలను తవ్వి మట్టి అమ్ముకొంటే కాల్వలు నిలుస్తాయా? వరదల సమయంలో తట్టుకొంటాయా? ఈ పని చేసిన దుర్మార్గులను వదిలిపెట్టం. మట్టిని తవ్వుకొన్నవారిని గుర్తించి చట్టం ముందు నిలబెడతాం"
- సీఎం చంద్రబాబు

జగన్ చేష్టలతోనే ఇంతటి విపత్తు

సొంత పేపర్లో బుద్ధిలేని రాతలు.. నాడే బుడమేరు గండ్లు పూడిస్తే సమస్య వచ్చేది కాదు

- ఐదేళ్లూ నిద్రపోయి ఇప్పుడు మాపై విమర్శలా?
- బురదలో మేం పనిచేస్తుంటే... ఒడ్డున ఉండి రాళ్లేస్తారా?: సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ చేష్టల వల్లే విజయవాడ నగరం ఇప్పుడు ఇంత విపత్తు ఎదుర్కొంటోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. బుడమేరుకు పడిన గండ్లను చూసి వదిలేయకుండా గత వైసీపీ ప్రభుత్వం పూడ్చి ఉండి ఉంటే విజయవాడలో ఇప్పుడు ఇంత ముంపు ఉండేది కాదని, అప్పుడు పడుకొని నిద్రపోయి ఇప్పుడు లేచివచ్చి రాళ్లు విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పత్రికలో బుద్ధిలేని రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. బుధవారం విజయవాడ కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "మారుమూలన ఉన్న ఆఖరి వ్యక్తికి కూడా సాయం అందాలని మేం నిద్రాహారాలు మాని తిప్పలు పడుతున్నాం. సీఎస్ సహా ఉన్నతాధికారులంతా బురదలో దిగి పనిచేస్తున్నారు. వీళ్లు మాత్రం ప్రజలను రెచ్చగొట్టడానికి సమస్త మార్గాలు వెతుకుతున్నారు. సొంత పత్రికలో జగన్ అడ్డగోలుగా రాయిస్తున్నారు. ప్రజలు మీకు అధికారం ఇచ్చినప్పుడు ఏం చేశారు? గాడిదలు కాశారా? మేంవచ్చి కేవలం 80రోజులైంది. బుడమేరుకు ఎప్పుడో గండ్లు పడి ఉన్నా పట్టించుకోలేదు. అడ్డగోలుగా కట్టలను ఆక్రమించేశారు. ప్లాట్లు చేసి అమ్ముకొన్నారు. మేం పడుతున్న కష్టాన్ని ప్రజలంతా గుర్తిస్తున్నారు. ఒకరిద్దరు దుర్మార్గులు మాత్రమే ఇష్టానుసారం మాట్లాడుతున్నారు" అని చంద్రబాబు మండిపడ్డారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

అమరావతిలోకి చుక్కనీరు రాలేదు

"అధికారంలో ఉండి తప్పులు చేసిన వారు మౌనంగా ఉంటే అదొక పద్ధతి. కానీ ఎదురుదాడికి దిగితే సహించబోం. అహంభావం ప్రదర్శిస్తే ఏం చేయాలో అది చేస్తాం. ఒక వ్యక్తి అసమర్థతకు ఇన్ని లక్షలమంది బాధపడాల్సి రావడం దారుణం. చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి ఈ రాక్షస మూక నానారకాల ప్రచారాలతో ప్రజలను ఆందోళనకు గురిచేయాలని చూస్తోంది. నా ఇల్లు కాపాడుకోవడానికి బుడమేరు గేట్లు ఎత్తానని మాట్లాడుతున్నారు. నా ఇల్లు ఎక్కడ ఉంది? బుడమేరు ఎక్కడ ఉంది? ఏమిటీ పైశాచిక ఆనందం? దీనిపై క్షమాపణ చెప్పేవరకూ వదిలిపెట్టను. అమరావతిలోకి చుక్క నీరు రాలేదు. వస్తే ఫొటోలు చూపించండి. కరకట్ట పక్కన అందరి ఇళ్లలోకి నీళ్లు వస్తే నా ఇంట్లోకి కూడా వస్తాయి. అదేమీ నా సొంత ఇల్లు కాదు. అద్దె ఇల్లు. నాకేమీ ప్యాలెస్‌లు లేవు. నేను నా ఇంటి విషయం వదిలేసి ప్రజల విషయం చూసుకొంటున్నాను. ఇక్కడ ఏడు లక్షల మందికి మేం సర్వీసు చేస్తున్నాం. అమరావతి ప్రాంతాన్ని శ్మశానం అంటూ శాపనార్థాలు పెట్టారు. ఆ శ్మశానంలోనే వీరిని పూడ్చాలి. ఈ తరహా ప్రచారాలు చేసే రాక్షసులను సంఘ బహిష్కరణ చేయాలి. మేం ప్రజల కోసం పనిచేయాలో లేక వీరి ప్రచారాలు తిప్పికొడుతూ కూర్చోవాలో అర్థం కావడం లేదు"

"కృష్ణా వరదల కన్నా బుడమేరు వరదల వల్లే విజయవాడ నగరానికి ఎక్కువ నష్టం వాటిల్లింది. బుడమేరు...విజయవాడకు పెద్ద సమస్య. అక్కడ 11వేల క్యూసెక్కులు వెళ్లడానికి అవకాశం ఉంది. కానీ ఇప్పుడు 70 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రవాహ మార్గం కూడా ఆక్రమణలతో కుంచించుకొని పోయింది" అని చంద్రబాబు వివరించారు.



వరద ప్రభావ ప్రాంతంలో లోకేశ్, నిమ్మల పర్యటన

బుడమేరు గండ్ల వద్దకు లోకేశ్..

- తిరిగి వర్షాలతో అధికారుల్లో టెన్షన్

ఎన్టీఆర్ జిల్లా, ఖమ్మం జిల్లాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షం ప్రభుత్వ వర్గాల్లో ఆందోళన కలిగించింది. బుడమేరుకు మళ్లీ వరద వచ్చి విజయవాడ మరోసారి ముంపునకు గురవుతుందేమోనని కలవరం చెందాయి. దీనిపై వివిధ ప్రభుత్వ శాఖలను సీఎంవో సంప్రదించింది. స్థానికంగా ఉన్న వాగుల్లో ఎంత ప్రవాహం వస్తుందో ముందుగా అంచనావేసే వ్యవస్థ లేదు. దీంతో పడిన వర్షాన్ని బట్టి లెక్కలు వేసే ప్రయత్నం చేశారు. అలా బుడమేరు వాగుకు 5వేల క్యూసెక్కుల వరద రావచ్చునని అధికార వర్గాలు లెక్కగట్టాయి. బుడమేరుకు పడిన గండ్లను పూడ్చే పని ఇంకా పూర్తి కాలేదు. దీంతో కొత్తగా వస్తున్న వరద మరోసారి విజయవాడ నగరంలోకి వస్తుందేమోనని ఆందోళన చెందిన ముఖ్యమంత్రి... వాటిని పూడ్చడంపై తక్షణం దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. ఈ పనిని రెండు రోజుల క్రితమే మంత్రి నిమ్మల రామానాయుడుకు అప్పగించారు. తన కుమారుడు లోకేశ్‌ను బుధవారం పూర్తిగా ఇదే పనిపై ఉండాలని చంద్రబాబు చెప్పారు. దీనితో నిమ్మలను తీసుకొని లోకేశ్ బుధవారం ఉదయం బుడమేరు గండ్ల వద్దకు వెళ్లారు. అప్పటికి ఒక గండి పూడ్చడం పూర్తయింది. మరో రెండు పూడ్చాల్సి ఉంది. అవి త్వరగా పూర్తి కావడానికి ఏం చేయాలో అక్కడే అధికారులతో లోకేశ్ మాట్లాడారు. తర్వాత ఒక డ్రోన్ కెమెరాను అక్కడ పెట్టి తిరిగి వచ్చారు. విజయవాడ కలెక్టరేట్‌లో ఉండి గంటకు ఒకసారి డ్రోన్ కెమెరాతో పని ప్రగతిని ఆయన పరిశీలిస్తూ వచ్చారు.

అందరినీ ఆదుకునేలా!

వాహనాలకు 12 రోజుల్లో బీమా పరిహారం



- వ్యాపారులు కోలుకోవడానికి ప్రత్యేక ప్యాకేజీ

అమరావతి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): బీమా కవరేజీ ఉండి వరదల్లో ముంపునకు గురైన వాహనాలకు పది లేదా పన్నెండు రోజుల్లో పరిహారం అందేలా చూస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. బుధవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఈ రోజు బ్యాంకర్లు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడాం. బీమా పరిహారం పది రోజుల్లో ఇవ్వాలని కోరాం. మహా అయితే ఇంకో రెండు రోజులు దాటనివ్వవద్దని చెప్పాం. వాళ్లు ఇందుకు అంగీకరించారు. బీమా కవరేజీ లేని వాహనాలకు ఏం చేయాలో ఆలోచిస్తున్నాం. వరదల్లో వ్యాపారాలు నష్టపోయిన వారి బ్యాంకు రుణాలపై బ్యాంకు అధికారులతో మాట్లాడాం. వారి కోసం ఒక ప్యాకేజీ రూపొందించాలని భావిస్తున్నాం. వ్యాపార సంఘాలతో కూడా మాట్లాడి వారి ఆలోచనలు కూడా తెలుసుకుంటాం. సొంత పెట్టుబడితో చిన్న వ్యాపారాలు చేస్తూ నష్టపోయిన వారూ ఉన్నారు. వారి గురించి కూడా ఆలోచిస్తున్నాం. ఇళ్లలో ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇంటి సామాన్లు బాగా దెబ్బతిన్నాయి. ఆ కుటుంబాలను ఎలా ఆదుకోవాలో కూడా చర్చిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. వరద తగ్గిన చోట బాధితులకు గురువారం నుంచి ఇంటికి పాతిక కిలోల బియ్యం, కిలో పప్పు, చక్కెర, ఒక లీటర్ పామాయిల్, రెండు కిలోలు బంగాళాదుంపలు, ఉల్లిపాయలు ఇస్తామని, అందరికీ ఈ సాయం ఇస్తామని ఆయన తెలిపారు.

విరివిగా సాయం చేయండి

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.వెయ్యికి లోపు విరాళం ఇచ్చిన వారు పదిహేను వందల మంది ఉన్నారని చంద్రబాబు తెలిపారు. ప్రతివారూ తోచినంత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దూర ప్రాంతాల నుంచి అనేక మంది ఆహారం వండుకొని తీసుకు వస్తున్నారని, అది పాడైపోతోందని తెలిపారు. అలా అలా వండుకొని తేవద్దని ఆయన కోరారు. నిల్వ ఉండే ఆహార పదార్థాలు తేవాలని లేదా ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు ఇవ్వాలని సూచించారు. కూరగాయలను మూడు రకాలుగా వర్గీకరించి రూ.రెండు, ఐదు, పది రూపాయలకు ప్రభుత్వం తరఫున విక్రయిస్తామని తెలిపారు. దొంగతనాలు జరగకుండా గస్తీ పెంచుతామని చెప్పారు.

వైరల్ జ్వరాల వరద..!

- వరద తగ్గక ముందే విజృంభిస్తున్న వ్యాధులు



రామకృష్ణా నగర్‌లో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికులు

విజయవాడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా విజయవాడ నగరం ముంపులోనే ఉంది. బుధవారం వరద కాస్త తగ్గుముఖం పట్టడంతో జనం బయటకు వస్తున్నారు. అయితే ఈ నాలుగు రోజులూ వరద నీటితో సహజీవనం చేసిన వారిని ఇప్పుడు వైరల్ జ్వరాలు చుట్టుముడుతున్నాయి. జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు, ఆస్తమా, బీపీ షుగర్... బుడమేరు వరద బాధితులను ఎవరిని పలకరించినా ఇవే సమస్యలు. వాస్తవాని వరద తగ్గిన తర్వాత వ్యాధులు ప్రబలుతాయనే ఉద్దేశంతో అధికార యంత్రాంగం శానిటేషన్‌పై యుద్ధ ప్రాతిపదికన యాక్షన్ ప్లాన్‌కు సిద్ధమైంది. కానీ.. ఈ అంచనాలను తలకిందులు చేస్తూ వరద పూర్తిగా తగ్గకముందే జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో బాధితులు వైద్య శిబిరాలకు క్యూ కడుతున్నారు. కొన్నిచోట్ల అంబులెన్స్‌ల్లో కూడా మందులు అందిస్తుండడంతో కొందరు అక్కడ తీసుకుంటున్నారు. స్వచ్ఛంద సంస్థలు ఒకటి, రెండు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినా వాటి దగ్గర పరిమిత సంఖ్యలోనే మందులు ఉన్నాయి. ముఖ్యంగా డోలో-650 లేకపోవడంతో బాధితులు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

తిండి, నీరు లేక నీరసించిన బాధితులు..

బుధవారం వరద కాస్త తగ్గుముఖం పట్టడంతో పైపులరోడ్డు, ప్రకాష్‌నగర్, వాంబే కాలనీ వంటి దూర ప్రాంతాల నుంచి బాధితులు పెద్ద సంఖ్యలో బయటకు వచ్చారు. ప్రకాష్ నగర్ నుంచి దాదాపు 10 కిలోమీటర్ల మేర నడుములోతు వరదను దాటుకుంటూ వస్తున్నారు. మూడు రోజులుగా సరైన ఆహారం, నీరు లేక వారంతా నీరసించిపోయారు. దాదాపు 4 నుంచి 10 కిలోమీటర్లు నడిచి రావడం, తీవ్ర నీరసానికి గురి కావడం వల్ల చాలామంది సొమ్మసిల్లి పడిపోయారు. అంబులెన్స్‌లను తగిన సంఖ్యలో సిద్ధం చేయటం వల్ల ఎప్పటికప్పుడు ఇలాంటి వారిని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించగలుగుతున్నారు. గురువారం మరింత మంది బయటకు వచ్చే అవకాశం ఉండడంతో అంబులెన్స్‌లను పెంచితే సౌకర్యంగా ఉంటుంది. అలాగే ఎనర్జీ డ్రింక్స్ అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

కిటకిటలాడుతున్న ప్రభుత్వ ఆస్పత్రి

బయటకు వస్తున్న బాధితుల్లో ఎక్కువ మంది వైరల్ జ్వరాలతోనే బాధపడుతున్నారు. పెద్ద వాళ్ల కంటే చిన్న పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువ వల్ల చిన్నారులు ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు. పెద్ద వాళ్లు నీరసం, ఒళ్లు నొప్పులు, బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధ పడుతున్నారు. గుండె జబ్బులు, కాలేయ, కిడ్నీ సమస్యలు, కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారిని బయటకు రాగానే పెద్ద ఆస్పత్రులకు తరలిస్తున్నారు. కొందరు సాధారణ జ్వరాలకు మందులు తీసుకున్నప్పటికీ అవి తీవ్రరూపం దాల్చుతాయేమోనన్న అనుమానంతో ప్రభుత్వ ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డు వరద బాధితులతో కిటకిటలాడుతోంది. ఈ వైరల్ జ్వరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజారోగ్య శాఖ అధికారులు దృష్టి సారించాలి. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఎకష్టాలు.. కన్నీళ్లో కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ సృజన ఉదయాన్నే సింగ్‌నగర్ ఫ్లైఓవర్ మీద అపరిశుభ్రంగా ఉన్న ఆహార వ్యర్థాలను శుభ్రం చేయించారు. కాగా, పారిశుధ్య చర్యలు చేపడితే వ్యాధులు ప్రబలకుండా అడ్డుకోవచ్చు.

వ్యాధులు విజృంభిస్తాయ్ జాగ్రత్త..!

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాలు ఇప్పుడు డేంజర్ జోన్‌లో ఉన్నాయి. వరద తగ్గిన తర్వాత వచ్చే సంక్రమిత వ్యాధుల వల్ల ఎక్కువ ప్రమాదం జరిగే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీన్ని నివారించాలంటే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. నాలుగైదు రోజుల పాటు శరీరానికి సరిపడా నీరు, సరైన ఆహారం లేకపోవడం వల్ల డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంది. బాగా నీరసంగా ఉండడం, ఎండలోకి వెళ్తే కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు కనిపించినా భయపడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ కాచిచల్లార్చిన నీరు తాగాలని వైద్యులు సూచించారు. రోజుకి విడతలవారీగా 4 నుంచి 5 లీటర్ల వరకూ నీరు తీసుకోవాలన్నారు. మరోవైపు ఇంట్లో వండుకున్న ఆహారాన్ని వేడిగా ఉన్నప్పుడే తినేయాలని, చెప్పారు. నిల్వ ఉన్న ఆహారం తీసుకుంటే మరిన్ని వ్యాధులు సంక్రమిస్తాయని హెచ్చరించారు.

పరిశుభ్రత ముఖ్యం..

వరద నీరు తగ్గినప్పటికీ ఇంటి బయట గుంతలు, ఇతర ప్రదేశాల్లో నిల్వ నీరు ఉంచకుండా చూసుకోవాలి. ఇళ్లంతా శుభ్రం చేసుకోవాలి. నీటి నిల్వలు ఉంటే వాటిల్లో దోమలు, ఈగలు చేరి వ్యాధులు మరింతగా పెరుగుతాయి. ఇంటి మొత్తాన్ని క్లోరినేషన్ చేసుకోవాలి. ఇంటి చుట్టు పక్కల బ్లీచింగ్ చేస్తే చాలా వరకూ వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. లేదంటే దోమల వల్ల సంక్రమించే మలేరియా, డెంగీ వంటి రోగాలు ప్రబలుతాయి. ఇళ్ల ముందున్న డ్రైనేజీని కూడా వెంటనే శుభ్రం చేసుకోవాలి. ప్రభుత్వం క్లీనింగ్ కార్యక్రమాలు చేపట్టినా ఎవరికి వారు స్వయంగా ఇళ్ల వద్ద పరిశుభ్రంగా ఉండేలా చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా సెప్టిక్ ట్యాంక్‌లు మొత్తం నిండిపోయి ఉంటాయని, ఇవి అత్యంత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వీలైనంత త్వరగా వాటిని క్లీన్ చేయించుకోవాలని చెబుతున్నారు.



సింగ్ నగర్‌లో ట్రాక్టర్‌పై పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

కొంప కొల్లేరైంది... బెజవాడ బుడమేరైంది

- జాతీయ విపత్తుగా ప్రకటించండి
- ప్రధాని మోదీకి ఏపీసీసీ చీఫ్ విజ్ఞప్తి
- చంద్రబాబు సహాయక చర్యలు బాగున్నా... క్షేత్ర స్థాయికి చేరడం లేదు: వైఎస్ షర్మిల

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): 'ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు కొంప కొల్లేరైంది. బెజవాడ బుడమేరైంది' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కడప నుంచి విజయవాడ వచ్చిన ఆమె సింగ్‌నగర్ ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులను పరామర్శించారు. మీడియాతో మాట్లాడారు. 'వరదలతో బెజవాడ వాసులకు భారీ నష్టం జరిగింది. పలువురు ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది నష్టపోయారు. జరిగిన అపార నష్టాన్ని కేంద్రం గుర్తించాలి. జాతీయ విపత్తుగా ప్రకటించి, ఉదారంగా సాయం అందించాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేస్తున్నా. దెబ్బతిన్న ప్రతి ఇంటికీ రూ.లక్ష, వస్తువులు కోల్పోయినవారికి రూ.50,000 కనిష్ఠంగా చెల్లించాలి. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25,000 చెల్లించాలి. సీఎం చంద్రబాబు చేపట్టిన సహాయక చర్యలు బాగున్నాయి. కాని అవి క్షేత్రస్థాయికి చేరడం లేదు. ఆక్రమణల కారణంగా బుడమేరు మూసుకుపోయింది. తెలంగాణ హైడ్రా మాదిరి రాష్ట్రంలోనూ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి' అని షర్మిల డిమాండ్ చేశారు. కాగా, ప్రకాశం బ్యారేజీలోకి కావాలనే ఎవరో పడవలు వదిలారని వైఎస్ షర్మిల ఆరోపించారు. బ్యారేజీ వద్ద కృష్ణమ్మ వరద ఉధృతిని పరిశీలించారు. 'పడవలను కావాలనే వదిలినట్లుగా అనిపిస్తోంది. ఈ కుట్ర ప్రణాళిక సామాన్యమైనది కాదు. దీనికి బాధ్యులను గుర్తించాలి. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. జగన్ హయాంలో బ్యారేజీలు, ప్రాజెక్టులకు నిర్వహణ లేదు' అని ఆక్షేపించారు.

నేడు రాష్ట్రానికి కేంద్ర బృందం

- వరద ప్రభావిత జిల్లాల్లో పర్యటన

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టం అంచనా వేసేందుకు కేంద్ర బృందం గురువారం రాష్ట్రానికి రానుంది. కేంద్ర హోంశాఖ(డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అదనపు కార్యదర్శి సంజీవ్‌కుమార్ జిందాల్ నేతృత్వంలోని సభ్యులు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు తదితర వరద ప్రభావిత జిల్లాల్లో పర్యటించనుంది. వరద నష్టాన్ని అంచనా వేయడంతోపాటు బాధితులతో సభ్యులు స్వయంగా మాట్లాడనున్నారు. ఈ బృందంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సలహాదారు కల్నల్ కేపీ సింగ్ ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లే మార్గం లేక పాస్టర్ మృతి

- 12 గంటలపాటు ఇంట్లోనే మృతదేహం
- సీఎం దృష్టికి వెళ్లడంతో ఎట్టకేలకు ట్రాక్టర్ ఏర్పాటు

విజయవాడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బుడమేరు వరద ముంపులో చిక్కుకుపోయిన ఓ పాస్టర్ అనారోగ్యంపాలై, ఆస్పత్రికి వెళ్లే మార్గం లేక ప్రాణం కోల్పోయారు. అంత్యక్రియలకు శ్మశానానికి తరలించేందుకూ మార్గం లేక బంధువులు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా అధికారులు స్పందించలేదు. దీంతో 12 గంటలపాటు మృతదేహం ఇంటిలోనే ఉండిపోయింది. చివరికి విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో ఎట్టకేలకు అధికారులు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. విజయవాడలోని వాంబేకాలనీ ఎఫ్ జీ బ్లాక్‌లో పాస్టర్ రాజు కుటుంబం నివసిస్తోంది. ఆదివారం బుడమేరు వరద ముంచెత్తడంతో ఆ ప్రాంతవాసులు ఇళ్ల నుంచి బయటికి వచ్చే మార్గం లేకుండా పోయింది. ఈనేపథ్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న రాజును ఆస్పత్రికి తరలించేందుకూ మార్గం లేక ఇంట్లోనే ఉంచేశారు. మంగళవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఆ ప్రాంతంలోని శ్మశాన వాటికలూ వరదలో చిక్కుకుపోవడంతో వేరే శ్మశానవాటికకు తీసుకెళ్లి ఖననం చేయాలని నిర్ణయించారు. రాజు కుటుంబ సభ్యులు స్థానిక రాజకీయ నేతలకు, అధికారులకు ఫోన్లు చేశారు. ఆయన చనిపోయి 12 గంటలు దాటినా అధికారులు బోటు గానీ, ట్రాక్టర్ గానీ పంపలేదు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సీఎం మాట్లాడుతుండగా విలేకర్లు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత అధికారులు ట్రాక్టర్‌ను పంపారు.

వరద సహాయక చర్యల్లో ముమ్మరంగా టీడీపీ శ్రేణులు

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ వెల్లడి



అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయవాడలో వరద బాధితులకు సేవలందించేందుకు 1800 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు, నేతలు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలకు విజయవాడలోని వేర్వేరు చోట్ల సహాయక కార్యక్రమాలను అప్పగించామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం ఇస్తున్న ఆదేశాలకు, మంత్రి నారా లోకేశ్ ఇస్తున్న మార్గదర్శకాలకు అనుగుణంగా వీరంతా పనిచేస్తున్నారన్నారు. విజయవాడ సెంట్రల్, ఈస్ట్, వెస్ట్, గన్నవరం నియోజకవర్గాల్లోని 36 వార్డులు, మండలాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు అప్పగించిన బాధ్యతలను వీరు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. 9 మ్యాప్డ్ వలంటీర్ బృందాలు 409 మంది కార్యకర్తలతో పనిచేస్తున్నాయని, 36 మంది ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల నేతృత్వంలో 36 బృందాలుగా 1,112 మంది క్షేత్రస్థాయి సహాయ కార్యక్రమాల్లో సేవలందిస్తున్నారని, 11 మంది మంత్రుల నేతృత్వంలో 240 మంది కార్యకర్తలు పనిచేస్తున్నారని వివరించారు.


విజయవాడ పాయకాపురంలో ఇది పరిస్థితి

సాయం ముమ్మరం

- సీఎం చంద్రబాబు అనుభవం పనికొచ్చింది
- గత ప్రభుత్వ నిర్లక్ష్యమే ముంపునకు కారణం
- వైసీపీ ఉన్మాద వ్యాఖ్యలు సరికాదు: పవన్

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విపత్తు పరిస్థితుల్లోనూ సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పంచాయతీరాజ్ కమిషనరేట్ కార్యాలయంలో వరద బాధితుల సహాయార్థం బుధవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో పవన్ మాట్లాడారు. సీఎం చంద్రబాబు పరిపాలన అనుభవం ఇప్పుడు బాగా పనిచేస్తోందని తెలిపారు. గతంలో హుద్‌హుద్ సమయంలోనూ ఆయన రాత్రి, పగలు తేడాలేకుండా పనిచేశారని గుర్తుచేశారు. చంద్రబాబు ఈ వయసులో కూడా బుల్డోజర్లు ఎక్కి మరీ సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని కొనియాడారు. అప్పట్లోనూ తాను రూ.50లక్షల విరాళం ఇచ్చానని, ఇప్పుడు కూడా రూ.కోటి వ్యక్తిగతంగా విరాళం ప్రకటించినట్లు పేర్కొన్నారు. దానికి సంబంధించిన చెక్కును ముఖ్యమంత్రికి గురువారం అందిస్తానని చెప్పారు. బుడమేరు కారణంగా విజయవాడలోని ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. బుడమేరు 90శాతం ఆక్రమణలకు గురైందని, అదే విజయవాడకు శాపంగా మారిందని చెప్పారు. వైసీపీ నేతలు ఉన్మాద విమర్శలు చేయడం కాకుండా బాధితులకు సాయం చేసేందుకు ముందుకు రావాలని పవన్ పిలుపునిచ్చారు. తాను రెండు, మూడు రోజులు బయటకు రాకపోతే సహాయక చర్యల్లో కనిపించడం లేదని విమర్శలు చేస్తున్నారని, తాను వెళ్తే సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుందని చెప్పారు. ఇంకా ఎవరైనా విమర్శించే వారుంటే తనతో పాటు బయటకు రావాలని సూచించారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అభయ హస్తం ఇచ్చిందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం మునిగిపోయే ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, అక్కడ ఇళ్లు నిర్మించుకున్న వారు ముంపునకు గురయ్యారని తెలిపారు. రిమోట్ సెన్సింగ్ ద్వారా అటవీ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన నిర్మాణాలను ఎప్పటికప్పుడు ఫొటోలు తీసే విధానం ఉందని, దీనితో ముంపు ప్రాంతాలను గుర్తించే వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో విపత్తు, పోలీసు సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని పవన్ తెలిపారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి 175 బృందాలు విజయవాడలోని వరద బాధిత ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నాయని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా సూపర్ క్లోరినేషన్ చేస్తామని పవన్ తెలిపారు. వరద బాధిత ప్రాంతాల్లో సేవలందిస్తున్న పంచాయతీ రాజ్ పారిశుధ్య సిబ్బంది సుమారు వెయ్యి మందిని సత్కరిస్తామని పవన్ కల్యాణ్ తెలిపారు.


వరద బాధితుల ఇళ్లకు స్వయంగా వాటర్ బాటిళ్లను సరఫరా చేస్తున్న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా

పవన్ విరాళం 6 కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న గ్రామ పంచాయతీలకు వ్యక్తిగతంగా విరాళం ఇవ్వాలని నిర్ణయించామని పవన్ ప్రకటించారు. 380 పంచాయతీలు వరద తాకిడికి గురయ్యాయని, ఒక్కో పంచాయతీకి రూ.లక్ష చొప్పున రూ.4 కోట్లు విరాళంగా అందిస్తామని చెప్పారు. అదేవిధంగా తెలంగాణలో వరద బాధితుల కోసం ఆ రాష్ట్ర సీఎంఆర్ఎఫ్‌కు రూ.కోటి విరాళం ఇవ్వనున్నట్లు తెలిపారు. విజయవాడ వరద బాధితుల కోసం పవన్ ఇప్పటికే రూ.కోటి ప్రకటించారు. దీంతో వరద బాధితుల కోసం పవన్ రూ.6 కోట్లు ప్రకటించినట్లయింది.

పంచాయతీరాజ్ ఉద్యోగుల విరాళం 14 కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు తమ ఒకరోజు మూల వేతనంరూ.14 కోట్లు వరద బాధితులకు విరాళంగా ఇస్తున్నారని పవన్ ప్రకటించారు. పంచాయతీరాజ్ అధికారుల సంఘం, పంచాయతీ కార్యదర్శుల సంఘం, ఈవోపీఆర్‌డీల సంఘం, ఇంజనీర్ల అసోసియేషన్, డిప్లమో ఇంజనీర్ల సంఘం, మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నేతలు వరప్రసాద్, వైవీడీ ప్రసాద్, వీవీఎంకే నాయుడు, రవీంద్రతో పాటు పలువురు ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు పవన్‌కు ఈ మేరకు తన సమ్మతిని తెలిపారు.

ముందు జాగ్రత్తలే ముఖ్యం...

హైడ్రా తరహాలో రాష్ట్రంలో వ్యవస్థను ఏర్పాటు చేయడంపై పవన్ మాట్లాడుతూ ఇందులో భిన్న కోణాలను స్పృశించాల్సి ఉందని, తొందర పడి ముందుకెళ్లడం కంటే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. దానికోసం హైబ్రిడ్ మెథడాలజీని ఎంచుకోవాలని చెప్పారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రాను తాను సమర్థిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రానున్న 20 ఏళ్లలో ఎలాంటి ఆక్రమణలు లేకుండా చేస్తామని తెలిపారు.

ఏలేరు ముంపు ప్రజల్ని అప్రమత్తం చేయాలి

- ఆహారం, నీరు, మందులు ఇవ్వండి: పవన్

ఏలేరు జలాశయానికి వరద ముప్పు పొంచి ఉన్నందున ముంపునకు గురయ్యే గ్రామల ప్రజలను అప్రమత్తం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలేరు రిజర్వాయర్‌లోకి 20.2 టీఎంసీల నీరు చేరిందని, బుధవారం సాయంత్రం నుంచి 500 క్యూసెక్కులు దిగువకు వదులుతామని కలెక్టర్ వివరించారు. పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల వైపు నీరు మళ్లుతున్నాయన్నారు. గొల్లప్రోలు ప్రజలను, రైతులను అప్రమత్తం చేయాలని పవన్ సూచించారు. ముంపులో ఉన్న జగనన్న కాలనీవాసులకు నిత్యావసరాలు అందించాలని ఆదేశించారు. ముంపు గ్రామాల ప్రజలకు అవసరమైన ఆహారం, తాగునీరు, ఔషధాలు పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని సూచించారు.

నిరంతర వైద్యం

- వరద ప్రభావిత ప్రాంతాల్లో శిబిరాలు.. సంచార వైద్యశాలలు
- 6 రకాల మందులతో కిట్ల పంపిణీ
- ఆరోగ్యశాఖ కమిషనర్ హరికిరణ్ వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటిమట్టం తగ్గు ముఖం పడుతున్న దృష్ట్యా సంక్రమిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సి. హరికిరణ్ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని రకాల వైద్య సేవలు, మందులను నిరంతరం అందించే ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అత్యవసర ఔషధాల కిట్లు, 104 సంచార వైద్యశాలల్లో మందుల పంపిణీని బుధవారం ఆయన పరిశీలించారు. సితార సెంటర్, భవానీపురం, స్వాతి థియేటర్ ప్రాంతాల్లో పర్యటించి మందుల పంపిణీని స్వయంగా పరిశీలించారు. ఎవరెవరికి ఏయే మందులు అందిస్తున్నారు? అత్యవసర సమయంలో ఇస్తున్న ఔషధాలేంటి అనే వివరాలను డాక్టర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎలాంటి కొరత లేకుండా సంబంధిత మందులను పంపిణీ చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. 32 వార్డుల్లో 64 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారని, రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నగరంలోని 32 వార్డులతోపాటు 5 గ్రామీణ ప్రాంతాల్లో కూడా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. అనుబంధంగా సంచార వైద్యశాలలను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఈ శిబిరాల్లో 200 రకాల మందులు సిద్ధంగా ఉంచామని, వైద్య సేవలు అందించడంలో తగిన సూచనలు, సలహాల కోసం ఉన్నతాధికారులతో 10 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నిరంతర పర్యవేక్షణ కోసం కంట్రోల్ రూమ్‌ను కూడా సిద్ధం చేసినట్టు వివరించారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న 32 వార్డుల్లో అందరికీ 6 రకాల అత్యవసర మందుల కిట్లను, వాటిని వాడే విధానాన్ని వివరించే కరపత్రాలను అందజేసినట్టు తెలిపారు.

వీడిన ముంపు.. తొలగిన ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

తెప్పించారు.వాటిద్వారా వీధుల్లో,ఇళ్లలోకి చేరిన బురద, మురుగు కొట్టేస్తున్నారు.

గాడినపడుతున్న ఆహార పంపిణీ

వరద ప్రాంతంలో పరిస్థితులను వివరిస్తూ 'ఆంధ్రజ్యోతి' బుధవారం సవివరమైన కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో.. గత మూడు రోజులుగా ఆహారం, తాగునీటి పంపిణీ విషయంలో విఫలమైన యంత్రాంగం బుధవారం దిద్దుబాటు చర్యలు తీసుకుంది. ఐఏఎస్ అధికారి కోన శశిధర్ సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ వద్దే ఉండి.. అంతా క్రమపద్ధతిలో జరిగేలా చూశారు. ఆహారం, తాగునీటితో వచ్చిన వాహనాలను ఏయే ప్రాంతాలకు పంపాలో ప్రణాళికా బద్ధంగా నిర్ణయించి... ప్రతి వాహనం వెంట డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాన్ని పంపించారు. దీంతో చాలా వరకు బాధితులకు ఆహారం, తాగునీటి బాటిళ్లు చేరాయి.

ఎంత కష్టం... ఎంత నష్టం

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని వాంబే కాలనీ, కండ్రిక, రాజీవ్ నగర్ కాలనీ, ఉడా కాలనీ, ఆంధ్రప్రభ కాలనీలలోని చివరి ప్రాంతాలు నాలుగైదు అడుగుల ముంపులో ఉన్నాయి. పశ్చిమ నియోజకవర్గంలో.. విద్యాధరపురం కబేళా సెంటర్, ఆర్టీసీ వర్క్ షాపు రోడ్డు ముంపులో ఉన్నాయి. మిగిలిన ప్రాంతాలన్నీ దాదాపు ముంపు నుంచి తేరుకున్నాయి. వరద ముంపు నుంచి బయటపడిన జనం ఇళ్లకు తాళాలు వేసి సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. సుమారు 60 వేల ఇళ్లు పూర్తిగా వరద ముంపునకు గురయ్యాయని, రూ.600 కోట్ల నష్టం సంభవించి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇది కేవలం నివాస గృహాల్లో జరిగిన ఆస్తి నష్టం మాత్రమే. ఒక్కో కుటుంబం కనీసం రూ.లక్ష విలువైన ఆస్తిని నష్టపోయి ఉంటుందని అంచనా.

'పద్ధతి' పాటించాలి...: బుధవారం అటు ప్రభుత్వ యంత్రాంగం, ఇటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భారీ సంఖ్యలో వాటర్ బాటిళ్లను పైపుల రోడ్డు సెంటర్, సింగ్ నగర్ ఫ్లైఓవర్ వద్దకు తీసుకెళ్లారు. కానీ... వాటిని పద్ధతిగా పంపిణీ చేసే వ్యవస్థ కనిపించలేదు. బాధితులు మంచినీళ్ల కోసం పోటెత్తారు. స్వచ్ఛంద సంస్థల వాహనాలు రాగానే మంచినీటి ప్యాకెట్ల కోసం చుట్టుముట్టారు. పరిస్థితిని నియంత్రించలేని ఆయా సంస్థల ప్రతినిధులు పన్నెండు చొప్పున బాటిళ్లతో కలిపిన ప్యాక్‌లనే కిందికి వదిలేశారు. మళ్లీ నీళ్లు దొరుకుతాయో లేదో అన్నట్లుగా కొంత మంది భుజాలపై రెండు మూడు కేసుల వాటర్ బాటిళ్లను తీసుకెళ్లడం కనిపించింది. మరోవైపు.. మంచినీటి బాటిళ్ల కోసం కొందరు దుకాణదారులూఎగబడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆహారం, తాగునీరు విజయవాడ వచ్చి చేరుతోంది. అవి సక్రమంగా పంపిణీ అయ్యేలా ఒక అధికారిని నియమించాల్సిన అవసరముంది. కాగా, మూడు రోజులుగా నెలకొన్న సమన్వయ లోపంతో పెద్దస్థాయిలో ఆహారం వృథా అయ్యింది. పైపుల రోడ్డు సెంటర్‌లో ఎక్కడిపడితే అక్కడ ఆహార ప్యాకెట్లు బస్తాలు బస్తాలు పోగుపడి ఉన్నాయి. సింగ్ నగర్ నుంచి వరద ముంపు తీవ్రంగా ఉన్న దూరప్రాంతాల్లో రోడ్ల వెంట ఎక్కడపడితే అక్కడ ఆహార ప్యాకెట్లు కనిపించాయి. పారిశుధ్య సిబ్బంది వీటిని తొలగించడం మొదలుపెట్టారు.

32కు చేరిన వరద మృతులు

- ఎన్టీఆర్ జిల్లాలో 24మంది మృత్యువాత
- సహాయ చర్యలు వేగవంతం

అమరావతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు, వరద కారణంగా చనిపోయిన వారి సంఖ్య 32కు చేరింది. ఎన్టీఆర్ జిల్లాలో మృతుల సంఖ్య 24కు పెరిగింది. గుంటూరు జిల్లాలో ఏడుగురు, పల్నాడు జిల్లాలో ఒకరు చొప్పున మరణాలు నమోదయ్యాయని విపత్తుల నిర్వహణ సంస్థ బుధవారం వెల్లడించింది. ఎన్టీఆర్ జిల్లాలో గల్లంతైన ఇద్దరి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. విజయవాడ మొగల్రాజపురంలో ఐదుగురు, విజయవాడ రూరల్‌లో ముగ్గురు, జీ కొండూరు మండలంలో నలుగురు, రెడ్డిగూడెం, కంచికచర్ల మండలాల్లో ఒక్కొక్కరు, మైలవరం మండలంలో ఇద్దరు, ఇబ్రహీంపట్నంలో ఇద్దరు, విజయవాడ నార్త్‌లో ఐదుగురు, విజయవాడ ఈస్ట్‌లో ఒకరు మృతి చెందారు. గుంటూరు జిల్లా లో ఇద్దరు విద్యార్థులు, ఒక టీచర్, ఒక వృద్ధురాలు, మరో యువకుడు మృతి చెందగా, గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వాగులో కొట్టుకువచ్చింది. పల్నాడు జిల్లా అచ్చంపేటలో బైక్‌పై వెళు తూ వాగులో కొట్టుకుపోయి ఒకరు వ్యక్తి మృతి చెందారు. మరోవైపు సహాయక చర్యలు వేగవంతమయ్యాయి.

వదలని వానలు

- నేడు అల్పపీడనం.. కోస్తాలో పలుచోట్ల వర్షాలు
- గుంటూరు నుంచి విశాఖ వరకూ భారీ వర్షసూచన
- నాలుగైదు రోజులపాటు కొనసాగే అవకాశం


పోలవరం స్పిల్‌వే వద్ద గోదావరి

విశాఖపట్నం, అమరావతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోస్తా జిల్లాలను వర్షాలు వెంటాడుతూనే ఉన్నాయి. రెండు రోజులు విరామం ఇచ్చినట్టే ఇచ్చి.. మంగళవారం రాత్రి నుంచి మళ్లీ ప్రారంభమయ్యాయి. ఇప్పటికీ ఇంకా కోలుకోలేని గుంటూరు, కృష్ణా జిల్లాలతోపాటు పొరుగున ఉన్న పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో అనేకచోట్ల బుధవారం తెలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. అక్కడక్కడా భారీ వర్షాలు పడ్డాయి. మరో నాలుగైదు రోజులపాటు కోస్తా, రాయలసీమల్లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చురుగ్గా రుతుపవనాలు..

రుతుపవన ద్రోణి తూర్పుభాగం రామగుండం, కళింగపట్నం మీదుగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు విస్తరించింది. ఇంకా కోస్తాంధ్ర పరిసరాల్లో సముద్ర మట్టానికి 3.1 కి.మీ.ల నుంచి 7.6 కి.మీ. ఎత్తు మధ్యన ఉపరితల ఆవర్తనం కొనసాగడమే కాకుండా దాని నైరుతి భాగం ఒంగి ఉంది. దీని ప్రభావంతో గురువారం పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత ఇది ఉత్తర వాయవ్యంగా పయనిస్తుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. కాగా బుధవారం కోస్తాలో అనేక చోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురిశాయి. గురువారం ఉదయం నుంచి ఏలూరు, అల్లూరి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, తూర్పుగోదావరి, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కాగా, కృష్ణానదికి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోందని, ప్రకాశం బ్యారేజ్ వద్ద 3.08లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.



వరద ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టేందుకు భారీగా ట్రాక్టర్లు తరలివచ్చాయి. వీటిలో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్న బాధితులు

గోదావరి ఉగ్రరూపం!

- ముంపు మండలాలు అప్రమత్తం
- పోలవరం స్పిల్‌వే 175 గేట్లు ఎత్తివేత

ఏలూరు/అమలాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని పోలవరం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద నీరు పోలవరానికి చేరుతోంది. బుధవారం నాటికి పోలవరం స్పిల్‌వే వద్ద 175 గేట్లను ఎత్తేసి 8.22 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలో ఉన్న గండిపోచమ్మ ఆలయం పూర్తిగా నీట మునిగింది. ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో గురువారం తెల్లవారుజాము నాటికి రెండో ప్రమాద హెచ్చరిక దిశగా వరద క్రమేపి పుంజుకుంటోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. ముంపు మండలాలను జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి స్వయంగా సందర్శించారు. గర్భిణులను, వయో వృద్ధులను, చిన్నారులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. కాగా, ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ఏలూరు జిల్లాలోని ఏజెన్సీలో కొండవాగుల తీవ్రత పెరిగింది. కాగా, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీవర్షాలతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.



సింగ్ నగర్ రోడ్డుపై చిన్నారిని ట్రాక్టరులోకి తీసుకుంటున్న యువతి



వరద నీటిలో ఉండిపోయిన ప్రజలకు ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను అందజేస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది


సితారా సెంటర్‌లో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం


విజయవాడ ప్రశాంతి నగర్‌లో వాటర్ బాటిళ్ల పంపిణీ


బురదలో చిక్కుకున్న ఇళ్లను శుభ్రం చేసేందుకు తరలించిన అగ్నిమాపక వాహనాలు


వరద ప్రాంతాలలో రోడ్లను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు



సితారా జంక్షన్‌లో ట్యాంకరు నుంచినీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

జోరు తగ్గిన వరద

- శ్రీశైలం, సాగర్, పులిచింతల గేట్లు మూత

అ ఎ ం ఎ తి / వి జయవాడ/కర్నూలు/నరసరావుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ మహోగ్ర రూపం వీడింది. పూర్తిగా శాంతించింది. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలకు ఎగువ నుంచి ప్రవాహ ఉధృతి భారీగా తగ్గింది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల గేట్లన్నీ మూసివేశారు. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. దీంతో డ్యాం అధికారులు బుధవారం క్రస్ట్ గేట్లను మూసివేశారు. ఎగువ నుంచి ప్రవాహం గణనీయంగా తగ్గిపోవడంతో పులిచింతల ప్రాజెక్టు గేట్లను కూడా మూసివేశారు. విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి మాత్రం 16 వేల క్యూసెక్కులు వస్తోంది. ఈ నీటిని ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. బ్యారేజీకి వరద భారీగా తగ్గుముఖం పట్టింది. 3,00,767 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.

అంతర్జాతీయ బాండ్ మార్కెట్‌లోకి
కెనరా బ్యాంకు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల విరామం తర్వాత కెనరా బ్యాంకు అంతర్జాతీయ బాండ్ మార్కెట్లో ప్రవేశించింది. ఐఎఫ్ఎస్‌సి బ్యాంకిం గ్ యూనిట్ ద్వారా ఐదేళ్ల కాల పరిమితిగల బాండ్లు జారీ చేసి 30 కోట డాలర్లు (సుమారు రూ.2,520 కోట్లు) సమీకరించిం ది. ఈ బాండ్లపై చెల్లించే వడ్డీరేటును 4.896 శాతంగా నిర్ణయించింది. వ్యాపార విస్తరణకు ఈ నిధులు వినియోగించనున్నట్టు బ్యాంకు ఎండీ, సీఈ ఓ సత్యనారాయణరాజు తెలిపారు. ఆసియా, పశ్చిమాసియా, యూరప్‌లకు చెందిన 72 మంది మదుపరులు ఈ బాండ్స్‌లో పెట్టుబడులు పెట్టారు.

ఏపీలో ఇంటరార్క్ కొత్త ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంటరార్క్ బిల్డింగ్ ప్రోడక్ట్స్ కంపెనీ ప్రీ ఇంజనీర్డ్ బిల్డింగ్ ఉత్పత్తుల తయారీకి ఐదో ప్లాంట్‌ను నెల్లూరు జిల్లాలోని (ఆంధ్రప్రదేశ్) అత్తివరంలో ప్రారంభించింది. ఇది కంపెనీకి చెందిన నాల్గవ ఇంటిగ్రేటెడ్ ప్లాంట్. అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌లో ప్రీ ఇంజనీర్డ్ బిల్డింగ్ ఉత్పత్తులు, ప్రీ ఇంజనీర్డ్ మెటల్ రూఫింగ్, క్లాడింగ్ వ్యవస్థలు తయారుచేస్తారు. 10 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్ విస్తరించిన ఉండగా తొలి దశలో రూ.40 కోట్ల వ్యయంతో నాలుగు ఎకరాల ప్లాట్‌ను వినియోగించారు. దీంతో ఇంటరార్క్ స్థాపిత సామర్థ్యం ఏడాదికి 20 వేల మెట్రిక్ టన్నుల మేరకు పెరుగుతుంది. ఈ ప్లాంట్ ద్వారా 250 మంది స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అర్వింద్ నందా తెలిపారు. ఈ ప్లాంట్‌ను ప్రారంభించడంతో పాటు కంపెనీ రెండో దశ నిర్మాణాలకు శంకుస్థాపన కూడా చేసింది. ఈ ప్లాంట్ ఏడెనిమిది నెలల్లో ప్రారంభమవుతుందని కంపెనీ తెలిపింది. ఈ దశ పూర్తయితే స్థాపిత సామర్థ్యం 40 వేల మెట్రిక్ టన్నులకు పెరిగి మొత్తం సామర్థ్యం 2 లక్షల ఎంటీలకు చేరుతుందని వెల్లడించింది.

వచ్చే వారం బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓ

న్యూఢిల్లీ: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చే వారంలో ప్రారంభం కానుంది. అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీలు తప్పనిసరిగా స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావాలన్న ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా కంపెనీ ఐపీఓకు వస్తోంది.

సెబీ చీఫ్‌పై సిబ్బంది గుస్సా

వేధించుకు తింటున్నారంటూ ఆర్థిక శాఖకు లేఖ.. అంతా అబద్ధం అన్న సెబీ



న్యూఢిల్లీ: సెబీ చీఫ్ మాధవి పురి బుచ్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా సెబీ అధికారులే ఆమెతో వేగలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తునారు. ఆమె సెబీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి, సంస్థలో పని ధోరణి మారిపోయిందని ఆరోపిస్తూ గత నెల ఆరో తేదీన, ఏకంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఐదు పేజీల లేఖ రాశారు. ఆచరణ సాధ్యంకాని లక్ష్యాలను నిర్దేశించడం, వాటిని సాధించలేకపోతే నలుగురి ముందు పేరు పెట్టి పరుష పదజాలంతో దూషించడం మామూలై పోయిందని అధికారులు ఆ లేఖలో పేర్కొన్నారు. 'గ్రీవెన్సెస్ ఆఫ్ సెబీ ఆఫీసియల్స్-ఎ కాల్ ఫర్ రెస్పెక్ట్' పేరుతో వారు ఈ లేఖ రాశారు. నలుగురిముందు పరుష పదజాలంతో బిగ్గరగా దూషించడమేగా, ప్రతి నిమిషం తమ కదలికలను గమనించడం పరిపాటైపోయిందని ఆరోపించారు. ఈ తరహా పనితీరు కారణంగా తమ మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటోందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేశారు. సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఇపుడు సెబీ అధికారులు కూడా ఆమెపై దండెత్తడంతో ఆమె పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుందని భావిస్తున్నారు.

ఇది బయటి వ్యక్తుల పనే

మరోవైపు ఈ లేఖలోని ఆరోపణలను సెబీ తోసిపుచ్చింది. తమ సంస్థలో వర్కింగ్ కల్చర్ బాగానే ఉందని స్పష్టం చేసింది. గత నెల ఆరున కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు రాసిన లేఖ తమ ఉద్యోగులది కాదని తెలిపింది. బయటి వ్యక్తులే ఈ పని చేశారని ఆరోపించింది. తమ ఉద్యోగులు కూడా ఆ లేఖకు సంబంధించిన ఇ-మెయిల్ తాము పంపలేదని తెలిపినట్టు ప్రకటించింది. లేని సమస్యలు ఉన్నట్టు చూపిస్తూ మీడియా, ఆర్థిక మంత్రిత్వ శాఖ లేదా సెబీ బోర్డుకి లేఖ రాయాలని బయటి వ్యక్తులు తమ జూనియర్ అధికారులను పురిగొల్పుతున్నట్టు ఆరోపించింది.

ఫ్లిప్‌కార్ట్‌లో లక్ష కొలువులు

కొత్తగా 11 ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలు



న్యూఢిల్లీ: వచ్చే పండగల సీజన్ అమ్మకాల పై ఇ-కామర్స్ దిగ్గజం 'ఫ్లిప్‌కార్ట్' చాలా ఆశలు పెట్టుకుంది. ఈ సీజన్‌లో ప్రారంభమయ్యే 'బిగ్ బిలియన్ డేస్, 2024' సందర్భంగా దేశ వ్యాప్తంగా లక్షకు పైగా ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపింది. ఇన్వెంటరీ మేనేజర్లు, వేర్‌హౌస్ అసోసియేట్స్, లాజిస్టిక్స్ కో-ఆర్డినేటర్లు, కిరాణా పార్ట్‌నర్స్, డెలివరీ డ్రైవర్స్ రూపంలో ఈ ఉద్యోగాల కల్పన ఉంటుందని పేర్కొంది. పండగల సీజన్‌కు ముందే వీరిని రిక్రూట్ చేసుకుని అవసరమైన శిక్షణ ఇస్తామని ప్రకటించింది. ఈ నియామకాల్లో దివ్యాంగులైన స్త్రీలే ఎక్కువగా ఉంటారని తెలిపింది. బిగ్ బిలియన్ డేస్, 2024 డిమాండ్‌ను తట్టుకునేందుకు ఫ్లిప్‌కార్ట్ తొమ్మిది నగరాల్లో కొత్తగా 11 ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. దీంతో వాల్‌మార్ట్ నిర్వహణలోని ఈ ఇ-కామర్స్ దిగ్గజం ఎఫ్‌సీల సంఖ్య 83కు చేరింది.

అంధుల కోసం 'స్పెషల్ కేర్ గోల్డ్' పాలసీ

స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ 'స్పెషల్ కేర్ గోల్డ్' పేరుతో అంధుల కోసం ప్రత్యేక ఆరోగ్య బీమా పాలసీ తీసుకొచ్చింది. అంధులు సైతం పాలసీ వివరాలు చదువుకుని నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఈ పాలసీ వివరాలను స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ బ్రెయిలీ లిపిలో అందిస్తోంది. ఒక బీమా కంపెనీ అంధుల కోసం బ్రెయిలీ లిపిలో బీమా పాలసీ తీసుకు రావడం దేశంలో ఇదే మొదటిసారి. నలభై శాతం లేదా అంతకంటే ఎక్కువ అంధత్వం ఉన్న వ్యక్తులు ఈ సమగ్ర ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవచ్చు. దేశంలో ఉన్న దాదాపు మూడున్నర కోట్ల మంది అంధుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పాలసీ రూపొందించినట్టు స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ తెలిపింది.

డాక్టర్ రెడ్డీస్ 'ఇబుప్రొఫెన్'పై ఎఫ్‌డీఏ వేటు

న్యూఢిల్లీ: డాక్టర్ రెడ్డీ లాబ్స్, సిప్లా కంపెనీలకు అమెరికా మార్కెట్‌లో ఎదురు దెబ్బ తగిలింది. ఈ కంపెనీల అమెరికా అనుబంధ సంస్థలు మార్కెట్ చేస్తున్న రెండు ఉత్పత్తులపై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఏ కొరడా ఝళిపించింది. డాక్టర్ రెడ్డీస్ కంపెనీ మార్కెట్ చేసే ఇబుప్రొఫెన్, సిప్లా కంపెనీ మార్కెట్ చేసే సిఫిక్సైమ్ ఔషధాలు సరైన నాణ్యతా ప్రమాణాలు లేనందున వెనక్కి (రికాల్) తీసుకోవాలని ఆదేశించింది. ఇబుప్రొఫెన్ టాబ్లెట్లను నొప్పులు, జ్వరం తగ్గేందుకు ఉపయోగిస్తారు. సిప్లా కంపెనీ మార్కెట్ చేసే సిఫిక్సైమ్ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లలో ఉపయోగిస్తారు. దీంతో వివిధ మోతాదుల్లో ఉన్న 1,50,040 ఇబుప్రొఫెన్ బాటిల్స్‌ను డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్, 4,554 బాటిళ్ల సిఫిక్సైమ్ ఔషధాన్ని సిప్లా కంపెనీ వెనక్కి తీసుకున్నాయి.

మార్కెట్లో లాభాల స్వీకరణ

సెన్సెక్స్ 203 పాయింట్లు డౌన్

ముంబై: అమెరికా ఆర్థిక మందగమన భయాల నేపథ్యంలో దేశీయ ఇన్వెస్టర్లు బుధవారం ముందుజాగ్రత్త ధోరణితో వ్యవహరించారు. ఐటీ, బ్యాంకింగ్, మెటల్ షేర్లలో లాభాలు స్వీకరించడంతో సెన్సెక్స్ 202.80 పాయింట్లు కోల్పోయి 82,352.64 వద్దకు జారుకుంది. ఆరంభ ట్రేడింగ్‌లో 721 పాయింట్ల వరకు పతనమైన సూచీ.. క్రమంగా నష్టాలను తగ్గించుకుంది. 14 రోజుల వరుస ర్యాలీకి నిఫ్టీ సైతం తెర దించింది. 81.15 పాయింట్లు కోల్పోయి 25,198.70 వద్ద స్థిరపడింది. తాజాగా విడుదలైన అమెరికా మాన్యుఫాక్చరింగ్ డేటా బలహీనంగా ఉండటంతో యూఎస్ ఎకానమీ మందగమనంలోకి జారుకుంటున్నదన్న ఆందోళనలు మరోసారి తెరపైకి వచ్చాయి. దాంతో అమెరికన్ స్టాక్ సూచీలు మంగళవారం భారీగా పతనమయ్యాయి. ఆ ప్రభావంతో భారత్ సహా అంతర్జాతీయంగా అన్నీ ఈక్విటీ మార్కెట్లు ఒత్తిడికి లోనయ్యాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

1జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (జీఐసీ ఆర్ఈ) వాటా కొనుగోలుకు సంస్థాగత ఇన్వెస్టర్లు బుధవారం రూ.2,300 కోట్ల విలువైన బిడ్లు సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం జీఐసీ ఆర్ఈలో 6.78 శాతం వరకు వాటాను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో విక్రయానికి పెట్టింది. ఒక్కో షేరును రూ.395గా నిర్ణయించింది.

1క్రాస్ లిమిటెడ్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.228-240గా నిర్ణయించింది. కంపెనీ ఇష్యూ ఈనెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.500 కోట్లు సమీకరించాలనుకుంటోంది.

1ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు క్షీణించి 84.01 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు పీపా ధర ఒకదశలో 0.14 శాతం తగ్గి 73.65 డాలర్ల వద్ద ట్రేడైంది.

రూ.1650 తగ్గిన వెండి ధర: ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.450 తగ్గుదలతో రూ.73,600కు జారుకోగా.. కిలో వెండి ఏకంగా రూ.1,650 తగ్గి రూ.83,600కు దిగివచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 2,520 డాలర్లు, సిల్వర్ 28 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

'ఇజెనిసిస్'లో నాట్కోకు వాటా

హైదరాబాద్ : కెనడా కేంద్రంగా పనిచేసే బయోటెక్నాలజీ కంపెనీ 'ఇజెనిసిస్ ఇంక్' ఈక్విటీలో స్థానిక నాట్కో ఫార్మా నాలుగు కోట్ల షేర్లు కొనుగోలు చేసింది. ఇందుకోసం 80 లక్షల డాలర్లు (సుమారు రూ.67.20 కోట్లు) చెల్లించినట్టు తెలిపింది. జెనిటిక్ ఇంజినీరింగ్ ద్వారా సురక్షితమైన కృత్రిమ అవయవాల అభివృద్ధిలో ఈ కంపెనీకి మంచి పేరుంది. కెనడాలోని అనుబంధ సంస్థ ద్వారా నాట్కో ఫార్మా, ఇజెనిసిస్ ఈక్విటీలో ఈ షేర్లు కొనుగోలు చేసింది.

ఐదేళ్లలో క్రెడిట్ కార్డులు డబుల్

2028-29 నాటికి 20 కోట్లకు.. పీడబ్ల్యూసీ నివేదిక అంచనా



న్యూఢిల్లీ: దేశంలో క్రెడిట్ కార్డుల వ్యాపారం శరవేగంగా వృద్ధి చెందుతోందని పీడబ్ల్యూసీ తాజా నివేదిక పేర్కొంది. గత 5 ఆర్థిక సంవత్సరాల్లో క్రెడిట్ కార్డులు రెట్టింపయ్యాయని.. మున్ముందు సంవత్సరాల్లోనూ ఇదే ట్రెండ్ కొనసాగనుందని ఆ నివేదిక తెలిపింది. 2028-29 నాటికి క్రెడిట్ కార్డులు రెట్టింపై 20 కోట్ల స్థాయికి చేరుకోవచ్చని అంచనా వేసింది. వచ్చే ఐదేళ్ల పాటు కార్డుల సంఖ్య 15 శాతం చొప్పున వృద్ధి చెందనుందని అంటోంది. నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

1క్రెడిట్ కార్డుల జారీతోపాటు ఈ కార్డుల ద్వారా ఆర్థిక లావాదేవీలూ గణనీయంగా పెరిగాయి. లావాదేవీల సంఖ్య 22 శాతం పెరగగా.. లావాదేవీల మొత్తం విలువలో 28 శాతం వృద్ధి నమోదైంది. కొత్త ఉత్పత్తుల విడుదల, వినూత్న ఆఫర్లు, కస్టమర్ సెగ్మెంట్ల విస్తరణ వంటి అంశాలు ఇందుకు దోహదపడ్డాయని రిపోర్టు పేర్కొంది.

1డెబిట్ కార్డుల వినియోగం తగ్గుముఖం పడుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో డెబిట్ కార్డుల ద్వారా లావాదేవీలు వార్షిక ప్రాతిపదికన 33 శాతం తగ్గగా.. లావాదేవీల విలువ 18 శాతం తగ్గింది. అంతేకాదు, 2023-24లో కొత్త డెబిట్ కార్డుల జారీ వృద్ధి కూడా నెమ్మదించిందని.. యూపీఐ లావాదేవీలకు ప్రాచుర్యం పెరగడం ఇందుకు ఒక కారణమని రిపోర్టు తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,760 ▲	66,690 ▲	90,000 ▼
ముంబై	71,300 ▼	65,310 ▼	81,340 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	505
వరంగల్	472	గోదావరి	500
చిత్తూరు	518	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	108
వరంగల్	99	గుంటూరు	105
కరీంనగర్	99	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	95
కర్నూలు	99	నెల్లూరు	95
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	108		

ఆసియా చాంపియన్‌షిప్‌నకు శ్రీజ, స్నేహిత్

న్యూఢిల్లీ: కజకిస్థాన్ వేదికగా వచ్చే నెల 7వ తేదీ నుంచి జరిగే ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత బృందంలో హైదరాబాద్ స్టార్లు ఆకుల శ్రీజ, ఎస్ఎఫ్ఆర్ స్నేహిత్‌కు చోటు లభించింది. ఈ పోటీల్లో పాల్గొనే భారత క్రీడాకారుల జాబితాను జాతీయ టీటీ సమాఖ్య బుధవారం వెల్లడించింది. పురుషుల టీమ్‌కు వెటరన్ శరత్ కమల్, మహిళల జట్టుకు మనికా బాత్రా సారథులుగా నియమితులయ్యారు. పురుషుల టీమ్‌లో శరత్‌తో పాటు మానవ్ టక్కర్, హర్మీత్ దేశాయ్, సాథియన్, మానుష్ షా, మహిళల జట్టులో శ్రీజ, మనికా, ఐహిక ముఖర్జీ, దియా, సుత్రితకి స్థానం దక్కింది. స్నేహిత్, జీత్ చంద్ర, యశస్విని, పొయమంటి బైస్యాను రిజర్వ్ ప్లేయర్లుగా ఎంపిక చేశారు. ప్రపంచ ర్యాంకింగ్, అనుభవం ఆధారంగా ఈ జట్లను ఎంపిక చేసినట్టు టీటీ సంఘం తెలిపింది.

ఆర్ఆర్ కోచ్‌గా ద్రవిడ్!

జైపూర్: రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ నియామకం దాదాపుగా ఖరారైంది. ఈ ఏడాది భారత జట్టు టీ20 వరల్డ్‌కప్ నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన ద్రవిడ్‌ను కోచ్‌గా తీసుకోవాలని ఆర్ఆర్ నిర్ణయించుకుంది. ఇందుకు సంబంధించిన చర్చలు తుది దశలో ఉన్నాయి. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడనుంది. ద్రవిడ్ 2012, 2013 సీజన్లలో ఆర్ఆర్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

షూటర్ ప్రాంజలికి కాంస్యం

హనోవర్ (జర్మనీ): ప్రపంచ బధిర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి ప్రాంజలి ధూమల్ కాంస్యంతో మెరిసింది. బుధవారం జరిగిన 25 మీటర్ల పిస్టల్ విభాగంలో ప్రాంజలి ప్రపంచ రికార్డు స్కోరు 571తో ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఫైనల్లో 29 పాయింట్లతో ప్రాంజలి తృతీయ స్థానంతో సరిపెట్టుకోగా ఉక్రెయిన్ షూటర్లు సోఫియా ఒలెనిచ్ స్వర్ణం, హలీనా మోసినా రజతం దక్కించుకున్నారు. ఈ పోటీల్లో భారత్ ఇప్పటివరకు మూడు పసిడి, ఆరు రజతాలు, నాలుగు కాంస్య పతకాలు సొంతం చేసుకుంది.

ఎనిమిదో ర్యాంక్‌కు పాక్

దుబాయ్: ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్ కిందకు పడిపోయింది. బుధవారం విడుదల చేసిన టెస్టు టీమ్ ర్యాంకింగ్స్‌లో పాక్ రెండు స్థానాలు దిగజారి 8వ ర్యాంక్‌లో నిలిచింది. పాక్ టెస్టు చరిత్రలో ఈ ర్యాంక్‌కు పడిపోవడం గత 59 ఏళ్లలో ఇదే తొలిసారి. చివరిగా 1965లో పాక్ 8వ ర్యాంక్‌లో నిలిచింది. తాజాగా బంగ్లాదేశ్ చేతిలో టెస్టు సిరీస్ కోల్పోవడంతో పాకిస్థాన్ ర్యాంక్ ఘోరంగా పతనమైంది. ఆస్ట్రేలియా 124 పాయింట్లతో అగ్ర స్థానాన్ని నిలబెట్టుకోగా.. భారత్, ఇంగ్లండ్ 2,3 ర్యాంకుల్లో కొనసాగుతున్నాయి. వెస్టిండీస్ 8 నుంచి 7వ ర్యాంక్‌కు ఎగబాకగా, బంగ్లాదేశ్ 9వ ర్యాంక్‌లో స్థిరంగా ఉంది.

సిల్వర్ సచిన్

పురుషుల షాట్‌పుట్‌లో రెండో స్థానం

ఆసియా రికార్డుతో అదరగొట్టిన భారత అథ్లెట్

పారాలింపిక్స్



ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం >

పట్టుదల, సంకల్ప బలం ఉంటే.. ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు సచిన్ ఖిలారి. ఎఫ్-46 షాట్‌పుట్‌లో సచిన్ ఆసియా రికార్డుతో రజతం దక్కించుకొన్నాడు. ఎడమచేయి పని చేయకపోయినా.. ఇటు ఆటల్లో సత్తాచాటుతూనే మెకానికల్ ఇంజినీరింగ్ పట్టా సాధించాడు. మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా, ఖిలారిమెట్‌కు చెందిన సచిన్.. తొమ్మిదేళ్ల వయసులో సైకిల్ తొక్కుతూ కిందపడడంతో మోచేతికి గాయమైంది. చిన్న దెబ్బే కదా అనుకొంటే.. ఇన్ఫెక్షన్ సోకి చివరికి కండరాలు క్షీణించుకుపోయాయి.

చదువుల్లో మేటి.. ఆటల్లో లేదు సాటి!

ఎన్ని ఆపరేషన్లు చేయించినా.. ఫలితం లేకపోయింది. ఇక చిన్నతనంలో తల్లి కూడా దూరమైంది. ఇలా ఎన్నో కష్టాలు చుట్టుముట్టినా సచిన్ మాత్రం ధైర్యం కోల్పోలేదు. ఇంజనీరింగ్ చదువుకొంటూనే జావెలిన్ ప్రాక్టీస్ చేశాడు. అయితే, ఓ టోర్నీలో భుజానికి గాయం కావడంతో షాట్‌పుట్‌కు మారాడు. 2015లో పారా క్రీడల గురించి తెలుసుకోవడం, ఆ తర్వాత కోచ్ సత్యనారాయణను కలవడంతో సచిన్ కెరీర్ ఊపందుకొంది. చదువులోనూ దిట్ట అయిన సచిన్.. అనేక విద్యాసంస్థల్లో విజిటింగ్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నాడు. సివిల్స్, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తుంటాడు. గతేడాది వరల్డ్ పారా క్రీడల్లో చాంపియన్‌గా నిలిచిన ఖిలారి.. ఆసియా పారా క్రీడల్లోనూ స్వర్ణం సాధించాడు.

పారిస్: పారాలింపిక్స్ ట్రాక్, ఫీల్డ్‌లో భారత అథ్లెట్ల జోరు కొనసాగుతోంది. ఈ విభాగంలో ఇప్పటికే పది పతకాలతో మనోళ్లు భళా అనిపించగా..తాజాగా మరో రజతం భారత్ ఖాతాలో చేరింది. పురుషుల షాట్‌పుట్ ఎఫ్46 విభాగంలో వరల్డ్ చాంపియన్ సచిన్ సర్జేరావ్ ఖిలారి రజత పతకం కొల్లగొట్టాడు. బుధవారం జరిగిన ఈవెంట్‌లో 16.32 మీటర్ల ఆసియా రికార్డు దూరం గుండును విసిరిన సచిన్ రెండో స్థానం చేజిక్కించుకున్నాడు. 34 ఏళ్ల ఖిలారి తన రెండో ప్రయత్నంలో ఈ రికార్డు దూరాన్ని నమోదు చేశాడు. ఈక్రమంలో తన పేరిటే ఉన్న 16.30 మీటర్ల ఆసియా రికార్డును బద్దలు కొట్టాడు. కెనడాకు చెందిన గ్రెగ్ స్టివార్ట్ (16.38మీ.) టోక్యోలో గెలిచిన తన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్నాడు. ఇక..లుకా బకోవిక్ (క్రొయేషియా, 16.27మీ.) కాంస్యం గెలుపొందారు. ఈ విభాగంలో తలపడిన మరో ఇద్దరు భారత అథ్లెట్లు మహ్మద్ యాసిర్ (14.21మీ.) ఎనిమిది, రోహిత్ కుమార్ (14.10మీ.) తొమ్మిదో స్థానంలో నిలిచారు. అమెరికాకు చెందిన ప్రపంచ రికార్డు గ్రహీత జోషువా సినామో (16.80మీ.) 15.66 మీటర్ల దూరంతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఖిలారి రజతంతో ఈ క్రీడల్లో భారత్ మొత్తం పతకాల సంఖ్య 21కి చేరింది. ఇందులో మూడు పసిడి పతకాలున్నాయి

భవినా అవుట్..: టీటీ మహిళల సింగిల్స్‌లో పతక ఆశలతో బరిలో దిగిన భారత స్టార్ భవినాబెన్ పటేల్ నిరాశ పరిచింది. టోక్యో పారాలింపిక్స్‌లో రజత పతకంతో భళా అనిపించిన భవినా ఈసారి క్వార్టర్‌ఫైనల్లోనే తిరుగుముఖం పట్టింది. దాంతో ఈ విభాగంలో భారత పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్ క్లాస్4 క్వార్టర్స్‌లో భవినాబెన్ 12-14, 9-11, 11-8, 6-11తో చైనాకు చెందిన ఇంగ్ జౌ చేతిలో పరాజయం చవిచూసింది. అంతకుముందు మహిళల సింగిల్స్ క్లాస్ 3 రౌండ్-16 మ్యాచ్‌లో సొనాల్‌బెన్ పటేల్ 3-11, 12-10, 7-11, 5-11తో క్రొయేషియా ప్యాడ్లర్ ముజినిక్ చేతిలో ఓడింది. మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో భవిన/సొనాల్ ద్వయం..కొరియా జోడీ జంగ్/మూన్ చేతిలో ఓటమి పాలైంది.

నిహాల్, రుద్రాంశ్ విఫలం..: మిక్స్‌డ్ 50 మీ. పిస్టల్ (ఎస్‌హెచ్1) విభాగంలో భారత షూటర్లు నిహాల్ సింగ్, రుద్రాంశ్ ఖండేల్‌వాల్ ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యారు. ఆరు సిరీస్‌ల క్వాలిఫికేషన్ రౌండ్‌లో మొత్తం 522 పాయింట్లు సాధించిన నిహాల్ 19వ స్థానంలో నిలవగా, 517 స్కోరుతో రుద్రాంశ్ 22వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.

మరో నాలుగు..

మంగళవారం అర్ధరాత్రి జరిగిన పోటీలలో భారత అథ్లెట్లు నాలుగు పతకాలు సొంతం చేసుకున్నారు. పురుషుల హైజంప్ టీ63 విభాగంలో శరద్ కుమార్, మరియప్పన్ తంగవేలు రజత, కాంస్య పతకాలతో మెరిశారు. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్46 కేటగిరీలో అజీత్ సింగ్, సుందర్ సింగ్ గుర్జార్ కూడా రజత, కాంస్య పతకాలు చేజిక్కించుకున్నారు.

ప్చ్..అర్షద్

ఏపీ సైక్లిస్ట్ అర్షద్ షేక్ టైమ్ ట్రయల్ విభాగంలోనూ విఫలమయ్యాడు. పురుషుల సీ2 టైమ్ ట్రయల్ రేస్‌లో 25 నివిషాల 20.11 సెకన్లలో గమ్యం చేరిన అర్షద్ 11వ, ఆఖరి స్థానంలో నిలిచాడు. ఫ్రాన్స్, బెల్జియం, ఆస్ట్రేలియా వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు గెలిచాయి. పురుషుల 1000 మీటర్ల టైమ్ ట్రయల్ సీ1-3 క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో అర్షద్ ఆఖరి, 17వ స్థానం సాధించిన విషయం విదితమే. మహిళల సీ1-3 వ్యక్తిగత టైమ్ ట్రయల్‌లో 30 నివిషాల 16 సెకన్లలో రేస్‌ను ముగించిన జ్యోతి గడేరియా 16వ, చివరి స్థానంలో నిలిచింది. జర్మనీ, బ్రిటన్, స్వీడన్ వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గాయి.

శరద్ అదుర్స్.. తంగవేలు మరోమారు



పురుషుల హైజంప్ టీ63లో 32 ఏళ్ల శరద్ కుమార్ 1.88 మీటర్ల దూరం దూకి రెండో స్థానం సాధించగా, 29 ఏళ్ల తంగవేలు మరియప్పన్1.85 మీటర్ల దూరంతో మూడో స్థానం దక్కించుకున్నాడు. మూడేళ్ల కిందట జరిగిన టోక్యో పారాలింపిక్స్‌లో తంగవేలు రజతం కైవసం చేసుకోగా, శరద్ కుమార్ కాంస్యం పతకం సాధించాడు. వరల్డ్ రికార్డు హోల్డర్, 19 ఏళ్ల ఫ్రెచ్ ఎజ్రా (అమెరికా) 1.94 మీటర్ల పారాలింపిక్స్ రికార్డు దూరంతో పసిడి పతకం నెగ్గాడు.

జావెలిన్ త్రోలో రెండు, మూడు మనవే



పురుషుల ఎఫ్46 జావెలిన్ ఫైనల్ ఐదో రౌండ్‌లో సహచరుడు, వరల్డ్ రికార్డు హోల్డర్ సుందర్‌సింగ్ గుర్జార్ (64.96మీ.)ను వెనక్కు నెట్టిన అజీత్ సింగ్ రజత పతకం నెగ్గాడు. దాంతో గుర్జార్ కాంస్యానికే పరిమితమ య్యాడు. క్యూబా త్రోయర్ గెలెర్మో గొంజాలెజ్ వరోనా (66.16మీ.) స్వర్ణ పతకం అందుకున్నాడు. పారాలింపిక్స్‌లో గుర్జార్‌కు ఇది వరుసగా రెండో కాంస్య పతకం. టోక్యో క్రీడల్లో అతడు మూడో స్థానంలో నిలిచాడు.

సెమీస్‌కు సబలెంక, నవారో

పురుషుల్లో టియాఫో, ఫ్రిట్జ్ ● జ్వెరెవ్, జెంగ్‌కు షాక్ ● యూఎస్ ఓపెన్



న్యూయార్క్: మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో ఉన్న బెలారస్ స్టార్ అర్యానా సబలెంక యూఎస్ ఓపెన్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన క్వార్టర్స్ పోరులో రెండోసీడ్ సబలెంక 6-1, 6-2తో ఏడోసీడ్ జెంగ్ కిన్‌వెన్ (చైనా)ను చిత్తుచేసింది. ఇటీవలే పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గి జోరుమీదున్న జెంగ్.. ఇక్కడ మాత్రం సబలెంక దూకుడు ముందు పూర్తిగా తేలిపోయింది. గ్రాండ్‌స్లామ్‌లో సబలెంక చేతిలో ఓడడం జెంగ్‌కు ఇది వరుసగా రెండోసారి. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో జెంగ్‌ను ఓడించి సబలెంక టైటిల్ నిలబెట్టుకున్న సంగతి తెలిసిందే. నిరుడు యూఎస్ ఓపెన్ రన్నరప్ అయిన సబలెంక సెమీపైనల్లో స్థానిక క్రీడాకారిణి ఎమ్మా నవారోతో అమీతుమీ తేల్చుకోనుంది. మరో మ్యాచ్‌లో 13వ సీడ్ నవారో 6-2, 7-5తో 26వ సీడ్ పౌలా బడోసా (స్పెయిన్)ను ఓడించి గ్రాండ్‌స్లామ్‌లో తొలిసారి సెమీస్ చేరింది.

లోకల్ స్టార్ల అమీతుమీ: పురుషుల సింగిల్స్‌లో ఇద్దరు లోకల్ స్టార్లు ఫ్రాన్సెస్ టియాఫో, టేలర్ ఫ్రిట్జ్ మధ్య సెమీఫైనల్ ఫైట్‌కు రంగం సిద్ధమైంది. క్వార్టర్‌ఫైనల్లో 20వ సీడ్ ఫ్రాన్సెస్ టియాఫో 5-3, 6-7 (5), 6-3, 4-1తో ఆధిక్యంలో ఉన్నప్పుడు ప్రత్యర్థి, 9వ సీడ్ గ్రిగోర్ దిమిత్రోవ్ (బల్గేరియా) గాయం కారణంగా మ్యాచ్ నుంచి వైదొలిగాడు. ఈ వేదికపై టియాఫో సెమీస్ చేరడం గత మూడేళ్లలో ఇది రెండోసారి. ఇక, టైటిల్ ఫేవరెట్‌గా భావించిన 4వ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) పోరాటం క్వార్టర్స్‌కే పరిమితమైంది. 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 7-6(2), 3-6, 6-4, 7-6 (3)తో జ్వెరెవ్‌కు ఝలకిచ్చి తన స్నేహితుడు టియాఫోతో సెమీస్ పోరుకు సిద్ధమయ్యాడు.

పేసర్లపై దృష్టి

● దులీప్ ట్రోఫీ నేటి నుంచి

● అనంతపురం, బెంగళూరుల్లో మ్యాచ్‌లు

బెంగళూరు: గత కొన్ని నెలలుగా వైట్‌బాల్ క్రికెట్‌కే పరిమితమైన భారత్.. రానున్న నాలుగున్నర నెలల్లో 10 టెస్టులు ఆడనుంది. ఈ నేపథ్యంలో గురువారం నుంచి జరిగే దులీప్ ట్రోఫీతో వామప్ ఆరంభించనుంది. ఆస్ట్రేలియా పర్యటన నేపథ్యంలో పేస్ విభాగంలో అందుబాటులో ఉన్న వనరులను సెలెక్టర్లు పరీక్షించనున్నారు. భారత పేస్ త్రయంలో బుమ్రాపై ఎక్కువ భారం పడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉండగా.. శస్త్రచికిత్స చేయించుకొన్న షమి కోలుకోలేదు. డెంగ్యూ బారినపడిన సిరాజ్.. దులీప్ ట్రోఫీ తొలిరౌండ్ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో ముకేశ్ కుమార్, ఆకాష్‌దీప్, అర్ష్‌దీప్, అవేశ్, ఖలీల్ అహ్మద్, కవేరప్ప, వైశాఖ్, హర్షిత్ రాణాల ప్రదర్శనను సెలెక్టర్లు నిశితంగా గమనించనున్నారు. గాయం నుంచి ప్రసిద్ధ్ కృష్ణ ఇంకా కోలుకోలేదు. రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకొన్న తర్వాత పంత్ తొలిసారి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడుతుండడంతో అతడిపై అందరి దృష్టీ నెలకొనే అవకాశం ఉంది. ఇషాన్ కిషన్‌కు కండర గాయమవడంతో అతడు టోర్నీకే దూరమవుతాయనే అనుమానాలున్నాయి. స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబడుతున్న గిల్ ఆ బలహీనతను అధిగమించాలనే పట్టుదలతో ఉండగా.. సాయి సుదర్శన్, పడిక్కల్, రుతురాజ్, జురెల్, కేఎల్ రాహుల్, సర్ఫ రాజ్‌లు బ్యాట్‌తో ఎలా చెలరేగుతారో చూడాలి. జోనల్ పద్ధతికి స్వస్తి పలకడంతో.. దులీప్ ట్రోఫీలో ఈసారి ఎ,బి,సి,డి జట్లు బరిలోకి దిగనున్నాయి. తొలిరౌండ్‌లో జరిగే ఆరు మ్యాచ్‌ల్లో ఒకటి బెంగళూరులో.. మిగతా ఐదు మ్యాచ్‌లకు అనంతపురం వేదిక కానుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


ఆంధ్రజ్యోతి
diksuchi@andhrajyothy.com
దిక్సూచి
విజయవాడ ● గురువారం 5 సెప్టెంబరు 2024

నిమ్స్‌లో ఎంహెచ్ఎం

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- 'మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ఆర్నెల్ల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇది ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'నిమ్‌సెట్-ఎంహెచ్ఎం 2024'లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు సమయంలో ఇతర డిగ్రీ/డిప్లొమా ప్రవేశాలకు, ప్రైవేట్ ప్రాక్టీస్/కన్సల్టేషన్‌లకు అనుమతించరు. ప్రోగ్రామ్‌ను గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెడికల్/నాన్ మెడికల్ విభాగాల్లో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. దివ్యాంగులకు అయిదేళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు వర్తిస్తుంది.

నిమ్‌సెట్-ఎంహెచ్ఎం వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. హెల్త్ సైన్సెస్‌కు సంబంధించి 40, అడ్మినిస్ట్రేషన్ అంశాలనుంచి 10, కంప్యూటర్ సైన్సెస్ అంశాల నుంచి 10, జనరల్ నాలెడ్జ్ నుంచి 15, టెస్టింగ్ ఆఫ్ ఐక్యూకు సంబంధించి 15, ఇంగ్లీష్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 40 శాతం; ఎస్సీ, ఎస్టీలకు 30 శాతం మార్కులు రావాలి.



ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 18
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** nims.edu.in

ఇఫ్లూలో సంస్కృతం కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- సంస్కృతంలో ప్రొఫిషియెన్సీ కోర్సును అందిస్తోంది. దీని వ్యవధి 50 గంటలు. ప్రోగ్రామ్‌లో భాగంగా సంస్కృతం చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం, భాష సంబంధిత వ్యాకరణం తదితరాలు నేర్పిస్తారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు క్లాస్‌రూమ్ సెషన్స్ ఉంటాయి. పదోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం
- **కోర్సు ఫీజు:** రూ.3000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్‌'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. దీని వ్యవధి నాలుగు నెలలు(150 గంటలు). వారాంతాల్లో లైవ్ ఇంటరాక్టివ్ సెషన్స్ ద్వారా బోధన ఉంటుంది. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండుంబావు వరకు, సాయంత్రం రెండు నుంచి అయిదుంబావు వరకు సెషన్స్ నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా అసైన్‌మెంట్లు, అసెస్‌మెంట్లు, ప్రజెంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఫైనల్ ఎగ్జామ్స్ ఉంటాయి. కోర్సు మెటీరియల్‌కు సంబంధించి లైఫ్ టైమ్ యాక్సెస్ ఇస్తారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

జేఎన్‌టీయూకేలో ఎంటెక్ స్పాన్సర్డ్ కోటా



కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. కనీసం ఏడాది అనుభవం ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ 2024/జీప్యాట్ 2024/ఏపీ పీజీఈసెట్ 2024 ర్యాంక్, అకడమిక్ మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. స్పెషలైజేషన్‌కు అయిదు చొప్పున మొత్తం 65 సీట్లు ఉన్నాయి.

క్యాంపస్‌లు
- ★ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకినాడ
- ★ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కాకినాడ
- ★ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, నర్సరావుపేట

విభాగాలు-స్పెషలైజేషన్‌లు
- ★ సివిల్ ఇంజనీరింగ్ - స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్
- ★ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ - హై ఓల్టేజ్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్
- ★ మెకానికల్ ఇంజనీరింగ్ - క్యాడ్/క్యామ్, మెషిన్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్
- ★ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ - కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్
- ★ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ
- ★ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ - రెన్యూవబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- ★ బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఏఎంఐఈ లేదా ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ/ఫిజిక్స్/బయోటెక్నాలజీ/ఎర్త్‌సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/జియాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. గేట్ 2024/జీప్యాట్ 2024/ఏపీ పీజీఈసెట్ 2024 ర్యాంక్ ఉండాలి.
- ★ **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- ★ **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- ★ **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో అప్రెంటిస్‌లు

మొత్తం ఖాళీలు: 550

చెన్నైలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ ఆఫీస్... దేశవ్యాప్తంగా ఐఓబీ శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 22, తెలంగాణలో 29 ఖాళీలు ఉన్నాయి.

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఏడాది.

స్టయిపెండ్: నెలకు మెట్రో ప్రాంతానికి రూ.15,000; అర్బన్ ప్రాంతానికి రూ.12,000; సెమీ-అర్బన్/రూరల్ ప్రాంతానికి రూ.10,000.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 10

వెబ్‌సైట్: https://www.iob.in/Careers

టీసీఐఎల్‌లో వివిధ ఖాళీలు

మొత్తం ఖాళీలు: 204

ఢిల్లీలోని టెలీకమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ లిమిటెడ్(టీసీఐఎల్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. నర్సింగ్ ఆఫీసర్
2. ల్యాబ్/ఈసీజీ/ఓటీ/పోస్ట్ మార్టమ్ టెక్నీషియన్స్
3. ల్యాబ్ అసిస్టెంట్/ఆడియోమెట్రీ/ఓటీ/మార్చురీ/ప్లాస్టర్ రూం
4. ఫార్మసిస్ట్
5. జూనియర్ రేడియోగ్రాఫర్
6. రిఫ్రాక్షనిస్ట్
7. ఫిజియోథెరపిస్ట్
8. ఆక్యుపేషనల్ థెరపిస్ట్
9. అసిస్టెంట్ డైటీషియన్
10. డ్రెస్సర్

అర్హత: టెన్త్, ఇంటర్, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 27 నుంచి 32 ఏళ్లు మించకూడదు

ఎంపిక: స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ, షార్ట్‌లిస్టింగ్, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 13

వెబ్‌సైట్: https://www.tcil.net.in/index.php



డీఆర్‌డీఓలో జేఆర్ఎఫ్ ఖాళీలు

మొత్తం ఖాళీలు: 8

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీఓ)కు చెందిన సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్(చెస్)... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. రీసెర్చ్ అసోసియేట్: **2 పోస్టులు**
2. జూనియర్ రీసెర్చ్ ఫెలో: **6 పోస్టులు**

విభాగాలు: మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, లేజర్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కెమిస్ట్రీ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. నెట్/గేట్ స్కోరు తప్పనిసరి.

వయోపరిమితి: రీసెర్చ్ అసోసియేట్ పోస్టుకు 35 ఏళ్లు, జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు 28 ఏళ్లు మించకూడదు.

స్టయిపెండ్: నెలకు రీసెర్చ్ అసోసియేట్ పోస్టులకు రూ.67,000; జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టులకు రూ.37,000.

ఎంపిక: విద్యార్హత, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ, పని అనుభవం తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా

ఈమెయిల్: hrd.chess@gov.in

వెబ్‌సైట్: www.drdo.gov.in/drdo/

పవర్‌గ్రిడ్‌లో ఆఫీసర్ ట్రెయినీ

మొత్తం ఖాళీలు: 9

ఢిల్లీలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పవర్‌గ్రిడ్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. క్లాట్ స్కోరు తప్పనిసరి.

జీతం: నెలకు రూ.40,000

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: ధ్రువపత్రాల పరిశీలన, బిహేవియరల్ అసెస్‌మెంట్, గ్రూప్ డిస్కషన్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ, క్లాట్ స్కోరు తదితరాల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: నవంబరు 7

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 27

వెబ్‌సైట్: https://www.powergrid.in/

ఐఐసీటీలో ప్రాజెక్ట్ అసోసియేట్స్

మొత్తం ఖాళీలు: 24

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టుల వివరాలు
1. సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్
2. ప్రాజెక్ట్ అసోసియేట్-1
3. ప్రాజెక్ట్ అసోసియేట్-2
4. సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, నెట్/గేట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.


వయోపరిమితి: సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులకు 40 ఏళ్లు; సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ పోస్టుకు 50 ఏళ్లు; ఇతర పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 10

వేదిక: ఐసీఎంఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ), హైదరాబాద్.

వెబ్‌సైట్: https://www.iict.res.in/



లిటిల్స్

మంచి గురువు ధర్మం



పూర్వం వాల్మీకి మహాముని ఆశ్రమంలో అనేక మంది విద్యాభ్యాసం కోసం వచ్చేవారు.అలా చేరిన శిష్యుల బృందంలో ఒకరోజు ఒక విద్యార్థి వస్తువు కనిపించకుండా పోయింది ఆ వస్తువును ఎవరు తీసుకుని ఉంటారు అనేది అక్కడున్న వారందరికీ తెలుసు. వారందరూ వెళ్లి, ఎ మహర్షికి ఆ విద్యార్థి పేరును ఫిర్యాదుచేసారు. అంతా తెలుసుకున్న తర్వాత కూడా మహాముని ఆ విద్యార్థిని దండించకుండా వదిలేసాడు. ఇలా అతన్ని దండించకుండా వదిలేస్తే, ఆశ్రమంలో మేమంతా ఉండటం కష్టం అని వారందరూ మహర్షితో చెప్పారు. దానికి ఆయన 'చూడండి. మీకు మంచీ చెడు తెలిసిపోయాయి, ఆ విద్యార్థికి ఇంకా తెలియనందువలనే ఇలాంటి తప్పుచేసాడు మీరంతా బయటకు వెళ్లి బ్రతకగలరు కానీ అతనికి మరికొంత కాలం విద్య అవసరం కాబట్టి నేను నా సహాయం అవసరమైన శిష్యుడిని వదులుకోలేను. సంపూర్ణ ఆరోగ్యవంతుని కంటే అనారోగ్యంతోఉన్న వారికే కదా వైద్యుని అవసరం ఎక్కువ'. అని శిష్యులను సమాధాన పరచి పంపివేశాడు. పై కథను పదేపదే ప్రస్తావించడమే కాకుండా అందులోని గురువు ధర్మాన్ని అక్షరాలా అలాగే నిలుపుకున్న మహానుభావుడు మరెవరో కాదు. భారత దేశం నుండి 27 సార్లు నోబెల్ పురస్కారానికి నామినేట్ చేయబడిన ఉత్తమ ఉపాధ్యాయుడు, స్వతంత్ర భారత ప్రథమ ఉప రాష్ట్రపతి శ్రీ. సర్వేపల్లి రాధా కృష్ణన్ గారు.

6 తేడాలను కనిపెట్టండి





కుక్కలు ఎన్ని ఉన్నాయి?



సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 402

6					3		2	
3								7
	1	5	8					
1			7	4		2		
		7				6		
		4		2	5			1
					7	8	1	
5								4
	6		1					9

సుడోకు - 401 సమాధానం

8	3	1	5	7	6	9	4	2
9	7	4	2	8	3	5	1	6
5	2	6	4	1	9	3	8	7
3	8	9	6	4	5	7	2	1
6	1	7	3	2	8	4	9	5
2	4	5	1	9	7	6	3	8
4	5	8	7	3	2	1	6	9
1	6	2	9	5	4	8	7	3
7	9	3	8	6	1	2	5	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.